thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 67 కరీంనగర్ ఆదివారం, 18 మే 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## చైనా సరికొత్త హైడ్రోజన్ బాంబు

న్యూఢిల్లీ : అణ్వస్త్రాల తరహాలో కాకుండా సాధారణ బాంబుల్లోనే అత్యధిక విధ్వంసం సృష్టించగల హైడ్రోజన్ బాంబును చైనా విజయవంతంగా పరీక్షించింది. ఏకంగా 1000 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతను వెలువరిస్తూ, కొన్ని సెకన్ల పాటు అగ్ని గోళం (ఫైర్ బాల్) నిలిచి ఉండే ఈ బాంబులతో.. తీవ్రమైన విధ్వంసం జరగడమే కాదు అల్యూమినియం అల్లాయ్ వంటి లోహాలు కరిగి, రక్షణ పరికరాలు, సామగ్రి దెబ్బతింటాయని చెబుతున్నారు. చైనా చేసిన ఈ ప్రయోగాత్మక పరీక్ష వివరాలతో సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ పత్రిక తాజాగా కథనాన్ని ప్రచురించింది. చైనా షిప్ బిల్డింగ్ కార్పొరేషన్ పరిధిలోని '705 రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' ఈ హైడ్రోజన్ బాంబు పరీక్షను నిర్వహించినట్టు తెలిపింది.




## హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండలకు ధీటుగా...

# ఫ్యూచర్ సిటీ నిర్మాణం

## కొత్త నిర్మాణాలకు అనుమతులిచ్చే బాధ్యతలు
## లేఔట్స్, వెంచర్స్‌కు పర్మిషన్లు కూడా అథారిటీదే

హైదరాబాద్ : ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇందులో భాగంగా ఇటీవల స్పెషల్‌గా ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్‌అథారిటీ (ఎఫ్‌సీడీఏ) ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దాని రూపురేఖలు, నిర్మా ణం ఎలా ఉండాలనే దానిపై కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది. ఉన్నతాధికారులు చెప్పిన వివరాల మేరకు.. హెచ్ఎండీఏ మాదిరిగానే ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం హెచ్ఎండీఏకు ఉన్నట్టుగానే ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్‌అథారిటీకి కమిషనర్‌గా ఐఏఎస్ ను నియమించారు. ప్లానింగ్, ఇంజినీరింగ్ వంటి ప్రధాన విభాగాలను ఏర్పాటు చేయనున్నారు. హెచ్ఎండీఏ మాదిరిగానే ఎఫ్‌సీడీఏకు సీఎం చైర్మన్‌గా వ్యవహరిస్తారు. హెచ్ఎండీఏ దాదాపు13 వేల చదరపు కిలోమీటర్లు విస్తరించింది. ఎఫ్?సీడీఏ 765 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్నారు. భవిష్యత్‌లో ఫ్యూచర్ సిటీని అవసరాలకు అనుగుణంగా విస్తరించే ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలోనే ఏర్పాటయ్యే ఫ్యూచర్ సిటీ దశల వారీగా అభివృద్ధి చేసి విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

**ఫ్యూచర్ సిటీ విధులు ఇలా..** ఫ్యూచర్ సిటీలోకి మహబూనగర్ జిల్లా ముచ్చెర్ల, రంగారెడ్డి జిల్లా శంషాబాద్, మహేశ్వరం, తుక్కుగూడ, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాలు వస్తున్నాయి. దీంతో ఇటు శ్రీశైలం హైవే, అటు మహబూబ్‌నగర్‌వైపు భారీగా అభివృద్ధి జరిగే చాన్స్ ఉంది. తాజాగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ఫ్యాబ్ సిటీలో కానీ, తుక్కుగూడ, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, శంషాబాద్ పరిధిలో కొత్త లే అవుట్లకు కానీ, వెంచర్లకు, భారీ నిర్మాణాలకు పర్మిషన్లు ఇవ్వనుందని అధికారులు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన బాధ్యతలు కూడా ఫ్యూచర్ సిటీ అథారిటీకే ఉంటుంద ని పేర్కొన్నారు. అభివృద్ధే లక్ష్యంగా అథారిటీ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటి ద్వారానే భారీ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వనున్నారు. ఫ్యూచర్‌సిటీ లో ఏర్పాటయ్యే పరిశ్రమలు, ఐటీ సంస్థలు, ఇతర నిర్మాణాలకు అనుమతులను కూడా అథారిటీనే ఇవ్వనుంది. రాబోయే రోజుల్లో ఎఫ్‌సీడీఏ పరిధిలో హైరైజ్ భవనాల ను నిర్మించే సంస్థలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఐటీ, మెడికల్‌ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో పాటు భారీ ఎత్తున మల్టినేషనల్ సంస్థలకు ప్రత్యేక రాయితీలు ఇచ్చే చాన్స్ ఉందంటున్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ సిటీలకు దీటుగా ఫ్యూచర్ సిటీ ఉండబోతున్నట్టు అధికారులు తెలిపారు.




## సరిహద్దుల్లో జవాన్.. ఇక్కడ భూమి కబ్జా..

సిద్దిపేట, మే 17: జిల్లాలోని దుబ్బాక మండలంలో ఆర్మీ జవాన్ భూమి కబ్జా తీవ్ర కలకలం రేపుతోంది. తన భూమిని కబ్జా నుంచి కాపాడాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జవాన్ సోషల్ మీడియాలో వీడియో ద్వారా విజ్ఞప్తి చేశారు. దేశ సరిహద్దుల్లో తాను పోరాడుతుంటే తమ భూమిని కబ్జా చేశారంటూ అక్బర్‌పేట మండలం చౌదర్‌పల్లికి చెందిన రామస్వామి అనే ఆర్మీ జవాన్ సెల్ఫీ వీడియోను విడుదల చేశారు. తమ భూమిని కబ్జాదారుల చెర నుంచి విడిపించి తమకు ఇప్పించాలంటూ సీఎం రేవంత్ రెడ్డికి సదరు జవాన్ వీడియోలో విన్నవించారు. ప్రస్తుతం ఈ వీడియో రాష్ట్రవ్యాప్తంగా హాట్‌టాపిక్‌గా మారింది.

**వీడియోలో ఏముందంటే...** దేశం సరిహద్దుల్లో తాను పోరాడుతుంటే తన సొంత గ్రామంలో తన భూమిని కొంత మంది కబ్జా చేశారని జవాన్ రామస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. భూమి విషయంలో నిలదీస్తున్న తన తల్లిదండ్రులు, కుటుంబాన్నీ కబ్జాదారులు బెదిరిస్తున్నారని తెలిపారు. తమ భూమిని కబ్జా చేసిన వ్యక్తి సోదరుడు వీఆర్వో కావడంతో అధికారులంతా వారికే మద్దతు తెలుపుతున్నారని జవాన్ ఆరోపించారు. స్థానిక ఎమ్మార్వో సైతం కబ్జాదారుడి తరపునే మాట్లాడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆవేదన చెందారు.

తన భూమిని తనకు ఇప్పించాలంటూ ఆర్డీవో, జిల్లా అధికారులు, కలెక్టర్‌ను కలిసినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. ఎలాగైన తమ భూమిని తిరిగి ఇప్పించాలని వీడియో ద్వారా సీఎం రేవంత్ రెడ్డికి జవాన్ విజ్ఞప్తి చేశారు.



## త్వరలో తెలంగాణ రైజింగ్ విజన్ బోర్డు ఏర్పాటు: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఆర్థికశాస్త్ర నిపుణుడు, నోబెల్ అవార్డు గ్రహీత అభిజిత్ బెనర్జీ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. త్వరలో తెలంగాణ రైజింగ్ విజన్ బోర్డు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ఈ బోర్డులో భాగస్వామ్యం కావాలని అభిజిత్ బెనర్జీని కోరగా.. అందుకు ఆయన అంగీకరించారు. ఫ్యూచర్ సిటిలో ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, సృజనాత్మకతను భాగం చేయాలని అభిజిత్ బెనర్జీ సూచించారు. సంప్రదాయ చేతివృత్తుల వారిని ఆధునిక వ్యాపారవేత్తలుగా మార్చేందుకు ప్రత్యేక స్వల్పకాలిక కోర్సులు నిర్వహించాలని సలహా ఇచ్చారు.




## స్కీమ్‌లు, కీలక ప్రాజెక్టులకు

# సర్కార్ నిధుల వేట!

## ఇప్పటికే వివిధ ఆర్థిక సంస్థలతో సంప్రదింపులు

హైదరాబాద్ : కీలక ప్రాజెక్టులకు, పథకాల అమలుకు నిధుల సర్దుబాటుపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. రానున్న మూడు నెలల్లో కనీసం రూ.35 వేల కోట్ల మేర ఫండ్స్?ను మొబిలైజ్? చేసే పనిలో పడింది. పెండింగ్‌లో ఉన్న యాసంగి రైతుభరోసా సొమ్మును పూర్తి స్థాయిలో రిలీజ్ చేయాలని సీఎం నుంచి ఆదేశాలు వెళ్లాయి. ఇప్పటి వరకు నాలుగు ఎకరాలలోపు రైతులకు రైతు భరోసా అందింది. మిగిలిన మొత్తానికి మే రెండో వారంలోపు పంపిణీ పూర్తి చేయాలని అధికారులు ప్లాన్ చేస్తున్నారు. ఇక, త్వరలో ప్రారంభమయ్యే వానాకాలం సీజన్?కు కూడా రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించాల్సి ఉంటుంది. ఇందుకోసమూ ఇప్పటి నుంచే నిధులను సమకూర్చే పనిలో ప్రభుత్వం నిమగ్నమైంది. ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసానికి సంబంధించి కూడా ఆర్థిక శాఖ యాక్షన్ ప్లాన్ రెడీ చేస్తున్నది. ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రీజినల్? రింగ్? రోడ్డు, మెట్రో విస్తరణ, రేడియల్ రోడ్లకు రాష్ట్ర ప్రభుత్వ వాటా ఇచ్చేందుకూ నిధులను సమకూర్చుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటికే వివిధ ఆర్థిక సంస్థలతో రాష్ట్ర సర్కార్ సంప్రదింపులు జరుపుతున్నది. ఇతర ఆదాయ మార్గాలపైనా దృష్టి పెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం రీజినల్ రింగ్‌ల రోడ్డు, మెట్రో ఫేజ్ 2, రేడియల్ రోడ్ల నిర్మాణం కోసం రానున్న మూడు నాలుగు నెలల్లో కనీసం రూ.3 వేల కోట్లు సర్దుబాటు చేయాల్సి ఉన్నది. కేంద్రం నుంచి నిధులు కేటాయించాలని అడిగినప్పటికీ ఎలాంటి స్పందన రాలేదు. దీంతో జైకా వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థలతో పాటు దేశంలోనూ వివిధ సంస్థలతో రుణాల కోసం సంప్రదింపులు చేస్తున్నది. మరికొంత ఖజానా నుంచే చెల్లించాల్సి ఉంటుంది. 340 కిలో మీటర్ల మేర ఉన్న ట్రిపుల్ ఆర్ ఉత్తర, దక్షిణ భాగాలకు మొత్తం రూ.34,367.62 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే నార్త్‌ఫేజ్ డీపీఆర్ తుది దశకు చేరుకున్నది. ఇక సౌత్ ఫేజ్ డీపీఆర్ కోసం టెండర్ల ప్రక్రియ నడుస్తున్నది. కేంద్ర ప్రభుత్వం ఈ రోడ్లను నిర్మించనున్నప్పటికీ భూసేకరణకు అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం మేర భరించాల్సి ఉంటుంది. ఇందుకు మూడునెలల్లో దాదాపు రూ.1,500 కోట్లు అవసరం అవుతాయని అంచనా. ఇక, మెట్రో ఫేజ్-2 కు రూ.24,269 కోట్లు అంచనా వేశారు. త్వరలోనే డీపీఆర్ లు ఖరారు అయితే.. దీనికి కూడా ప్రభుత్వం కొంత నిధులు వెచ్చించాల్సి ఉంటుంది. రేడియల్ రోడ్లకు దాదాపు రూ.7 వేల కోట్లు అవసరమని అంచనా వేయగా.. జైకా నుంచి రూ.380 కోట్లు అందుబాటులో ఉన్నాయి. ఇతర రుణ సంస్థలతోనూ చర్చలు జరుగుతున్నాయి. రేడియల్? రోడ్లకు సంబంధించి జులై నాటికి తక్షణ అవసరాల కోసం కనీసం రూ.1,000 కోట్ల మేర అయినా ఖర్చు చేయాల్సి ఉంటుందని అధికారులు చెప్తున్నారు.

**ఆదాయ మార్గాలపై ఫోకస్...** రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం బాగానే ఉన్నప్పటికీ.. ఇందులో ఎక్కువ మొత్తం గత ప్రభుత్వం చేసిన అప్పుల కిస్తీలు, వడ్డీలు, పాత పెండింగ్ బిల్లుల చెల్లింపులకు, ఉద్యోగుల జీత భత్యాలు, పెన్షన్లు, రెగ్యులర్‌గా నెలా నెలా ఇవ్వాల్సిన ఆసరా పెన్షన్‌లకే పోతున్నది. దీంతో వివిధ ఆర్థిక సంస్థల నుంచి రుణాలు తీసుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నది. ఆదాయ మార్గాల్లో భాగంగా ఎల్ఆర్ఎస్ అప్లికేషన్లను క్లియర్ చేస్తున్నది.

రిజిస్ట్రేషన్లు, లిక్కర్ ఆదాయంపైనా ఫోకస్ పెట్టింది. ఆదాయం పెంపుపై ప్రతిపాదనలు తీసుకురావాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వానికి ప్రతినెలా యావరేజ్ గా ట్యాక్స్, నాన్ ట్యాక్స్ రెవెన్యూ రూ.18 వేల కోట్ల దాకా వస్తున్నది. అయితే ఖర్చులు మాత్రం రూ.23 వేల కోట్లు చేయాల్సి ఉన్నది. చేయూత పెన్షన్లు, ప్రతినెలా ఇతర గ్రీన్ ఛానెల్ పథకాలకు దాదాపు రూ.2 వేల కోట్లు, ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పెన్షన్లకు రూ.5 వేల కోట్లు, అప్పుల కిస్తీలు, వడ్డీలకు రూ.6,500 కోట్లు చెల్లిస్తున్నది. పెండింగ్ బిల్లులకు, ఇతర అత్యవసరాలకు రూ.4 వేల కోట్లు ఇస్తున్నారు. దీంతో మిగిలిన పథకాలకు, ప్రాజెక్టులకు నిధుల కొరత ఏర్పడుతున్నది.

**మూడు స్కీములకు ఇట్ల..!** ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద నిరుపేదలకు రూ.5 లక్షల సహాయం అందించేందుకు రూ. 12,571 కోట్లు కేటాయించారు. ఇందులో కొంత కేంద్రం నుంచి పీఎంఏవై పథకం కింద రూ.4,600 కోట్లు రానున్నాయి. ఇక కొంత రుణాన్ని ప్రభుత్వం ఇప్పటికే తీసుకున్నది. మిగిలిన మొత్తం ఖజానా నుంచే ఇవ్వనుంది. ప్రతి మండలానికి ఒక గ్రామం చొప్పున 70,122 మంది లబ్ధిదారులను తొలివిడతలో గుర్తించారు. ఈ పథకంలో దాదాపు 14 వేల ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ పనులు ప్రారంభం కాగా.. 1,800 ఇండ్ల బేస్మెంట్ నిర్మాణం పూర్తయింది. వీరికి చెల్లింపులు మొదలుపెట్టారు. పైగా ఇవన్నీ గత ఆర్థిక సంవత్సరం కింద మంజూరైనవే కావడం.. ఈసారి మరిన్ని ఇండ్లు మంజూరు చేయాల్సి ఉండటంతో కనీసం రూ.5 వేల కోట్లు మూడు నెలల కోసం ప్రభుత్వం సిద్ధం చేసుకుంటున్నది. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల నిరుద్యోగ యువతకు రూ.2.40 లక్షల వరకు సబ్సిడీ రుణాల కింద రూ. 6 వేల కోట్ల ఇవ్వాల్సి ఉన్నది. జూన్ 2 తర్వాత నుంచి ఈ మొత్తాన్ని పంపిణీ చేయనున్నారు. యాసంగి పెట్టుబడి సాయం నిధుల జమ గత రెండు నెలల కిందటి నుంచే జరుగుతున్నది.

ఇప్పటి వరకు నాలుగు ఎకరాలలోపు రైతులకు రైతు భరోసా అందింది. త్వరలోనే 4 ఎకరాలు, ఆ పైన ఉన్న రైతులందరికీ కూడా పూర్తి స్థాయిలో నిధులు రిలీజ్ చేయనున్నారు. ఇందుకోసం రూ. 4 వేల కోట్ల మేర అవసరమని అధికారులు చెప్తున్నారు. వీటిని పంపిణీ చేస్తే యాసంగి రైతు భరోసా కంప్లీట్ అవుతుంది. ఇక, రానున్న జూన్ లేదా జులై నెలలోనే మళ్లీ వానాకాలం పెట్టుబడి సాయాన్ని రైతు భరోసా పేరుతో ప్రభుత్వం అందించాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి కూడా కొంత కసరత్తు చేసి అందించనుంది. ఇందుకు దాదాపు రూ.9 వేల కోట్లు అవసరమవుతాయి.




# రామోజీ ఫిల్మ్‌సిటీకి మిస్‌వరల్డ్ పోటీదారులు

హైదరాబాద్: మిస్‌వరల్డ్ పోటీదారులు శుక్రవారం సాయంత్రం ప్రపంచ ప్రఖ్యాత రామోజీ ఫిల్మ్‌సిటీకి విచ్చేశారు. ప్రత్యేక బస్సుల్లో చేరుకున్న విదేశీ ముద్దుగుమ్మలకు రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రతినిధులు, అధికారులు.. ముత్యాల దండలు వేసి, కుంకుమ బొట్లు పెట్టి సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రామోజీ ఫిల్మ్‌సిటీ సైనేజ్ వద్ద గ్రూప్ ఫొటోకు సుందరీమణులు పోజులిచ్చారు. అనంతరం ఫిల్మ్‌సిటీ అందాలను 108 మంది మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లు తిలకించారు.




హైదరాబాద్: డ్రగ్స్ కట్టడిలో ప్రపంచంలోనే తెలంగాణ అగ్రస్థానం సాధించడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. 138 దేశాలతో పోటీపడి ప్రథమ స్థానం సాధించడం గర్వంగా ఉందని చెప్పారు. ఈ ఘనత సాధించిన హైదరాబాద్ నగర సీపీ సీవీ ఆనంద్, ఆయన బృందానికి అభినందనలు తెలిపారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణకు కృషి చేస్తున్న ప్రతి పోలీసుకు మద్దతుగా ఉంటామన్నారు. ప్రపంచానికే తెలంగాణ రోల్ మోడల్‌గా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని పేర్కొన్నారు.




భూపాలపల్లి: కాళేశ్వరం సరస్వతి నది పుష్కరాలు ఘనంగా సాగుతున్నాయి. పుష్కర ఘాట్‌లో మూడో రోజు పుణ్యస్నానాలు ఆచరించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కాళేశ్వరం ముక్తేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. శుక్రవారం రాత్రి గాలివాన బీభత్సం కారణంగా రహదారులన్నీ బురదమయంగా మారాయి. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం ప్రత్యేక హెలికాప్టర్‌లో కాళేశ్వరానికి చేరుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పుణ్య స్నానం ఆచరించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. కాళేశ్వరం ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్నారు. **పుష్కరాలకు వెళ్లే భక్తులకు టోల్ ట్యాక్స్ రద్దు...** కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు వెళ్లే భక్తుల వాహనాలకు టోల్ ట్యాక్స్ రద్దు చేశారు. ఈమేరకు భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ ప్రకటించారు. వాహనాల రద్దీ నియంత్రణకు టోల్ ట్యాక్స్ రద్దు చేసినట్లు ప్రకటించారు.




## ఆర్టీసీ బస్సెక్కిన మంత్రి పొన్నం ప్రభాకర్.. సౌకర్యాలపై ఆరా!

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హైదరాబాద్‌లో ఆర్టీసీ సిటీ బస్సులో ప్రయాణించారు. ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మిలతో కలిసి జిల్లా కలెక్టరేట్‌కు కారులో వెళ్తున్న ఆయన.. మార్గమాధ్యలో బస్సెక్కారు. ప్రయాణికులతో ముచ్చటించారు. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా కావాల్సిన సౌకర్యాలు కల్పించడంతో పాటు భవిష్యత్తులో బస్సుల సంఖ్యను పెంచుతామని మంత్రి పొన్నం చెప్పారు.


**THE GAYATRI CO-OPERATIVE URBAN BANK LTD, JAGTIAL.**
(Multi State Co-Operative Bank) (MSCS/CR/1290/2019)
#1-5-171/A, Gayatri Towers-II, Karimnagar Road, JAGTIAL-505327 (Dist.) TELANGANA.

**ELECTION NOTIFICATION**

All the Member's of the Gayatri Co-Operative Urban Bank Ltd., Jagtial are hereby informed that, I have been appointed as Returning Officer for the Gayatri Co-Op. Urban Bank Ltd., Jagtial to conduct elections for Board of Directors and Office Bearers under Multi State Cooperative Societies Act 2002 and MSCS Rules 2002, as amended with MSCS Act & Rules 2023 by the Cooperative Election Authority, Ministry of Cooperation, Government of India, New Delhi, vide its Orders No. 12011/204/2024, dated: 31-12-2024. As per the election programme given by the competent authority, the election will be conducting on 08-06-2025, from 8.00 AM to 4.00 PM, as per the following Schedule programme, to elect 11 Directors of the Board of the Gayatri Co-Operative Urban Bank Ltd., Jagtial as per provisions of the Bye-Laws of the said Bank and Rule, 19 of Multi State Co-Operative Societies Rules, 2002 as amended in 2023 with MSCS Rules as 2023.The Following is the Detailed Election Programme/Schedule to elect the Board of Directors of the Gayatri Co-perative Urban Bank Ltd., Jagtial:

1. a) Name of the Bank: The Gayatri Co-Operative Urban Bank Ltd.,
   b) Registered No. : MSCS/CR/1290/2019.
   c) Address of the Bank (Registered Office): #1-5-171/A, Gayatri Towers-II, Karimnagar Road Jagtial Town, Dist:Jagtial, Telangana State.
2. Mode of Election: By Secret Ballot
3. Number of Directors to be elected: General-08, SC/ST-01, Women-02. Total-11

**DETAILED PROGRAMME/SCHEDULE**

| Date | Time | Programme | Place |
|---|---|---|---|
| 16-05-2025 Fri | 11:00 AM | Publication of Provisional List of Members/Delegates, Eligible to Vote | Head Office, Conference Hall, 4th Floor, The Gayatri Co-Operative Urban Bank Ltd., Jagtial And in the Notice Board Menu of Website of the Bank (www.gayatribank.in/notice-board/) |
| 17-05-2025 to 20-05-2025 Sat to Tue | 11:00 AM to 3:00 PM | Time Window for Raising Objection to the Provisional List | Head Office, Conference Hall, 4th Floor, The Gayatri Co-Operative Urban Bank Ltd., Jagtial. |
| 21-05-2025 to 23-05-2025 Wed to Fri | 11:00 AM to 03:00 PM | Scrutiny of Objection received to the Provisional List (if any) | Head Office, Conference Hall, 4th Floor, The Gayatri Co-Operative Urban Bank Ltd., Jagtial. |
| 24-05-2025 Sat | 11:00 AM | Publication of Final List of Members/Delegates, Eligible to Vote | Head Office, Conference Hall, 4th Floor, The Gayatri Co-Operative Urban Bank Ltd., Jagtial. |
| 26-05-2025to 30-05-2025 Mon to Fri | 11.00 AM to 03.00 PM | Issue and Filing of Nomination Form | Head Office, Conference Hall, 4th Floor, The Gayatri Co-Operative Urban Bank Ltd., Jagtial. |
| 30-05-2025 Fri | 5.00 PM | Publication of total List of Nominations Received. | Head Office, Conference Hall, 4th Floor, The Gayatri Co-Operative Urban Bank Ltd., Jagtial. |
| 31-05-2025 Sat | 11:00 AM to 03:00 PM | Scrutiny of Received Nomination Forms | Head Office, Conference Hall, 4th Floor, The Gayatri Co-Operative Urban Bank Ltd., Jagtial. |
| 31-05-2025 Sat | 5:00 PM | Publication of List of Valid Nominations | Head Office, Conference Hall, 4th Floor, The Gayatri Co-Operative Urban Bank Ltd., Jagtial. |
| 02-06-2025 Mon | 11:00 AM to 03:00 PM | Withdrawal of Nominations | Head Office, Conference Hall, 4th Floor, The Gayatri Co-Operative Urban Bank Ltd., Jagtial. |
| 02-06-2025 Mon | 5:00 PM | Publication of Final List of Contesting Candidates | Head Office, Conference Hall, 4th Floor, The Gayatri Co-Operative Urban Bank Ltd., Jagtial. |
| 08-06-2025 Sun | 08:00 AM to 04:00 PM | Polling | listed below |

1. **Government Old High School,** Old Busstand, Jagtial. (For voters of Jagtial Main, Jagtial Town, Korutla, Metpally, Raikal,Dharmapuri,Dharmaram,Gollapally,Pegadapelly, Mancherial, Naspur, Mandamarri, & Bellampally, Karimnagar Main, Karimnagar Town, Husnabad, Siricilla, Vemulawada, Jammikunta, Peddapally,Godhavarikhani, Armoor, Nirmal, Nizamabad, Branches) **2. The Gayatri Co-Operative Urban Bank Ltd., Branch: Vidya Nagar:** # 2-1-565, Vertex Padigram Complex, University Road, Vidyanagar, Hyderabad - 500044. (For Voters of Dilsukhknagar, LB nagar, Nagaram, Vidyanagar, Jawarharnagar, Meerpet, Koti (Hyderabad), KPHB Colony, Manikonda, Boduppal, Kompally, Kukatpally, Narsingi & Sangareddy Siddipet, Kamareddy, Warangal, Hanamkonda, Bheemaram, Bhongir, Alair, Yadagirigutta, Jangoan, Thirumalgiri Khammam, Kodad, Khanapuram Haveli, Yellandu, Kothagudem, Palwancha, Mahaboobabad & Mothkur Branches Branches )**3. The Gayatri Co-Operative Urban Bank Ltd., Branch: Bhimavaram:** # 23-4-77, Gouse Saheb Street, Town Hall Road, Bhimavaram, West Godhavari District - 534 201, Andhra Pradesh. (For Voters of Bhimavaram, Srirampuram, Vijayawada Main , Vijayawada Town, Guntur, & Nuzividu, Branches).

| | | | |
|---|---|---|---|
| 10-06-2025 Tue | 08:00 AM onwards | Counting of votes | Head Office, Conference Hall, 4th Floor, The Gayatri Co-Operative Urban Bank Ltd., Jagtial. |
| 13-06-2025 Fri | After Approval of Cooperative Election Authority NewDelhi on Format 19M | Declaration of Result of Board of Directors | Head Office, Conference Hall, 4th Floor, The Gayatri Co-Operative Urban Bank Ltd., Jagtial. |

**ELECTION PROGRAM OF OFFICER BEARER**

| | | | |
|---|---|---|---|
| 14-06-25 Sat | After Declaration of Results of Board Members Election | Announcement of Election Schedule I.Time window for filing nominations II.Scrutiny of nomnation papers III.Time and date for withdrawal IV.Display of List of the contesting candidate and schedule of election. | Head Office, Conference Hall, 4th Floor, The Gayatri Co-Operative Urban Bank Ltd., Jagtial. |
| 16-06-2025 Mon | 11:00 AM Onwards | Meeting of Newly Constituted Board & Publication of List for Valid Nominations, Polling (if Required) | Head Office, Conference Hall, 4th Floor, The Gayatri Co-Operative Urban Bank Ltd., Jagtial. |
| After approval of Cooperative Election Authority, New Delhi on Format 19N | | Declaration of Result of Election of Office Bearers | |

**Note:**1.All the members of the Bank may verify the list of members eligible to vote, kept available with the Head Office and its Branches as per the notice displayed on the Notice Board of the Bank, and also available at www.gayatribank.in/notice-board/ 2.The Nomination Forms may be obtained free of cost from the Returning Officer or the Authorised Officer on a written request from 26-05-2025 To 30-05-2025 (on working days only) from 11.00 AM to 3.00 PM at the Head Office of the Gayatri Co-Operative Urban Bank Ltd., #1-5-171/A, Gayatri Towers-II, Karimnagar Road, Jagtial Town, Dist: Jagtial - 505327, Telangana State.3.Every Nomination Form shall be signed by the two members whose names are included in the list of eligible voters, one of whom shall sign the form as Proposer and the other as Seconder. The Nomination Paper shall also contain a declaration signed by the candidate expressing his/her willingness to stand for election. A member can either propose and second for one candidate only.4.The Nomination Form along with a non-refundable fee as prescribed in the table below by Cash or DD favouring 'Returning Officer' The Gayatri Co-Op Urban Bank Ltd., towards nomination fee shall be presented in person or sent by registered post with Acknowledgement due to the Returning Officer or to any person authorized by the Returning Officer, so as to reach on or before the Date and Time specified in the Election Programme/ Schedule. SC/ST - Rs.1000/-, BC/OBC - Rs.2000/-, Others - Rs.4000/-The members claiming relaxation fees on the above grounds shall produce their relevant Caste Certificate issued by the Competent Authority. 5.A Candidate willing to withdraw his/her nomination shall submit his/her request in person or by the person authorized by the Candidate in writing in the prescribed form before the Date & Time specified in Election Programme.6.The allotment of symbols by the Returning Officer to a candidate shall be final.7.The voters are requested to produce any one of the Photo identity cards issued by Government Authorities or Issued by the Bank. Members/Voters will not be allowed to enter the place of polling without Photo Identity Proof.8.The intending contesting candidates may obtain the voters list from the Bank/Returning Officer on payment of Rs. 1000/-.9.Where a representative on behalf of Firm/Company/Trust/Society is authorized to Exercise the vote, he/she will be allowed to vote only on production of Identity Card Issued by the Bank along with personal Identity Card as mentioned above at Sl. No. 7 above. Further if the representative also happens to be an individual member of the Bank, he/she will have only one vote but cannot exercise vote twice

**Date: 16-05-2025** **Sd/- B. Satya Prasad,IAS, DIST COLLECTOR, JAGTIAL/RETURNING OFFICER**


# ట్యాంక్‌బండ్‌పై 'తిరంగా ర్యాలీ'.. పాల్గొన్న ప్రముఖులు





హైదరాబాద్: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయాన్ని పురస్కరించుకొని, మన దేశ సైనికులకు సంఘీభావంగా హైదరాబాద్ ట్యాంక్ బండ్ రోడ్డులో తిరంగా ర్యాలీ నిర్వహించారు.

ఈ ర్యాలీలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు పాల్గొన్నారు. భారత్ మాతా కీ జై అంటూ నినాదాలు చేశారు. ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న డాక్టర్. బీఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి ప్రారంభమైన 'తిరంగా ర్యాలీ'.. సచివాలయం జంక్షన్ మీదుగా సైనిక ట్యాంక్ వరకు కొనసాగింది.


# మంత్రి శ్రీధర్‌బాబుపై కేసును కొట్టివేసిన నాంపల్లి కోర్టు

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు భూ సేకరణ అంశంలో మంత్రి శ్రీధర్‌బాబుపై సహా 13 మందిపై నమోదైన కేసును నాంపల్లి కోర్టు కొట్టివేసింది. 2017లో శ్రీధర్‌బాబుతోపాటు పలువురు కాంగ్రెస్ నేతలపై అప్పటి ప్రభుత్వం కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే. కేసును కోర్టు కొట్టివేసిన అనంతరం శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడారు. భూములు కోల్పోతున్న రైతుల తరఫున పోరాడితే కేసులు పెట్టారని, చివరికి న్యాయమే గెలిచిందని అన్నారు. " కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రజా విచారణ చేస్తున్న సందర్భంగా రైతుల హక్కులను కాపాడేందుకు వినతిపత్రాన్ని ఇవ్వాలని వెళ్లాము. అధికారం అండతో మాపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఎనిమిదేళ్లపాటు ఈ కేసు నడిచింది. తాజాగా న్యాయస్థానం కొట్టివేసింది. ఇది ప్రజా విజయం. రైతుల విజయం. పేద రైతు ఘోషను న్యాయస్థానం విన్నది. అధికారం ఉందని నాడు కేసులు పెట్టారు. పోలీసులను అడ్డగోలుగా వినియోగించుకున్నారు. కానీ, ఇవాళ ప్రజాస్వామ్యం ఉంది. చట్టాలను నమ్ముతూ మేం ముందుకు వెళ్తున్నాం. మాకు అధికారం ఉందని ఎక్కడా దుర్వినియోగం చేయడం లేదు. భారాస ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కూడా నిలవలేదు. దానిపైనా విచారణ జరుగుతోంది. తప్పు చేసిన వాళ్లు కచ్చితంగా శిక్ష అనుభవించాల్సిందే" అని అన్నారు.




పాకిస్థాన్ సహా, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉన్న ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసేందుకు మన బలగాలు ఆపరేషన్ సిందూర్ ను నిర్వహించిన సంగతి తెలిసిందే. ఆపరేషన్ జరిగిన వెంటనే భారత జలాల్లో చైనాకు చెందిన గూఢచారి నౌక '%ఖుఫ్‌ఖఅస్త్ర్‌ఆ ఝుశీ%' కదలికలు కనిపించడం చర్చనీయాంశమైంది. ఇది పాక్-చైనా బంధాన్ని తెలిపేలా ఉందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు జాతీయ మీడియా కథనం రాసుకొచ్చింది. 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో చైనా నౌక భారత జలాలకు సమీపంలో సంచరించడం పలు అనుమానాలకు తావిచ్చింది. మన సముద్ర జలాల్లోని భారత నౌకల కదలికలు, నిఘా, ప్రతిస్పందన సామర్థ్యాన్ని, జలాంతర్గాముల కదలికలను హైడ్రోగ్రాఫిక్ పరికరాల సాయంతో చైనా పసిగట్టే అవకాశం ఉందని ఆ వర్గాలు వెల్లడించాయి. ఆపరేషన్ సిందూర్ తర్వాత అరేబియా సముద్రం, హిందూ మహాసముద్రంలో ఉత్తరం వైపు మన నౌకాదళం అత్యంత అప్రమత్తమైన సంగతి తెలిసిందే. ఐఎన్ఎస్ విక్రాంత్, బ్రహ్మోస్ క్షిపణులతో కూడిన యుద్ధ నౌకలు, జలాంతర్గాములను మోహరించింది. ఆ గూఢచారి నౌకకు ఉన్న అధునాతన సెన్సర్లతో ఐఎన్ఎస్ విక్రాంత్ సహా భారత యుద్ధ నౌకల కదలికలను పసిగట్టేందుకు వీలుంది. పాక్‌కు తమ మద్దతు ఉందని సంకేతాలు పంపేందుకు, నిఘా సమాచారాన్ని సేకరించేందుకు ఈ మోహరింపు ఉపయోగించుకొని ఉండొచ్చని అనుమానాలు. ఒకవేళ పాకిస్థాన్‌లోని కరాచీపై భారత్ దాడి చేసేందుకు సన్నాహాలు చేస్తే, వాటిని ముందుగానే పసిగట్టి, సదరు సమాచారాన్ని పాకిస్థాన్‌కు తెలియజేసేలా ఈ మోహరింపు ఉండి ఉండొచ్చు. చైనా ప్రతిష్ఠాత్మక బెల్ట్ అండ్ రోడ్ ఇన్షియేటివ్ (బీఆర్ఐ) కింద చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ నిర్మాణం జరుగుతోంది. పాక్ ఆక్రమిత కశ్మీర్ మీదుగా సీపెక్ ప్రాజెక్టు చేపట్టడంపై భారత్ మొదట్నుంచీ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తంచేస్తోంది. ఈ ప్రాజెక్టు పనులు పూర్తి కావాలంటే పాక్‌లో రాజకీయంగా, ఆర్థికంగా స్థిరమైన పరిస్థితులు ఉండటం డ్రాగన్‌కు అత్యంత కీలకం. అది కూడా నిఘా వెనక కారణం కావొచ్చు. ఈ నౌక భారత నౌకాదళ విభాగాల మధ్య కమ్యూనికేషన్‌ను అడ్డంకులు సృష్టించగలదు. యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్‌లో కీలకమైన జలాంతర్గాముల రాకపోకలను ఇది మ్యాప్ చేయగలదు. అలాగే ఇక్కడ సేకరించిన సమాచారాన్ని పాక్‌లో నిర్మించాలనుకుంటున్న మిలిటరీ లాజిస్టిక్స్ బేస్ కోసం ఉపయోగించుకోవచ్చు. హిందూ మహాసముద్రంలో ఇలా చైనా నౌకల కదలికలు ఉండటం ఇదే తొలిసారి కాదు. 2024లో యువాన్ వాంగ్-6 వంటి నౌకలను మోహరించింది. ఈ ప్రాంతంతో భారత ఆధిపత్యాన్ని సవాలు చేసే లక్ష్యంగానే ఈ చర్యలు ఉన్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.

# స్త్రీ స్వేచ్ఛకు ప్రతిబింబం... గుడిపాటి వెంకట చలం - మే 18...చలం జయంతి



తెలుగు సాహిత్యంలో సాంప్రదాయానికి మించిన ప్రశ్నించే ధోరణి, ఆత్మ పరిశీలనతో కూడిన తాత్వికతకు ప్రతీకగా నిలిచిన రచయిత గుడిపాటి వెంకట చలం. ఆయన రచనలు నాటి తెలుగు సమాజాన్ని గణనీయంగా కదిలించాయి. స్త్రీల జీవితాలలోని మౌనాన్ని గొంతెత్తించి మాట్లాడించిన మానవతావాది, భావ చిత్రకారుడు చలం సాహిత్య జీవితం అనేక ధీమతులకి మూల పునాది. ఆత్మవేదన రచయిత అయిన చలం కలం ద్వారా ఆడవారి బాధలకు స్వరం వచ్చిందంటే అతిశయోక్తి కాదు. చలం రాసిన ప్రతి పంక్తిలో ఒక ఆత్మ అన్వేషణ, ఒక్కో వాక్యంలో ఒక తాత్విక యాత్ర దర్శనమిస్తుంది. 1894 మే 18న మద్రాసు ప్రెసిడెన్సీ లోని వల్లూరి పాలెంలో జన్మించిన చలం, సంపన్న బ్రాహ్మణ కుటుంబానికి చెందినవారు. తండ్రి కొమ్మూరి సాంబశివరావు, తల్లి వేంకట సుబ్బమ్మ. కానీ తన తాత గుడిపాటి వెంకట రామయ్య దత్తత తీసుకోవడంతో "గుడిపాటి" ఇంటిపేరు అయింది. బాల్యంలోనే ఇతిహాస, పురాణాలపై ఆసక్తి పెరిగింది. తండ్రి తల్లిపై చూపిన కఠినత, చెల్లెలి బాల్యవివాహం వంటి అనుభవాలు అతని లోపల ఒక ప్రశ్నించే మానసికతకు బీజం వేశాయి. 1911లో పిఠాపురం మహారాజా కళాశాలలో చేరిన చలం, అక్కడి బ్రహ్మ సమాజ ప్రభావిత మేధావి రఘుపతి వెంకటరత్నం నాయుడు ద్వారా బ్రహ్మ వాదానికి ఆకర్షితుడయ్యాడు. తరువాత మద్రాసులో బి.ఎ. చదువుతుండగా, భార్య రంగనాయకమ్మను సెయింట్ థామస్ కాన్వెంట్ స్కూల్‌లో చేర్పించి, ఆమెను స్వయంగా కాలేజీకి తీసుకెళ్లేంత పురోగామి మానసికత ఉన్న వ్యక్తిగా చలం కనిపించారు. ఇది అప్పటి సమాజంలో సాహసమే! కాకినాడ కళాశాల ట్యూటర్‌గా ఉద్యోగం చేస్తున్నప్పుడు చలాన్ని వ్యక్తిగతంగా, సాహిత్యంగా మలచింది. రాజమండ్రిలో ఉండగా ఆలోచనల కోసం అద్దె ఇల్లు దొరకక పోవడం, పశువుల పాకలో నివాసం ఉండడం... ఇవన్నీ అతని నిరాశ, విప్లవాన్ని సంకేతాలుగా నిలిచాయి. ఇటీవలికాలంలో కూడా చలం రచనలు చదివితే %-% "మైదానం", "బ్రాహ్మణీకం", "అమీనా", "సావిత్రి" - ప్రతి నవలలో ఒక నిజమైన స్త్రీ క్షోభ, విముక్తి కోసం కొట్టుకుంటున్న హృదయ ధ్వని వినిపిస్తుంది. ఆయన వ్యాసాలు, కథలు, ఆత్మకథ "జీవిత యాత్ర"లో ఆయుధాల్లాంటి పదబలంగా నిలిచాయి. ఆయన శైలి ప్రత్యేకం. అశ్లీలతగా అభ్యంతరాలు వచ్చినా ఆయన రాసినది అసత్యం కాదు. అది అప్పటి నమ్మకాల నరాలను వేధించే నిజం. ఆయన వాక్యాలు సహజమైనా, వాటిలోని భావం ఆలోచన కలిగించేది. తాత్వికత, ప్రేమ, స్వేచ్ఛ - ఈ మూడు ఆయన రచనలకు మూలాధారాలు. అప్పటి సమాజం ఆయనను విమర్శించినా, చలం పట్టించు కోలేదు. టాగోర్, వివేకానంద, బ్రహ్మ సమాజ భావజాలంతో మానవతా విలువలు ఆయనకు బలాన్ని ఇచ్చాయి. చలం తన ఆత్మ విచారణను మాత్రమే కాదు, సమాజానికి అవసరమైన ప్రశ్నల్ని కూడా కలం ద్వారా లేఖనం చేశాడు. 1979 మే 4న చలం తిరువన్నామలైలో తాత్వికతలో లీనమై ప్రశాంతంగా మరణించారు. శేషజీవితాన్ని "అహం" ను అంగీకరించకుండా గడిపారు. అదే ఆయన తత్వచింతనకు పరాకాష్ఠ. గుడిపాటి వెంకట చలం జీవితం ఒక విప్లవ సంచిక. ఆయన రచనలు సమాజానికి నీతులు చెప్పే రచనలు కావు. అవి ఆత్మ పరిశీలనకి ప్రేరణలు, స్వేచ్ఛ కోసం పోరాడే కలం పదాలు. స్త్రీలను పునఃపరిశీలించే దృష్టిని తెలుగు పాఠకులకు కల్పించిన ధైర్యవంతుడు చలం. నేటికీ ఆయన రచనలు చదివితే - మనలో ఉన్న సంప్రదాయాల మూలాలను ప్రశ్నించే శక్తి కలుగుతుంది. చలం... ఒక రచయిత కాదు, ఒక మానవతా భావం.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# అభివృద్ధి చెందిన వ్యవసాయ సంకల్ప్ అభియాన్

**దేశవ్యాప్తంగా 700 కి పైగా జిల్లాల్లో**

**కేంద్ర మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్**




చురకలు ప్రతి నిధిహైదరాబాద్, మే, 17 కేంద్ర వ్యవసాయం మరియు రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ మరియు భారత వ్యవసాయ పరిశోధన మండలి (ICAR) అభివృద్ధి చేసిన కృషి సంకల్ప్ అభియాన్ దేశవ్యాప్తంగా నిర్వహించబడుతుందని ICAR-సెంట్రల్ డ్రైల్యాండ్ వ్యవసాయ పరిశోధన సంస్థ (CRIDA), హైదరాబాద్, డైరెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సింగ్ తెలియజేశారు. ఈ ప్రచారం మే 29 నుండి ప్రారంభమై జూన్ 12 వరకు 700 కి పైగా జిల్లాల్లో కొనసాగుతుందని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమం మరియు గ్రామీణాభివృద్ధి మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రకటించారని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో, వ్యవసాయ శాస్త్రవేత్తలు, మంత్రిత్వ శాఖ అధికారులు మరియు ఉద్యోగులు స్థానిక వ్యవసాయ కార్మికులతో బృందాలను ఏర్పాటు చేసి, ప్రతిరోజూ వివిధ గ్రామాలను సందర్శిస్తారు మరియు రైతులతో నేరుగా సంభాషిస్తారు మరియు వారి స్థాయిలో వ్యవసాయం గురించి వారికి మరింత అవగాహన కల్పిస్తారు మరియు తగిన సలహాలు ఇస్తారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇచ్చిన "ప్రయోగశాల నుండి భూమికి" అనే మంత్రాన్ని సాకారం చేసుకునేందుకు ఈ కసరత్తు అంతా జరుగుతోంది.ఆధునిక మరియు ఆదర్శ వ్యవసాయంతో పాటు, ఇది "ఒక దేశం, ఒక వ్యవసాయం, ఒక బృందం" వైపు ఒక ముఖ్యమైన చొరవ. కేంద్ర వ్యవసాయ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ కూడా ఈ విషయంలో ఢిల్లీలో ఒక ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు, దీనిలో దేశవ్యాప్తంగా 731 కృషి విజ్ఞాన కేంద్రాలు (%KVK%లు), దేశవ్యాప్తంగా 100 కి పైగా %ICAR% సంస్థలు మరియు ఇతర సంస్థలు, అలాగే కేంద్ర వ్యవసాయం మరియు రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు హైబ్రిడ్ రీతిలో పాల్గొన్నారు. కేంద్ర వ్యవసాయ కార్యదర్శి శ్రీ దేవేష్ చతుర్వేది మరియు ఐసిఎఆర్ డైరెక్టర్ జనరల్ మరియు వ్యవసాయ పరిశోధన మరియు విద్యా శాఖ కార్యదర్శి డాక్టర్ మంగి లాల్ జాట్ కూడా సమావేశంలో పాల్గొన్నారు.

%CAR%-సెంట్రల్ డ్రైల్యాండ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (%CRIDA%) డైరెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సింగ్ మాట్లాడుతూ, ఈ సంస్థకు చెందిన 25 మందికి పైగా శాస్త్రవేత్తలు మే 29 నుండి జూన్ 12 వరకు తెలంగాణలోని వివిధ జిల్లాల్లోని రైతుల వద్దకు నేరుగా వెళ్లి వారి స్థాయిలో వారితో సంభాషించి వివిధ అంశాలపై వారికి సరైన సలహా ఇస్తారని అన్నారు

ఈ సృజనాత్మక మరియు ప్రతిష్టాత్మక ప్రచారం వెనుక ఉద్దేశ్యం మన వ్యవసాయం అభివృద్ధి చెందాలి మరియు మన రైతులు దాని నుండి ప్రత్యక్ష ప్రయోజనం పొందాలి అని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. ప్రచారం అంతటా, అధునాతన పద్ధతులు, కొత్త రకాలు మరియు ప్రభుత్వ పథకాల గురించి రైతులలో అవగాహన పెంచబడుతుందిబీ అంతేకాకుండా, సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం కూడా దీని లక్ష్యం. ఈ ప్రచారంలో, నలుగురు శాస్త్రవేత్తల బృందాలు రైతులకు అవగాహన కల్పిస్తాయి మరియు సాయిల్ హెల్త్ కార్డ్‌లో సూచించిన విధంగా వివిధ పంటలలో సమతుల్య ఎరువుల వాడకం గురించి వారికి అవగాహన కల్పిస్తాయి.

కృషి విజ్ఞాన కేంద్రం, ఐసిఎఆర్ సంస్థలు మరియు ఇఫ్కో మొదలైనవి వ్యవసాయంలో డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానం యొక్క ఉపయోగం మరియు రైతులలో అవగాహన కల్పించడానికి ఐసిటి (%ICT%) వినియోగాన్ని కూడా ప్రదర్శిస్తాయి. విస్తృతంగా ఉపయోగించబడుతుంది.

%KVK% నిపుణులు వరిని నేరుగా విత్తడం (%DSR%), పంట వైవిధ్యీకరణ, సోయాబీన్ పంటలో యాంత్రీకరణ వంటి అధునాతన సాంకేతికతలను కూడా వ్యాప్తి చేస్తారు. ఈ బృందాలలో ప్రగతిశీల రైతులు, వ్యవసాయదారులు, %FPO%లు/%FIG%లు/స్వయం సహాయక బృందాల సభ్యులు, రాష్ట్ర వ్యవసాయం, ఉద్యానవన, పశు సంవర్ధక, మత్స్య శాఖల అధికారులు, %ATMA%, జాతీయ తెగులు నిఘా వ్యవస్థ (%NPSS%)తో అనుబంధించబడిన మొక్కల రక్షణ అధికారులు కూడా ఉంటారు.సమావేశంలో కేంద్ర మంత్రి శ్రీ చౌహాన్ మాట్లాడుతూ, అభివృద్ధి చెందిన భారతదేశం కోసం, అభివృద్ధి చెందిన వ్యవసాయం మరియు సంపన్న రైతులు మన సంకల్పమని, రైతులు సంపన్నులు కావాలంటే, వారు సరైన పద్ధతిలో వ్యవసాయం చేయడమే మార్గం అని అన్నారు. మేము ప్రారంభిస్తున్న అభివృద్ధి చెందిన వ్యవసాయ తీర్మాన ప్రచారం ఒక ఆచారం కాదు. ఇది మనం ఈరోజు ప్రారంభించిన కార్యక్రమం కాదు మరియు దీని ఫలితాలు 10-20 సంవత్సరాల తర్వాత వస్తాయి, బదులుగా ఇది చాలా వినూత్నమైన కార్యక్రమం, మరియు ఖరీఫ్ సీజన్‌లో మూడు నెలల తర్వాత, దీని సానుకూల ఫలితాలను చూడాలనే పూర్తి ఆశ ఉంది.వ్యవసాయంలో జరుగుతున్న పరిశోధనలు రైతుల పొలాలకు చేరాలని నేను నమ్ముతున్నానని కేంద్ర మంత్రి శ్రీ చౌహాన్ అన్నారు. ఈ ప్రచారం ద్వారా, రైతుల్లో ఉత్సుకత మరియు ఆసక్తిని పెంచుతారు మరియు శాస్త్రవేత్తలను కూడా ప్రోత్సహిస్తారు. ఈ పని హృదయపూర్వకంగా చేస్తే, దేశానికి మరియు రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని శ్రీ చౌహాన్ శాస్త్రవేత్తలతో అన్నారు.









చురకలు



# చురకలు

## సంపాదకీయం

### రాష్ట్రపతి సంధించిన లేఖతో రాజ్యాంగ ధర్మ సంకటం

రాష్ట్రపతి అంటే రాజ్యాంగం ప్రకారం సర్వస్వం. రాష్ట్రపతి కదిలే రాజ్యాంగంగా చూడాలి. ఈ దేశంలో ఏ ఉత్తర్వు అయినా రాష్ట్రపతి సంతకం తోనే వెలువడుతుంది. అలా పాలన అంతా రాష్ట్రపతి చేతుల మీదుగా సాగుతుంది. భారత ప్రధాన న్యాయమూర్తిని రాష్ట్రపతి ప్రమాణం చేయిస్తారు. అయితే రాష్ట్రపతిని కూడా ప్రధాన న్యాయమూర్తి ప్రమాణం చేయిస్తారు. కానీ ప్రధాన న్యాయమూర్తిని నియమించే అధికారం ఉత్తర్వులు జారీ చేసే అధికారం రాష్ట్రపతికి ఉంటుంది. అలాగే ఎంతటి ఉన్నత పదవులలో ఉన్న వారిని అయినా అభిశంశించి గద్దె దించే అధికారం పార్లమెంట్ కి ఉంది. దానిని ఆమోదించే అధికారం రాష్ట్రపతికి ఉంది. ఇలా చూస్తే కనుక భారత రాజ్యాంగంలో ఎన్నో కనిపిస్తాయి. ఇక్కడ అన్నీ కీలక వ్యవస్థలే. ఎవరు తక్కువ ఎక్కువ అన్నది కాదు. న్యాయవ్యవస్థ, శాసన వ్యవస్థ, కార్యనిర్వహణ వ్యవస్థ మూడూ కలసికట్టుగానే పనిచేయాలి. అయితే న్యాయ వ్యవస్థకు ఉన్న మరో అధికారం ఏమిటి అంటే రాజ్యాంగ సహితంగా ఏ నిర్ణయం అయినా అమలు అవుతోందా లేదా అన్నది చూడడం. దేశంలో క్లిష్ట పరిస్థితులు ఉన్నపుడు లేదా కీలక నిర్ణయాలు తీసుకోవలన్నపుడు రాష్ట్రపతి కార్యాలయం న్యాయ వ్యవస్థనే సంప్రదించి సలహా సూచనలు తీసుకుంటుంది. ఇలా సాగుతున్న భారత దేశ పాలనలో ఇపుడు ఒక సరికొత్త ధర్మ సంకటం రాజ్యాంగ పరంగా ఏర్పడింది. అదేంటి అంటే రాష్ట్రపతులు గవర్నర్ల నిర్ణయాధికారాల విషయంలో ఒక పరిధిని కాల పరిమితిని విధిస్తూ న్యాయ వ్యవస్థ శాసించగలదా అన్నది. దాని మీద ఈ మధ్యనే సుప్రీంకోర్టు మూడు నెలల వ్యవధిలో తమ వద్దకు వచ్చిన ఒక ఫైల్ ని క్లియర్ చేసి పంపాలని గడువు విధించింది. అలా కనుక చేయకపోతే ఆ బిల్లుని ఆమోదించినట్లే అని కూడా పేర్కొంది. దీని మీద అనేక రకాలైన చర్చలు చాలా జరిగాయి. ఇపుడు నేరుగా రాష్ట్రపతి సుప్రీం కోర్టుకు ఈ విషయంలో లేఖ రాయడంతో ఇది అత్యంత ముఖ్యమైన చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర గవర్నర్లు పంపే బిల్లులపై నిర్ణయం తీసుకోవడానికి కాలపరిమితి విధిస్తూ సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన చారిత్రక తీర్పుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 14 ప్రశ్నలు సంధించారని సమాచారంగా ఉంది. రాష్ట్రపతికి కాలపరిమితి విధించే అధికారం సుప్రీంకోర్టుకు ఉన్నదా అని రాష్ట్రపతి సందేహం వ్యక్తం చేశారు. తమిళనాడు ప్రభుత్వం, ఆ రాష్ట్ర గవర్నర్ మధ్య నెలకొన్న వివాదంపై సుప్రీంకోర్టు తీర్పు చెబుతూ గవర్నర్లు పంపే బిల్లులపై నిర్ణయం తీసుకునేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 201 ప్రకారం రాష్ట్రపతికి గడువు విధించింది. రాష్ట్రపతి అనుమతి కోసం తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి 10 బిల్లులను తన వద్ద అట్టే పెట్టుకోవడం చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తీర్పుపై కొన్ని సందేహాలు వ్యక్తం చేస్తూ ఈ నెల 13న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఓ ప్రశ్నావళిని పంపినట్లు వార్తలు వచ్చాయి. తమ అనుమతి కోసం వచ్చిన బిల్లులపై చర్య తీసుకోవడానికి ఆర్టికల్ 143 ప్రకారం గవర్నర్లు, రాష్ట్రపతికి కాలపరిమితి నిర్దేశించి విధించే అధికారం సుప్రీంకోర్టుకు ఉన్నదా అని ఆమె సుప్రీంకోర్టు ప్రశ్నించారు. ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి ఇచ్చే అనుమతులు సమర్ధనీయమా అనే విషయంపై సైతం సుప్రీంకోర్టు భిన్నమైన తీర్పులు ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే దీని మీద వామపక్షాలతో పాటు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా విమర్శలు చేశారు. సుప్రీం కోర్టుని రాష్ట్రపతి వివరణ కోరడం అన్నది సుప్రీం తీర్పుని సవాల్ చేయడమే అవుతుందని అంటున్నారు. మరో వైపు చూస్తే పార్లమెంట్ లో ఏ చట్టం చేయాలి అని ఎవరూ శాసించలేరు. అలాగే చేసిన చట్టం మీద ఆమోదముద్ర వేసే విషయంలో రాష్ట్రపతి అధికారాలని కూడా ప్రశ్నించజాలరని కొందరు మేధావులు అంటున్నారు. కొన్ని చట్టాలు రాజ్యాంగ హితమైనవి కాకపోవచ్చు, జాతి ప్రయోజనాలకు ఇబ్బంది కావచ్చు అలాంటి వాటిని విచక్షణతో నిలుపు చేయాల్సిన అవసరం ఉంటుందని అంటున్న వారూ ఉన్నారు అయితే నిర్ణీత కాల పరిమితి లేకపోతే కొన్ని చట్టాల ద్వారా జనాలకు ప్రయోజనాలు వేగంగా అందే అవకాశాలు తగ్గిపోతాయని అంటున్న వారూ ఉన్నారు. చూడాలి మరి దీని మీద తదనంతర పరిణామాలు ఎలా ఉంటాయో.

## వారసత్వ సంపదకు నిలయాలు మ్యూజియంలు - మే 18...అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం

అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం, ప్రతి సంవత్సరం మే 18న నిర్వహించ బడుతోంది. అంతర్జాతీయ స్థాయిలో, సమాజ అభివృద్ధిలో మ్యూజియంల పాత్రపై ప్రజల్లో అవగాహన పెంచడానికి ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. సంగ్రహాలయం లేదా మ్యూజియం అంటే సమాజా వసరాలకోసం, జన బాహుళ్యానికి ప్రవేశ సదుపాయం కలిగిన సంస్థ. ఇది కళాఖండాలు, కళాత్మక, సాంస్కృతిక, చరిత్రాత్మక లేదా ఇతర వస్తువుల సేకరణ గావి స్తుంది. సంగ్రహాలయాలు మానవ జాతికి సంబంధించిన దృశ్య, అదృశ్య వారసత్వ సంపద విషయాలను భద్రపరుస్తాయి. సేకరించిన వస్తువులను శాశ్వత మైన లేదా తాత్కాలికమైన ప్రదర్శనల ద్వారా ప్రజల వీక్షణకు అందుబాటులో ఉంచుతాయి. మ్యూజియం అనేది మొత్తం ప్రపంచం, పరిణామం, నగరాల సంస్కృతి అభివృద్ధి, మొత్తం దేశాల జీవితం, శాస్త్రీయ మరియు సాంకేతిక పురోగతి, కళ మరియు చరిత్రను గుర్తించగల ఒక ప్రత్యేక భాగం. మ్యూజియంలు మానవ జాతి చరిత్ర, దాని విలువలు మరియు సాంస్కృతిక వారసత్వం యొక్క సంరక్షణ కేంద్రాలు. ఒక నిర్దిష్ట కాలంలో నివసించిన, సృష్టించిన, నాశనం చేయబడిన ప్రతిదీ మ్యూజియం ప్రదర్శనల రూపంలో జాగ్రత్తగా భద్రపరచ బడుతుంది. ప్రజలకు వివిధ అంశాలలో అవగాహన కల్పించ డానికి మ్యూజియం ఒక మార్గంగా నిలుస్తుంది. వాస్తవానికి మ్యూజి యం అనేది లాభాపేక్షలేని, సమాజం, దాని అభివృద్ధికి సేవ చేసే శాశ్వత సంస్థ, ఇది ప్రజలకు ప్రజలకు అందుబాటులో ఉండి, వివిధ అపూర్వ, అపురూప వస్తువులను సేకరిస్తుంది, సంరక్షిస్తుంది, పరిశోధిస్తుంది, వారసత్వాన్ని అందిస్తుంది. ప్రాచీన గ్రీకులు, రోమన్లు ??కళలు, వస్తువులను సేకరించి ప్రదర్శిం చారు. పురాతన కాలంలో లైబ్రరీలు మరియు మ్యూజియంల మధ్య చాలా తక్కువ భేదం ఉండేది. ప్రారంభ సంగ్రహాలయాలు సంపన్న వ్యక్తులు, కుటుంబాలు లేదా కళాసంస్థలు, అరుదైన లేదా ఆసక్తికరమైన సహజ వస్తువులు, కళాఖండాల ప్రైవేట్ సేకరణలుగా ప్రారంభమయ్యాయి. ఒకనాటి రాజభవనాలు కళలు, వారు స్వాధీనం చేసుకున్న ప్రాంతాల నుండి వస్తువులు, ఇతర రాజ్యాల




రాయబారుల బహుమతులతో రూపొందించబడిన ఒక రకమైన మ్యూజియంగా కూడా పని చేశాయి. ఫ్రాన్స్‌లో, మొదటి పబ్లిక్ మ్యూజియం పారిస్‌లోని లౌవ్రే మ్యూజియం, 1793 లో ఫ్రెంచ్ విప్లవం సమయంలో ప్రారంభించ బడింది. బ్రిటీష్ మ్యూజియం 19వ శతాబ్దం లో బాగా ప్రాచుర్యం పొందింది. ప్రభుత్వ సెలవు దినాలలో బ్రిటిష్ మ్యూజియాన్ని సందర్శించే అవకాశం కల్పించారు. నెపోలియన్ ఐరోపాలోని గొప్ప నగరాలను జయించగా , ఆయన అక్కడి కళా వస్తువులను స్వాధీనం చేసు కున్నాడు. అలా సేకరణలు పెరిగాయి. రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభా నికి ముందే యునైటెడ్ స్టేట్స్‌లో విశ్వ విద్యాలయాలు వినూత్న పరిశోధనలకు ప్రాథమిక కేంద్రాలుగా మారాయి. అనేక దేశాలలో ప్రకృతి వైపరీత్యాలు , యుద్ధం , తీవ్రవాద దాడులు లేదా ఇతర పరిస్థితుల కారణంగా మ్యూజియంలలో నిల్వ చేయబడినసాంస్కృతిక ఆస్తికి ముప్పు వాటిల్లింది. 1946లో కౌన్సిల్ ఆఫ్ మ్యూజియమ్స్ "ఐ కామ్" అనే ప్రత్యేక సంస్థ స్థాపించబడింది. వందకు పైగా దేశాల ప్రతినిధులు ఇందులో చేరారు. అప్పుడు, 11వ సాధారణ సమావేశంలో, సోవి యట్ ప్రతినిధి బృందం అంతర్జా తీయ మ్యూజియం దినోత్సవాన్ని మే 18న జరుపు కావాలని నిర్ణయించారు. సోవియట్ యూనియన్ తో సహా 115 కంటే ఎక్కువ దేశాల ప్రతినిధులు వెంటనే కౌన్సిల్ చేరాయి. సోవియట్ యూనియన్ చొరవతో ఐకామ్ 1977లో ప్రపంచ మ్యూజియం దినోత్సవాన్ని నిర్వహించింది. 1978లో తొలిసారిగా వేడుకలు ప్రపంచం లోని 150 దేశాలలో విస్తృతంగా జరిగాయి. ప్రజల మధ్య సాంస్కృ తిక మార్పిడి, పరస్పర సహకారం, శాంతి పట్ల అవగాహన కల్పించేందుకు ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ మ్యూజియమ్స్ (ఐకామ్) సర్వప్రతినిధి సభ తీర్మానం ప్రకారం ఏటా మే నెల 18వ తేదీని అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవంగా జరుపుకోవాలని 1977లో నిర్ణయించారు. మ్యూజియం నిపుణులు ప్రజలను కలవడానికి, మ్యూజియంలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వారిని తెలియ చేయడానికి ఈ దినోత్సవం ఉపయోగ పడింది. 1978 నుండి, అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవాన్ని రష్యాతో సహా, ఉక్రెయిన్, బెలారస్, జర్మనీ, ఫ్రాన్స్, గ్రేట్ బ్రిటన్‌తో సహా ప్రపంచంలోని 150 కంటే ఎక్కువ దేశాలలో మే 18 న అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం జరుపుకుంటున్నారు. 2009లో ఎక్కువ మందిని దృష్టిని ఆకర్షించింది. 2009లో జరిగిన అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం వేడుకల్లో 90కి పైగా దేశాలలో 20,000 మ్యూజియంలు వివిధ కార్యక్రమాలను నిర్వహించింది. 2010లో 98 దేశాలు, 2011లో 100 దేశాలు, 2012లో 129 దేశాలలో 30,000 మ్యూజియంలు ఈ వేడుకలో పాల్గొన్నాయి. 2011లో ఈ దినోత్సవ అధికారిక పోస్టర్ 37 భాషలలోకి అనువదించ బడింది. 2012 నుండి ఈ సంఖ్య 38కి పెరిగింది. ప్రపంచ వ్యాప్తంగా ఆర్ట్ మ్యూజియంలు,నేచురల్ హిస్టరీ మ్యూజియంలు, సైన్స్ మ్యూజి యంలు, వార్ మ్యూజియంలు, పిల్లల మ్యూజియం లతో సహా అనేక రకాల మ్యూజియంలు ఉన్నాయి. ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ మ్యూజియమ్స్ ఐకామ్ ప్రకారం , 202 దేశాలలో 55,000 కంటే ఎక్కువ మ్యూజియంలు ఉన్నాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## తెలుగులో తొలి విజ్ఞాన సర్వస్వ సృష్టికర్త కొమర్రాజు - మే 18... కొమర్రాజు లక్ష్మణరావు జయంతి



తెలుగు పాఠకులలో విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలిని గురించి వినని వారుండరు. చారిత్రక గ్రంథ రచనకు అనేక మందిని ప్రోత్సహించిన, వెలువరించిన సంస్థ అది. ఆ సంస్థకు వ్యవస్థాపకుడు కొమర్రాజు వేంకట లక్ష్మణరావు. బహుభాషా పండిత్యానికి, మేథోనైశిత్యానికీ, చారిత్రక పరిశోధనకీ, పరిశీలనా దృష్టికీ ఆయన నిలువుటద్దం. యావజ్జీవితాన్ని చారిత్రక పరిశోధనకు ఆయన అంకితం చేసిన కృషీ వలుడు. కొమర్రాజు వెంకట లక్ష్మణరావు (మే 18, 1877 – జూలై 12, 1923) తెలుగులో మొట్టమొదటి విజ్ఞాన సర్వస్వ సృష్టికర్త, విజ్ఞాన చంద్రికా మండలి స్థాపకుడు. తెలుగువారికి ఉన్నత ప్రమాణాలతో చరిత్ర, విజ్ఞాన రచనలను తెలుగులో అందించడానికి శ్రీకారం చుట్టిన విజ్ఞానవేత్త. ఎందరో సాహితీ మూర్తులకు ఆయన సహచరుడు, ప్రోత్సాహకుడు, స్ఫూర్తి ప్రదాత. నిద్రాణమైన తెలుగుజాతిని మేలుకొలిపిన గొప్ప వ్యక్తులలో లక్ష్మణరావు ఒకడు. లక్ష్మణరావు సంఘ సంస్కరణాభిలాషి, బాల్య వివాహాలను వ్యతిరేకించాడు. వితంతు వివాహం, భోగం మేళాల నిషేధం, అస్పృశ్యతా నివారణ, సముద్రయానం, అంతశ్శాఖా వివాహం వంటి వాటిని ప్రోత్సహించాడు. స్త్రీలలో విద్యాభివృద్ధికి తన సోదరి అచ్చమాంబతో కలసి ప్రయత్నించాడు. రాత్రిళ్ళు హరిజనులకు విద్య నేర్పే కార్యక్రమంలో పాల్గొన్నాడు. 1877 మే 18న కృష్ణా జిల్లా పెనుగంచిప్రోలలో జన్మించిన ఆయన ప్రాథమిక విద్యను భువనగిరిలో పూర్తిచేశాడు. అక్కా, బావల వద్ద నాగపూరులో ఉంటూ మరాఠీ భాషను నేర్చుకున్నాడు. 1900 సంవత్సరంలో బి.ఎ. పట్టా పుచ్చుకొని, తరువాత ప్రైవేటుగా చదివి, 1902లో ఎమ్.ఏ.లో ఉత్తీర్ణుడ య్యాడు. మరాఠీ భాషలో వ్యాసాలు, పద్యాలు వ్రాసాడు. తెలుగు, మరాఠీ, ఆంగ్లం, సంస్కృతం, బెంగాలీ, ఉర్దూ, హిందీ భాషలలోనూ ఆయన ప్రావీణ్య తను సంపాదించాడు. విద్యాభ్యాస మైనాక మునగాల రాజా నాయని వెంకట రంగారావు సంస్థానములో ఉద్యోగము లభించగా, రాజా ప్రోత్సాహం వల్ల సాహితీ వ్యాసంగాన్ని కొనసాగిస్తూ, ఆర్థిక సహాయాన్ని పొంది, తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయ గలిగాడు. కొమర్రాజు లక్ష్మణరావు, నాయని వెంకటరంగారావు, రావిచెట్టు రంగారావు, ఆదిపూడి సోమనాథరావు, మైలవరపు నరసింహ శాస్త్రి వంటివారితో కలసి హైదరాబాదు లోని నాటి రెసిడెన్సీ బజారులో రావిచెట్టు రంగారావు స్వగృహంలో 1901 సెప్టెంబర్ 1 న శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయమును స్థాపించారు. తెలంగాణ ప్రాంతంలో తెలుగు భాష స్థితిని మెరుగుపరచడమే ముఖ్యోద్దేశ్యంగా అధునాతన పద్ధతులలో ప్రారంభమైన మొదటి గ్రంథాలయం ఇదే. అలాగే లక్ష్మణరావు, నాయని వేంకటరంగారావు, గాడిచర్ల హరిసర్వోత్తమ రావు, అయ్యదేవర కాళేశ్వరరావు, రావిచెట్టు రంగారావు వంటివారు 1906 లో హైదరాబాదులో విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి స్థాపించారు. తద్వారా 1906 – 1910 మధ్యకాలంలో మండలి 30 పైగా గ్రంథాలను ప్రచురించడం జరిగింది. గ్రంథాలన్నింటిలోనూ సంపాదకునిగా లక్ష్మణరావు పాత్ర మరువ లేనిది. 1922 డిసెంబర్ 27 న హైదరాబాదులో లక్ష్మణరావు, ఆదిరాజు వీరభద్రరావు మొదలైనవారు కలసి ఆంధ్ర పరిశోధక మండలి స్థాపించారు. తెలంగాణ శాసనాలు, షితాబుఖాను చరిత్ర మొదలైన గ్రంథాలను ఈ సంస్థ ప్రచురించింది. తరువాత దీనిని లక్ష్మణరాయ పరిశోధక మండలిగా మార్చారు. 1916 కొవ్వూరులో ఆంధ్ర సారస్వత పరిషత్తు స్థాపించినవారిలో లక్ష్మణరావు ఒకడు. మొదటినుండి యావజ్జీవ సభ్యుడుగా ఉండడమే కాకుండా, కొంతకాలం దానికి కార్యదర్శిగా కూడా ఉన్నాడు. లక్ష్మణరావు సాహితీ జీవితంలో మిగిలినవన్నీ ఒకయెత్తు, విజ్ఞాన సర్వస్వం ఒక్కటీ ఒకయెత్తు. బ్రిటిష్ ఎన్సైక్లోపీడియా తరహాలో ప్రపంచ విజ్ఞానాన్ని తెలుగువారికి పంచాలని, ఆంధ్ర విజ్ఞాన సర్వస్వాన్ని వెలువరించాలనేది ఆయన ప్రబల వాంఛ. 1912–13 కాలంలో ఈ బృహత్కార్యానికి పూనుకొన్నాడు. తాను ప్రధాన సంపాదకునిగానే కాదు, ప్రధాన రచయితగా కూడా పనిచేశాడు. లక్ష్మణరావే ఒక విజ్ఞాన సర్వస్వం. ప్రతివిషయాన్ని కూలంకషంగా పరిశోధించి, సమగ్రమైన స్వతంత్ర వ్యాసంగా వ్రాసేవాడు. మొదట 'అ'కారాదిగా నెలకు నూరు పేజీల చొప్పున దీనిని వెలువరించారు. రేయింబవళ్ళు శ్రమించి, మూడు సంపుటములు ప్రచురించారు. ఇందులో విజ్ఞాన శాస్త్రము, భాష, ఖగోళ శాస్త్రము, చరిత్ర, కళ వంటి వివిధ విషయాలపై ఉన్న నూరు వ్యాసాలలో ఆయన స్వయంగా 40 వ్యాసాలను కూర్చాడు. అధర్వవేదం, అద్వైతం, అభిజ్ఞాన శాకుంతలం, అలంకారాలు, అష్టాదశ మహాపురాణాలు, అట్ట బైండు, అష్టాధ్యాయి వంటి ఎన్నో వైవిధ్యమైన విషయాలపై ఆయన వ్యాసాలు వ్రాశాడు. "అ"కారంతో మూడు సంపుటాలు పూర్తిచేసిన తరువాత "ఆంధ్ర" సంపుటాన్ని తయారు చేసే పనిలో లక్ష్మణరావు రాత్రింబవళ్ళు శిలాశాసనాలు, ఇతర గ్రంథాల పరిశోధనలో గడిపాడు. ఆ సమయంలో ఆయనకు ఉబ్బసం వ్యాధి ఉధృతమై, మదనపల్లెలో కొంతకాలం విశ్రాంతి తీసుకొని మళ్ళీ మద్రాసు వచ్చాడు. ఆంధ్ర సంపుటం వ్రాయడానికి శాసనాలు పరిశీలిస్తూనే 1923 జూలై 12 న 46 యేళ్ళ వయసులోనే కొమర్రాజు లక్ష్మణరావు మరణించాడు. కందుకూరి వీరేశలింగం పంతులు మరణించిన ఇంటిలో, అదే గదిలో లక్ష్మణరావు కూడా మరణించడం గమనార్హం.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## మహిళలకు స్ఫూర్తి ప్రదాత సూర్యదేవర రాజ్యలక్ష్మి - మే 18...సూర్యదేవర రాజ్యలక్ష్మీదేవి జయంతి




శతాబ్దాల శ్వేత జాతీయుల పాలనలో అష్టకష్టాలు అనుభవించి, ఆంగ్లేయుల దాస్య శృంఖలాలను తెంచుకునేందుకు ఎందరో పోరాట పటిమను, తెగువను చూపించారు. భారత స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం అర్పించారు. తమ సర్వస్వం స్వాతంత్ర సాధనకోసం త్యాగం చేసిన వారు ఎందరో ఉండగా, మగవారితో సమానంగా కొంతమంది మహిళలు కూడా తెగించి స్వేచ్ఛా భారతం కోసం పోరాటం సల్పిన ఘన చరిత్ర ఉంది. సాంప్రదాయాలకు, కట్టుబాట్లకు అధిక ప్రాముఖ్యత ఇచ్చే రోజుల్లో మహిళలు స్వతంత్ర పోరాటంలో పాల్గొని భారతదేశ పౌరుషాన్ని చాటిన సందర్భాలు మరచ పోలేనివి. తాము అబలలము కామని, త్యాగాలకు వెరవమని నిరూపించి, తెగించి బ్రిటీషర్లతో పోరాడారు. స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాము లయ్యారు. అలాంటి వారిలో ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధురాలు, సంఘ సేవకురాలు సూర్యదేవర రాజ్యలక్ష్మీదేవి ముఖ్యులు. సూర్యదేవర రాజ్యలక్ష్మీదేవి (మే 18, 1914 – ఆగష్టు 8, 2010) కృష్ణాజిల్లా నందిగామ తాలూకా వీరుల పాడులో మే 18, 1914లో వాసిరెడ్డి సీతారామయ్య, సుబ్బమ్మ దంపతులకు జన్మించారు. ఆమె గురువు అతను కవి, పండితుడు జంగా హనుమయ్య చౌదరి ఉత్తమ విషయ పరిజ్ఞానాన్ని బోధించి, విద్వత్తు కలిగించారు. సూర్య దేవర నాగయ్యతో రాజ్యలక్ష్మి దేవికి పదేళ్ళ వయస్సులో వివాహమై, ఆమెక 16 ఏళ్ళకు అత్తవారింటికి వచ్చేవరకు విద్యా వ్యాసంగాలు కొనసాగించారు. వీరులపాడులో గ్రంథాలయాన్ని వినియోగించుకుని, తాపీధర్మారావు, కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు, త్రిపురనేని రామస్వామి చౌదరి వంటి సంఘ సేవకులు రచించిన గ్రంథాలను రాజ్యలక్ష్మీదేవి ప్రతి రోజూ తెచ్చుకుని చదివి అవగాహన చేసుకునేవారు. ఇవన్నీ ఆమెలో స్వతంత్ర్య భావాలను, స్వేచ్ఛాభిలాషను పెంచాయి. 1920లో గాంధీజీ ఇచ్చిన పిలుపు విని దేశసేవకు నడుం బిగించారు. 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొనాలని అనుకున్నా, ఆమె జెట్కలుశిక్ష అనుభవించటానికి, సత్యాగ్రహం చేయటానికి భర్త, ఇంట్లో పెద్దలు అంగీకరించలేదు. రాట్నంపై నూలు వడకటం, హిందీ నేర్చుకోవటం, ఖాదీధారణ అక్కడ పరిపాటి. ఉద్యమం ప్రచారం చేస్తూ రాజ్యలక్ష్మీదేవి దగ్గర బంధువెట్కన అన్నపూర్ణమ్మతో శాసనోల్లంఘన చేయతల పెట్టారు. జాతీయ గీతాన్ని ఆలపిస్తూ శాసనధిక్కార నినాదాలు ఊరేగింపుగా వెళ్లగా పోలీసులు అరెస్టు చేశారు. శిక్ష గురించి న్యామూర్తుల ఇళ్ళలో సైతం స్త్రీలు వీరికి అండగా నిలవడంతో ఆ శిక్ష రద్దు చేసి నామమాత్రపు శిక్షను విధించగా, రాజ్యలక్ష్మీదేవిని రాయవేలూరు జెట్కలుకు తరలించారు. రాజ్యలక్ష్మి ఖాదీ ప్రచారం, మహిళా ఉద్యమం, రాజకీయ కార్యకలాపాలు కొనసాగిస్తూ, కష్టపడి చదివి రాష్ట్రభాష పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. అస్పృశ్యతా నివారణ కోసం ఆమె తన వంతు కృషి చేశారు. హరిజన స్త్రీలను అందరితో పాటు గౌరవించేవారు. 1940లో వ్యక్తి సత్యాగ్రహం ఆరంభమైంది. గుంటూరు జిల్లాలో ఆ సత్యా గ్రహం చేయడానికి అనుమతి లభించిన తొలిస్త్రీ రాజ్యలక్ష్మి. 1941 జనవరి 30లో బాపట్ల తాలూకాలోని బ్రాహ్మణ కోడూరులో ఆమె సత్యాగ్రహం చేశారు. పోలీసులు అరెస్ట్ చేసి, రెండు నెలల జెట్కలు శిక్ష, వందరూపాయల జరిమానా విధించారు. ఆమె జెట్కల నుండి విడుదలెట్క మద్రాసులోని ఆంధ్ర మహిళా సభకు చేరుకున్నారు. తరువాత తెనాలి వెళ్ళి ట్యుటోరియల్ కాలేజిలో చేరి బెనారస్ మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. ఆమె చేబ్రోలు కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉండి మహిళా భ్యున్నతికి దేశాభ్యు దయానికి పాటు పడ్డారు. క్విట్ఇండియా ఉద్యమంలో రాజ్యలక్ష్మీదేవిని శాసనధిక్కార శాఖ సభ్యురాలిగా నియమించారు. ఆమె రహస్యంగా జిల్లాలన్నీ తిరిగి ప్రజలచే శాసన ధిక్కారం చేయించారు. పోలీసుల నుండి ఆమెను దేశభక్తులు కాపాడేవారు. రాజ్యలక్ష్మీదేవి 1941లో చేబ్రోలులో జాతీయ మహిళా విద్యాలయాన్ని స్థాపించా రు. ఆ తరువాత అక్టోబరు 1945లో ఆంధ్ర రాష్ట్ర మహిళా రాజకీయ పాఠశాలను ప్రారంభించారు. భారత దేశానికి 1947 ఆగష్టు 15వ తేదీన స్వాతంత్ర్యం సిద్ధించినా, నెట్కజాము ఏలుబడిలో ఉన్న వారికి విముక్తి కలగలేదు. రాజ్యలక్ష్మీదేవి విరాళాలు, చందాలు పోగుచేసి నెట్కజాం వ్యతిరేక పోరాట నాయకులకు తమ సంఘీభావాన్ని తెలిపా రు. రాజ్యలకీదేవి వ్యక్తి గతంగా నెట్కజాం వెళ్ళి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. హైదరాబాదు సంస్థానం స్వతంత్ర భారత దేశంలో విలీనమయ్యే వరకు ఆమె అక్కడి వారితో కలసి పోరాటం సాగించారు. 1950లలో తెలుగు దేశం అనే పత్రిక నడిపారు. మహిళాభ్యుదయ సంస్థలో మల్లాది సుబ్బమ్మ తదితరులతో కలిసి మద్యపానానికి వ్యతిరేకముగా పోరాటం చేశారు. రాజ్యలక్ష్మి ఆగష్టు 8, 2010 న మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## నీటి పారుదల రంగానికి కె.ఎల్.రావు ఎనలేని సేవలు - మే 18... డాక్టర్ కానూరి లక్ష్మణరావు వర్ధంతి

నీటిపారుదల రంగంలో అపర భగీరథుడిగా కీర్తించబడే తెలుగు ప్రజలు గర్వించ దగిన డా. కానూరి లక్ష్మణరావు (జూన్ 6, 1902 – మే 18, 1986) భారత దేశం లోనే గాక ప్రపంచ వ్యాప్తంగా నీటిపారుదల రంగంలో విప్లవాత్మకమైన పనులు చేసిన గొప్ప ఇంజనీరు. మోక్ష గుండం విశ్వేశ్వరయ్య తర్వాత గొప్ప వ్యక్తిగా ఆయన గుర్తింపు పొందారు. 1902 జూలై 14న కృష్ణా జిల్లా కంకిపాడు గ్రామంలో జన్మించిన కె.ఎల్.రావు మద్రాసు విశ్వ విద్యాలయములో ఇంజ నీరింగు (బీ.ఈ) డిగ్రీ పూర్తి చేసి, గిండీ ఇంజనీరింగు కళాశాల నుండి పోస్టుగ్రాడ్యుయేషన్ చేసి, మద్రాసు విశ్వ విద్యాలయం నుండి ఇంజనీరింగులో మాస్టరు డిగ్రీ (ఎం.ఎస్.సి ఇన్ ఇంజనీరింగ్) పొందిన తొలి వ్యక్తిగా నిలిచారు. చదువు పూర్తయిన తర్వాత విశాఖ జిల్లా బోర్డు అసిస్టెంట్ ఇంజనీరుగా పని చేశారు. తదనంతరం రంగూన్ కూడా ఉద్యోగం చేశారు. కొంత కాలం తర్వాత రావు గారు గిండీ ఇంజనీరింగ్ కళాశాలలో పరిశోధకుడిగా చేరారు. ఇంగ్లండ్ లోని బర్మింగ్ హామ్ విశ్వ విద్యాలయం నుండి 1939 లో డాక్టరేట్ డిగ్రీ పొందారు. కొంత కాలం పాటు ఇంగ్లాండ్ లో ప్రొఫెసర్ గా పనిచేసిన ఆయన 1946లో భారత దేశం తిరిగి వచ్చి మద్రాసు ప్రభుత్వంలో డిజైన్ ఇంజనీర్ గా చేరారు. 1950 – 54 మధ్యకాలంలో భారత ప్రభుత్వంలో చీఫ్ ఇంజనీర్ గా పని చేశారు. ప్రభుత్వంలో ఇంజనీర్ గా పని చేస్తున్న సమయాన, దేశంలోని అనేక నీటిపారుదల ప్రాజెక్టు లకు నమూనాలు తయారు చేశారు. నాగార్జునసాగర్, పులిచింతల, శ్రీశైలం, శ్రీరాంసాగర్ వంటి ఎన్నో సుప్రసిద్ధ నీటిపారుదల పథకాలకు రూపకల్పన చేశారు. గంగా, బ్రహ్మపుత్ర తదితర నదుల వరదల నివారణకై అనేక సూచనలు సలహాలు ఇచ్చారు. అందులో భాగంగానే గాంధీ సాగర్ , జవహర్ సాగర్ రాణాప్రతాప్ సాగర్ వంటి నిర్మాణాలు సిద్ధం చేశారు. నాటి ప్రభుత్వం నాగార్జున సాగర్, భాక్రానంగల్ ప్రాజెక్ట్, హిరాకుడ్ ప్రాజెక్ట్ విషయంలో పిలిపించిన విదేశీ ఇంజనీర్లు కూడా రావు ను సంప్రదించడం ఆయన ప్రతిభకు నిదర్శనం. ఇంజనీరింగ్ విషయాలకు సంబంధించి ఈయన రాసిన "ఇండియాస్ వాటర్ వెల్త్" అనే పుస్తకం నేటి తరాల శాస్త్రవేత్తలకు ప్రామాణిక గ్రంథంగా ఉంది. ఉద్యోగ విరమణ అనంతరం నాటి జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులు నీలం సంజీవరెడ్డి పిలుపు మేరకు 1962, 1967 ,1971 లో విజయవాడ నుంచి పార్లమెంటుకు పోటీ చేసి గెలిచారు. నెహ్రూ, శాస్త్రి, ఇందిరా గాంధీ, నేతృత్వంలోని ప్రభుత్వంలో కేంద్ర జలవనరుల శాఖ మంత్రిగా పని చేశారు. కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడే గంగా బ్రహ్మపుత్ర నదిలో వర్షాకాలంలో చేరుతున్న నీటిని నిల్వ ఉంచి భారతదేశంలో క్షామ ప్రాంతాలైన మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు నీటి సౌకర్యం కల్పించే "నేషనల్ వాటర్ గ్రిడ్" పథకానికి రూపకల్పన చేశారు. 1963లో పద్మభూషణ్, రూర్కీ, ఆంధ్రా మరియు జే ఎన్ టీ విశ్వ విద్యాలయాల డాక్టరేట్లు పొందారు, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్, అలాగే ఆల్ ఇండియా ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా, ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ సాయిల్ మెకానిక్స్ అండ్ జియోటెక్నికల్ ఇంజనీరింగ్ (ఆసియా) వైస్ ప్రెసిడెంట్ గా, రంగూన్ (బర్మా, ఇప్పుడు మయన్మార్)లో ప్రొఫెసర్‌గా, యునైటెడ్



కింగ్‌డమ్ లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేశారు. ఇంజనీరుగా చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా మూడు పర్యాయాలు రాష్ట్రపతి పురస్కా రం లభించింది. ఆయన జ్ఞాపకార్థం పులిచింతల ప్రాజెక్టుకు కె.ఎల్.రావు ప్రాజెక్టు అని నామ కరణము చేయ బడింది. ఒక ఇంజనీరు పేరును ప్రాజెక్టుకు పెట్టడం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఇదే ప్రథమం. 1986 మే 18 న 84 సంవత్సరాల వయసులో మృతి చెందారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## మన ఊరు..సమస్యల బడి

పెద్దపల్లి : జిల్లా ఎలిగేడు మండలం ధూళికట్ట ఉన్నత పాఠశాలలో 150 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి తరగతి గదులు సరిపోవడం లేదు. మన ఊరు- మన బడిలో నాలుగు అదనపు గదుల నిర్మాణాలకు రూ.20 లక్షలు మంజూరయ్యాయి. పునాది దశలోనే పనులు నిలిచిపోయాయి. అమ్మ ఆదర్శ పాఠశాలలోనూ ప్రతిపాదనలు పంపినా ప్రయోజనం లేకుండా పోయింది.'

ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల లేమి.. ప్రవేశాలు, విద్యా ప్రమాణాలపై ప్రభావం చూపుతోందని నిపుణుల అభిప్రాయం. జూన్ 6 నుంచి పాఠశాల విద్యాశాఖ బడి బాట కార్యక్రమం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇది విజయవంతం కావాలంటే పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా సౌకర్యాలు ఉండటం ప్రధానాంశం. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు 2021-22లో 'మన ఊరు-మన బడి' కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. రెండేళ్లుగా ఎక్కడికక్కడ పనులు నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత 'మన ఊరు-మన బడి'లో ఎంపిక చేయని పాఠశాలలను 'అమ్మ ఆదర్శ' పాఠశాలలుగా ఎంపిక చేసింది. వీటిలో ఇప్పటికీ చాలా వరకు పనులు పూర్తయ్యాయి. కానీ 'మన ఊరు-మన బడి' పనులను మధ్యలోనే వదిలేయడంతో ఇప్పటికీ అసంపూర్తి పనులు వెక్కిరిస్తూనే



ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 2,466 పాఠశాలలుండగా 'మన ఊరు-మన బడి'లో 870 ఎంపిక చేశారు. అవసరం ఉన్న చోట భవనాలు, అదనపు గదులు, వంటశాలలు, భోజనశాలలు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, ప్రహరీల నిర్మాణాలు, విద్యుత్తు సౌకర్యం, తాగునీటి వసతి, రంగులు వేయడం ఇతర పనులు చేపట్టాలి. ఇవన్నీ పూర్తయ్యాక తరగతి గదుల్లో డ్యూయల్ డెస్కులు, గ్రీన్ బోర్డులు, ఉపాధ్యాయులకు టేబుళ్లు, కుర్చీలు ఇలా అన్ని వసతులు కల్పించాలి. ఇవన్నీ ఏడాదిలోపు పూర్తి కావాల్సి ఉంది.

ఉపాధి హామీ, ఇంజినీరింగ్ శాఖలు 12 రకాల పనులు చేయాలి. తాగునీరు, విద్యుత్తు సరఫరా, చిన్న, పెద్ద మరమ్మతులు వంటివి దాదాపు అన్ని పాఠశాలల్లో పూర్తయ్యాయి. రూ.30 లక్షల పైన ఉన్న పనులను టెండర్ల ద్వారా చేపట్టారు. వీటిని త్వరితగతిన చేపట్టేందుకు అన్ని ఇంజినీరింగ్ శాఖలకు పనుల నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. 2023 ఆగస్టులోపు పనులు పూర్తి కావాల్సి ఉంది. పనులు దక్కించుకున్న గుత్తేదారులు వాటిని ఒప్పందం చేసుకోవడం, విద్యాశాఖ, ఇంజినీరింగ్ శాఖల మధ్య సమన్వయ లోపంతో జాప్యం జరుగుతూ వచ్చాయి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కరీంనగర్‌లో 180, రాజన్న సిరిసిల్లలో 75, జగిత్యాలలో 48, పెద్దపల్లి 25 పాఠశాలల్లో పనులు దాదాపు పూర్తయ్యాయి. టెండర్ల ద్వారా చేపట్టే పనుల్లో 38 శాతం పూర్తయ్యాయి. వీటిలోనూ పనులు పూర్తయిన వాటికి రాజన్న సిరిసిల్ల జిల్లాలో రూ.6.36 కోట్లు, పెద్దపల్లిలో రూ.15 కోట్లు, జగిత్యాలలో రూ.5 కోట్లు, కరీంనగర్‌లో రూ.4 కోట్ల మేరకు గుత్తేదారులకు బిల్లులు రావాల్సి ఉంది. గుత్తేదారులకు సకాలంలో బిల్లులు అందక పనులు నిలిపివేశారు. దాదాపు మూడేళ్లుగా అసంపూర్తి పనులు అలానే ఉన్నాయి.

**ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలి**

'మన ఊరు-మన బడి' కింద ఎంపికైన పాఠశాలల పనులు చాలాచోట్ల అసంపూర్తిగా ఉన్న మాట వాస్తవమే. బిల్లుల చెల్లింపు విషయం ప్రభుత్వం దృష్టిలో ఉంది. ఆదేశాలు రావడంతోనే పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తాం. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులు దాదాపు పూర్తయ్యాయి.జనార్దన్‌రావు, డీఈవో, కరీంనగర్, రాజన్నసిరిసిల్ల

## 'భూ'చోళ్లు..అక్రమ పట్టాలు

ధర్మపురి : నిజామాబాద్ జిల్లా పరిధి పోచంపాడ్(ఎస్సారెస్పీ) ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి ధర్మపురిలోని దొంతాపూర్ రిజర్వ్ ఫారెస్టులో గతంలో సుమారు 5 వేల ఎకరాలు కేటాయించారు. ఇవి అక్రమార్కులకు వరంగా మారాయి. భూ నిర్వాసితులతో మగ్గిడి, గాదెపల్లి, సిరిపురం, గంగసముద్రం, నూతిపల్లి, దొంకేశ్వర్ తదితర పది గ్రామాలు ఏర్పాటు చేశారు. మొదట్లో అరకొర వసతులు ఉండటంతో నిర్వాసిత రైతులు ఆయా భూములను పక్క గ్రామాల వారికి విక్రయించి వెళ్లిపోయారు. కొద్దిమంది మాత్రం ఇక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు.

**అక్రమంగా డీ1 పట్టాలు**

దళారులు అక్రమంగా డీ1 పట్టా కాగితాలు పోచంపాడు కార్యాలయం నుంచి పొంది ఇక్కడ నమోదు చేసుకున్నారు. దీనిపై గతంలోనే రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. సత్ఫలితాలు ఇవ్వకపోగా.. పలు గ్రామాల్లో రైతుల మధ్య గొడవలు, వివాదాలకు కారణమైంది. అక్రమార్కులు రైతుబంధు కూడా పొందారు. 2021లో సర్వే నంబర్ 274లో 280 ఎకరాలను డీ-1 పట్టా భూములుగా గుర్తించగా, వాటిలో 130 ఎకరాలను స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన భూమి ఆక్రమణకు గురైంది.

**ఎకరానికి రూ.20 లక్షలు**

భూముల ధరలకు రెక్కలు రావడంతో పునరావాస భూములకు డిమాండ్ ఏర్పడింది. వీటిని చుట్టుపక్కల రైతులే కాకుండా ధర్మపురి, జగిత్యాల, నిజామాబాద్‌లకు చెందిన వారు కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం ఎకరానికి రూ.20 లక్షల వరకు ధర పలుకుతోంది. దీంతో దళారులు, రెవెన్యూ అధికారులు ఒకటై అక్రమ పట్టాలు పొందారు. రికార్డుల్లో అనేక అవకతవలకు పాల్పడి మార్పులు చేశారు.

ఫిర్యాదుల పర్వం

పునరావాస గ్రామానికి చెందిన ఒకరు సుమారు అయిదెకరాల భూమిని చదునుచేసి మామిడితోట ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో తనకు హక్కుందని పక్కన భూమి ఉన్న వ్యక్తి రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశాడు.ఒకే భూమిని నలుగురు కొనుగోలు చేయడంతో వివాదంగా మారగా, రెవెన్యూ కార్యాలయంలో ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ సమస్య ఇప్పటికీ తొలగిపోలేదు. నిర్దిష్టమైన మ్యాప్ లేకపోవడంతో అస్తవ్యస్తంగా మారి ఒకరిపై మరొకరు ఠాణాలు, రెవెన్యూ కార్యాలయాలకు వెళ్లి ఫిర్యాదు చేసుకుంటున్నారు.

200 ఎకరాలు బ్లాక్ చేశాం

పునరావాస భూములకు సంబంధించిన సర్వే నంబర్లలో 200 ఎకరాల భూమిని బ్లాక్ చేశాం. గతంలో తప్పులు దొర్లాయి. వాటిని సమీక్షిస్తూ ఆక్రమణలను పూర్తిగా తొలగిస్తున్నాం. ప్రభుత్వ అవసరాలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటాం. డీ-1 పట్టా భూములపై పూర్తిస్థాయిలో దృష్టి నిలిపాం. కృష్ణచైతన్య, ధర్మపురి మండల తహసీల్దార్

## నిరుద్యోగులే పెట్టుబడి.. వారి ఆశే రాబడి

అమీర్‌పేట : బీకేగూడకు చెందిన ఓ గృహిణికి పార్టు టైం ఉద్యోగం పేరిట టెలిగ్రామ్‌కు ఓ సందేశం వచ్చింది. చిన్నచిన్న టాస్క్‌లు పూర్తి చేస్తే డబ్బు వస్తుందని సైబర్ నేరగాళ్లు నమ్మించారు. ఆమె కొన్ని వీడియోలు చూసి లైక్ కొట్టారు. అనంతరం కొంత డబ్బు పెట్టుబడి పెడితే రూ.లక్షల్లో ఆదాయం వస్తుందని నమ్మించడంతో రూ.88 వేలు పంపి మోసపోయింది.

ఉద్యోగం కోసం రెజ్యూమ్‌ను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన ఓ యువకుడిని సైబర్ కేటుగాళ్లు బురిడీ కొట్టించారు. ఎంఎన్‌సీ కంపెనీలో ఉద్యోగముందని నమ్మించిన కేటుగాళ్లు అందుకు సర్టిఫికేషన్ కోర్సు చేయాలని, అందుకు రూ.21,925 పంపించాలన్నారు. నమ్మిన బాధితుడు డబ్బును ఫోన్‌పేలో పంపారు. నేరగాళ్లు ఫోన్ స్విచ్ఛాఫ్ చేయడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిరుద్యోగులు, గృహిణుల ఆశలే పెట్టుబడిగా నగరంలో సైబర్ నేరగాళు రెచ్చిపోతున్నారు. పార్టు టైం ఉద్యోగంతో డబ్బు సంపాదించుకోవచ్చని నేరగాళ్లు చెబుతున్న మాయమాటలను నమ్మి మోసపోతున్నారు. ఉద్యోగాల కోసం ఆన్‌లైన్‌లో శోధించేవారిని లక్ష్యంగా చేసుకుంటున్న నిందితులు వారిని బురిడీ కొట్టిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. పార్టు టైం ఉద్యోగాలంటూ వాట్సప్, టెలిగ్రామ్‌లకు సందేశాలు పంపుతూ ఉచ్చులోకి దించి కుచ్చుటోపీ పెడుతున్నారు. వారం రోజుల వ్యవధిలో సనత్‌నగర్, బేగంపేట, ఎస్సార్‌నగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో పార్టుటైం ఉద్యోగాల పేరిట మోసపోయిన బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదయ్యాయి.

**ఎందరో బాధితులు..**

సనత్‌నగర్‌కు చెందిన నిరుద్యోగి సాయితేజ పార్టుటైం ఉద్యోగం పేరిట తన సెల్‌ఫోన్‌కు వచ్చిన సందేశాన్ని నమ్మి నేరగాళ్లు చెప్పినట్లు చేసి రూ.44,319 పోగొట్టుకున్నాడు. మరో యువకుడు శంకర్ చిన్నచిన్న టాస్క్‌లు చేస్తూ డబ్బు సంపాదించవచ్చన్న ఆశతో రూ.27,988 పంపి మోసపోయాడు. చిన్న మొత్తంలో పెట్టుబడి పెడితే దండిగా లాభం వస్తుందని నేరగాళ్లు చెప్పిన మాటలు నమ్మి సనత్‌నగర్‌లో చంద్రశేఖర్ అనే వ్యక్తి రూ.70 వేలు పోగొట్టుకున్నారు. ఇవి మచ్చుకు మాత్రమే.

**తేలికైన టాస్క్‌లతో ఆకర్షిస్తూ..**

పార్టుటైం ఉద్యోగాలంటూ ఆన్‌లైన్‌లో, వాట్సప్, టెలిగ్రామ్‌లలో సందేశాలు పంపుతున్న సైబర్ మోసగాళ్లు అమాయకులను వంచించేందుకు తేలికైన టాస్క్‌లు ఇస్తూ ఆకర్షిస్తున్నారు. సులభంగా ఉండే ప్రశ్నలు, గుర్తించగలిగే బొమ్మలు, ప్రాంతాల వివరాలు, వీడియోలు పంపుతూ వాటిని చూస్తూ తేలికగా సమాధానాలు చెప్పే అంశాలు, ప్రశ్న, అందుకు నాలుగు సమాధానాలు ఇచ్చి పూర్తి చేయమంటున్నారు. వారి మాయలో పడుతున్న బాధితులు టాస్క్‌లను తేలిగ్గా పూర్తి చేస్తున్నారు. దీంతో వెంటనే రూ.200 నుంచి రూ.400 వరకు నగదును సైబర్ నేరగాళ్లు వారికి బదిలీ చేస్తున్నారు. దీంతో బాధితులు నమ్మి వారు చెప్పిన ఖాతాలకు రూ.వేలల్లో బదిలీ చేసి నిలువునా మోసపోతున్నారు.

డబ్బు పోగొట్టుకున్న బాధితులు 24 గంటల్లో 1930 నంబరుకు ఫిర్యాదు చేస్తే ఆగంతకుల ఖాతాలను స్తంభింపజేసే అవకాశం ఉంటుందని సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపారు.

**రూ. 1.40 లక్షలకు టోకరా**

పార్టు టైం ఉద్యోగం పేరిట ఓ యువతిని నమ్మించిన సైబర్ నేరగాళు రూ.1.40 లక్షలను కాజేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. సనత్‌నగర్‌కు చెందిన జి.హారిక వాట్సప్ నంబరుకు పార్టుటైం ఉద్యోగం పేరిట లింక్ వచ్చింది. దీనిని ఓపెన్ చేసిన హారిక అవతలి వ్యక్తుల సూచనల మేరకు టెలిగ్రామ్‌లో కనెక్ట్ అయ్యారు. ఆగంతకులు పార్టు టైం ఉద్యోగం పేరిట కొంత పనిని అప్పగించగా ఆమె పూర్తి చేశారు. కొంత పెట్టుబడి పెడితే పూర్తి లాభాన్ని ఒకేసారి పొందవచ్చని నేరగాళ్లు నమ్మించడంతో రూ.1.40 లక్షలు వారు చెప్పిన ఖాతాకు బదిలీ చేసింది. అనంతరం వారి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితురాలు సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదుచేశారు.

**రూ. 74,700 లాగేశారు..**

తాజాగా జరిగిన ఘటనలో ఓ బాధితుడు రూ.74,700 పోగొట్టుకున్నాడు. ఎస్సార్‌నగర్‌లోని ఓ సంస్థలో టెలీకాలర్‌గా పనిచేసే కడపకు చెందిన కసి వెంకటనారాయణరెడ్డికి ఈనెల 5న టెలిగ్రామ్‌లో ఫేక్ఐడీతో సందేశం వచ్చింది. రహేజా సంస్థలో పార్టు టైం ఉద్యోగాలున్నాయంటూ ఆగంతకులు ఓ రెఫరల్ కోడ్ పంపారు. తాము పంపిన టాస్క్‌లను పూర్తిచేస్తే డబ్బులొస్తాయన్నారు. కొంత పెట్టుబడి పెట్టాల్సి ఉంటుందని నమ్మించారు. నమ్మిన బాధితుడు తొలుత రూ.20 వేలు పంపాడు. మళ్లీ పెట్టుబడి పెడితే లాభం పెద్ద మొత్తంలో వస్తుందన్నారు. బాధితుడు మరోసారి రూ.50 వేలు, రూ.4,700 పంపాడు. తరువాత ఆ డబ్బు విత్‌డ్రా చేసుకునేందుకు ఇంకొంత చెల్లించాలని చెప్పడంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## ఆధ్యాత్మిక క్షేత్రం.. నిఘా నామమాత్రం



వేములవాడ : ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన వేములవాడలో నిఘా కరవైంది. ప్రతిరోజు వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుంచి తరలి వస్తారు. ప్రతి సోమవారం ఆలయంలో జాతరను తలపించే రీతిలో భక్తులు వస్తుంటారు. కాగా ఆలయంలో నిఘా కరవైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఉండాల్సి ఉండగా సీసీ కెమెరాలు పని చేయడం లేదు. ఆలయంలోని మహామండపం, ఆలయ ప్రాంగణం, పరిసరాలు, ధర్మగుండం, కల్యాణ కట్ట, కళాభవన్, వివిధ క్యూలైన్లు, ప్రసాదాల విక్రయ కేంద్రాలు, తదితర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు బిగించారు. ఆయా ప్రాంతాల్లో 36 సీసీ కెమెరాలున్నట్లు చెబుతున్నా తెరపై కేవలం 14 మాత్రమే పని చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా ఉంటే రక్షణ ఎలా ఉంటుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భక్తుల రద్దీ, రాకపోకలు సాగించే ప్రాంతాలు, జనం ఎక్కువగా గుమిగూడే ప్రాంతాల్లో సీసీ కెమెరాలతో నిఘా మరింత పెంచాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.

**నిర్వహణకు రూ.5 లక్షలు ఖర్చు చేసినా...**

ఆలయానికి సంబంధించిన సీసీ కెమెరాల నిర్వహణకు అధికారులు ఏటా టెండర్ నిర్వహిస్తున్నారు. రూ.5 లక్షల నిధులను కేటాయించి నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తున్నారు. వీటి పనితీరు, అవసరం మేరకు కొత్తగా ఏర్పాటు చేసే విషయమై టెక్నీషియన్‌తో పర్యవేక్షణ చేయాల్సి ఉండగా దీనిని పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆలయంలో జరిగే ఉత్సవాల సందర్భంగా తాత్కాలికంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి భద్రతా చర్యలు చేపడుతున్నప్పటికీ ఆలయంలో శాశ్వతంగా ఏర్పాటు చేసిన కెమెరాల నిర్వహణపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఆలయ పరిసరాల్లో చిన్నారుల అపహరణ, వాహనాల చోరీలు, భక్తుల సామగ్రి తదితర చోరీలు జరుగుతుంటాయి. ఇలాంటి సందర్భంలో సీసీ కెమెరాలే ముఖ్య భూమిక పోషిస్తుంటాయి. పలు ప్రాంతాల్లో ఇవి పనిచేయక పోవడంతో చోరీలకు పాల్పడిన వ్యక్తులను గుర్తించడం కష్టసాధ్యం అవుతోందని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంతకాలం క్రితం ఆలయ పరిసరాల్లో ఓ చిన్నారి అపహరణకు గురి కాగా ఈ సీసీ కెమెరాలు పూర్తి స్థాయిలో పని చేయలేదు. దీంతో పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పోలీసు యంత్రాంగం పరిశీలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

**చర్యలు తీసుకుంటాం**

సీసీ కెమెరాల మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. సాంకేతిక నిపుణులు అందుబాటులో లేక పోవడంతో కొంత జాప్యం జరుగుతోంది. పూర్తి స్థాయిలో సీసీ కెమెరాలు పనిచేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

## 'పక్కదారి' పట్టిన పైసలేవీ?

కరీంనగర్ : కరీంనగర్ పెద్దాస్పత్రిలో నిధుల గోల్‌మాల్ విషయంలో మూడేళ్ల కిందట గగ్గోలు నడిచింది. 2022 నవంబరు 19న జరిగిన జిల్లా అభివృద్ధి సమీక్షలో జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) నిధుల ఖర్చు విషయంలో లెక్కాపత్రం లేదని అధికారులను అప్పటి మంత్రి గంగుల కమలాకర్ నిలదీశారు. రూ.68 లక్షల విషయంలో జవాబుదారీతనం లేదని విచారణకు ఆదేశించగా.. కొంత నిధులు పక్కదారి పట్టినట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. రాష్ట్రస్థాయి నుంచి వచ్చిన ఆడిట్ బృందాలు కూడా పక్కదారి పట్టినట్లు నిగ్గు తేల్చడంతో బాధ్యులుగా భావించి అప్పట్లో ఓ అధికారిణిపై బదిలీ వేటు వేశారు. ఒకరిద్దరు సిబ్బందిపై నామమాత్రపు చర్యలు తీసుకున్నారు. తరువాత ఆ లెక్కల విషయంలో అసలు వాస్తవాలు బయటపెట్టడానికి సమగ్ర విచారణ చేపడుతామని చెప్పిన హామీతోపాటు విచారణ అటకెక్కింది. 2024 డిసెంబరు 12న కరీంనగర్ కలెక్టరేట్‌లో జరిగిన దిశ సమావేశంలోనూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వైద్యారోగ్యశాఖ అధికారులతోపాటు ఆస్పత్రి బాధ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్‌హెచ్‌ఎం నిధులకు సంబంధించి దేనికి ఎంత ఖర్చు చేశారనే వివరాలు అడిగినా ఎందుకు ఇవ్వడం లేదని మండిపడ్డారు. నివేదికలో ఇచ్చిన లెక్కలు తప్పుల తడకలుగా ఉన్నాయని.. కనీసం ఆర్థిక సంవత్సరాల వారీగా వచ్చిన నిధులెన్ని? చేపట్టిన వ్యయమెంత? అనే లెక్కాపత్రం లేని తీరుపై గుర్రుమన్నారు. రూ.కోట్ల నిధులు వస్తే.. ఎప్పుడు అడిగినా ఆస్పత్రిలో నిధుల కొరత అంటారని? అసలు ఖర్చుల విషయంలో ఏం జరుగుతుందని ప్రశ్నించారు. నిధులు పక్కదారి పడుతున్నట్లు తనకు ఒకరిద్దరు ఫిర్యాదు చేశారని ఈ విషయమై విచారణ చేపట్టాలని ఆదేశించారు.

వైద్యారోగ్య శాఖకు, పెద్దాసుపత్రికి వస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) నిధులతోపాటు ఇతరత్రా నిధుల ఖర్చు విషయంలో స్పష్టత కొరవడుతోంది. ప్రతి ఏడాది వస్తున్న నిధుల వ్యయం విషయంలో కొందరు చేతివాటాన్ని చూపిస్తూ కాకి లెక్కలు చూపుతున్నారనే ఆరోపణలున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి విడుదలయ్యే సొమ్ము విషయంలో ఇష్టానుసారంగా



వెచ్చిస్తున్నారనేది వైద్యశాఖ నుంచి వినిపిస్తున్న మాట. ముఖ్యంగా కరోనా విపత్తు ఎదురైనప్పుడు జిల్లాకు వచ్చిన నిధులు చాలావరకు పక్కదారి పట్టాయని ఆస్పత్రిలోని కొందరు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఆ అంశాన్ని తేలిగ్గానే తీసుకున్నారని సమాచారం. తరువాత ఆస్పత్రి కమిటీ దృష్టికి రూ.68 లక్షల వ్యవహారం రావడంతో విచారణకు ఆదేశించినా.. తరువాత కొన్ని రాజకీయ ఒత్తిళ్లు ఇతరత్రా కారణాలతో పాత దస్త్రాల బూజు దులిపే సాహసాన్ని ఎవరూ చేయడంలేదు. ఆ తరువాత కూడా వ్యయం విషయంలో మార్పు కనిపించడం లేదనేది అడ్డగోలు ఖర్చుల లెక్కలను బట్టి తెలుస్తోంది. అయితే ఆడిట్ సమయంలో అభ్యంతరాలు వస్తున్నా.. వాటిని దాట వేస్తుండటంతో సమస్య మరింతగా పెరుగుతోంది.

**ఈ ఖర్చులపై అనుమానాలు**

ఆస్పత్రి ఆవరణతోపాటు జిల్లాలోని పలుచోట్ల అనుబంధ నిర్మాణాలకు 2022-23లో రూ.1.35 కోట్లు, 2023-24లో రూ.30 లక్షలు కలిపి మొత్తంగా రూ.1.65 కోట్ల లెక్కలు రికార్డుల్లో రాశారు.

జనాభా దినోత్సవ నిర్వహణకు రెండేళ్లలో రెండు రోజుల కోసం రూ.69 వేలు ఖర్చయినట్లు చెప్పినా.. ర్యాలీ తీయడం మినహా మిగతా కార్యక్రమాలేవీ జరగలేదు.

శిక్షణల కోసం రూ.3.16 లక్షలు, ఇతర ఖర్చులని రూ.2.36 లక్షలు, ఇమ్యునైజేషన్ సహా ఇతర కార్యక్రమాల నిర్వహణకు రూ.లక్షలు వెచ్చించినట్లు రికార్డుల్లో పొందుపర్చారు.

ఓ ప్రజాప్రతినిధి వాహనానికి డీజిల్ పోసిన లెక్కలను కూడా కాగితాల్లో పొందుపర్చినట్లు గతంలో చేపట్టిన విచారణలో బహిర్గతమైనా ఇప్పటికీ ఎలాంటి రికవరీ జరగలేదు.

## భవనం నిర్మించి.. వసతులు మరిచి

కోరుట్ల : కోరుట్ల పట్టణంలో లక్షలు వెచ్చించి అధునాతన గ్రంథాలయ భవనం నిర్మించినా మౌలిక వసతులు కల్పించకపోవడంతో విద్యార్థులు, పాఠకులు అవస్థలు పడుతున్నారు. పట్టణంలోని జవహర్‌రోడ్డులో గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పురపాలక సంఘం అధికారులు, అప్పటి ప్రజాప్రతినిధులు ఆరేళ్ల కిందట నూతన భవనం నిర్మించాలని యోచించారు. టీయూఎఫ్ఐడీసీ ఫేజ్-2 కింద 2019లో రూ.60 లక్షలు కేటాయించారు. పాత భవనం కూల్చివేయడంతో అందులోని సుమారు 24వేల పుస్తకాలు, ఫర్నీచర్‌ను జూనియర్ కళాశాల మైదానంలోని క్రీడాశాఖకు చెందిన గదుల్లోకి మార్చారు. నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభించి 2023 ఏడాది చివర శాసనసభ ఎన్నికలు సమీపించడంతో పనులు పూర్తికాకపోయినా ఆగమేఘాల మీద ప్రారంభించి అప్పగించారు. నిధులు సరిపోలేదంటూ భవనంలో నీటి వసతి, మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణాలు, ప్రహరీ నిర్మాణం చేపట్టకుండా వదిలేశారు.

పుస్తకాలను జూనియర్ కళాశాల మైదానంలోని గదుల్లోనే ఉంచి నూతన భవనంలో కేవలం విద్యార్థులు, పాఠకులు కూర్చొని చదువుకునే వీలు కల్పించారు. పుస్తకాలు అవసరముంటే అక్కడికి వెళ్లి



తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. నూతన భవనంలో పూర్తిస్థాయి వసతులు కల్పించాలని బల్దియా అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పాఠకులు చెబుతున్నారు. నిత్యం ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు సుమారు 80 మంది విద్యార్థులు, పాఠకులు పోటీ పరీక్షలకు సన్నద్ధమవడం, పుస్తకాలు, పత్రికలు చదువుతుంటారు. ఇటీవల ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ గ్రంథాలయాన్ని సందర్శించి ఎంపీ నిధుల నుంచి రూ.1.5 లక్షలు మంజూరు చేయించారు. పంచాయతీరాజ్‌శాఖ అధికారులు పనులు చేపట్టకుండా నెలల తరబడి తీవ్ర జాప్యం చేస్తున్నారు.

**మూత్రశాలలు లేవు**

గ్రంథాలయానికి కొత్త భవనం నిర్మించి ఏడాది గడిచినా కనీస వసతులు కల్పించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థినులు, మహిళలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నీటి వసతి, ప్రహరీ లేక రక్షణ కరవైంది.లింగన్న, పాఠకుడు


**నిధులు మంజూరైనా..**

రూ.60 లక్షలతో నూతన గ్రంథాలయ భవన నిర్మాణం చేపట్టి పనులు పూర్తిచేయకుండానే ప్రారంభించారు. మౌలిక వసతుల కోసం ఎమ్మెల్యే రూ.1.5 లక్షలు మంజూరు చేయించినా పనులు చేపట్టలేదు. పూర్తిస్థాయిలో వసతులు కల్పిస్తేనే విద్యార్థులు, పాఠకులకు ఉపయోగకరంగా ఉంటుంది. పెండెం గణేశ్, మాజీ కౌన్సిలర్

## తాగునీటి బాధలు తీరేదెన్నడు?

గోదావరిఖని : సింగరేణి సరఫరా చేస్తున్న నీటిలో నాణ్యత లోపించడంతో కార్మిక కుటుంబాలు తాగేందుకు ఆసక్తి చూపించడం లేదు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో మినరల్ వాటర్ ప్లాంట్ల నుంచి కొనుగోలు చేసుకుంటున్నారు. గోదావరి ఒడ్డున ఉన్న రక్షిత నీటి పథకంతో పంపుహౌస్ నుంచి కార్మిక కుటుంబాలకు రోజుకు 8 మిలియన్ గ్యాలన్ల నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే గోదావరిలో మురుగు చేరుతుండటంతో నాణ్యత దెబ్బతింటోంది. దీంతో జబ్బులు సంక్రమిస్తున్నాయని కార్మికులు ఆందోళన చెందుతున్నారు.

రూ.20 కోట్లతో..తాగునీటిని మెరుగుపర్చేందుకు సింగరేణి రూ.20 కోట్లతో చేపట్టిన ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ పంపుహౌస్ నిర్మాణ పనులు పూర్తి కాలేదు. గోదావరి నీటిని అందులోకి మళ్లించి నేరుగా ఫిల్టర్ చేసేలా పనులు చేపట్టింది. అయితే ఇవి పూర్తి కావడానికి మరో



అయిదు నెలలు పట్టే అవకాశముంది. సింగరేణి కాలనీల్లో నివసించే 15 వేల మంది కార్మిక కుటుంబాలతోపాటు మరో 35 వేలమంది విశ్రాంత కార్మిక కుటుంబాలకు నీటిని అందిస్తోంది.

**పని చేయని ఆర్వో ప్లాంట్లు**

తాత్కాలికంగా కార్మిక కుటుంబాలకు స్వచ్ఛమైన నీరు అందించేందుకు కాలనీవారీగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు పనిచేయడంలేదు. కార్మిక వాడల్లో రూ.2 లక్షల చొప్పున వెచ్చించి 10 వరకు వీటిని ఏర్పాటు చేశారు. నిర్వహణ బాధ్యులు పట్టించుకోకపోవడంతో.. ఒక్కో కుటుంబం రోజుకు 20 నుంచి 40 లీటర్ల నీటిని కొనుగోలు చేస్తున్నారు.

**జబ్బుల భయం**

సింగరేణి సరఫరా చేస్తున్న నీరు నాణ్యత లేకపోవడంతో.. కేవలం ఇంటి అవసరాలకు మాత్రమే వినియోగించుకుంటున్నాం. అవి తాగితే జబ్బులు వస్తాయని భయం. మినరల్ వాటర్ కొనుగోలు చేసుకొని తాగుతున్నాం.మౌనిక, గృహిణి

**పనుల్లో వేగం పెంచాలి**

కార్మికులకు నాణ్యమైన తాగునీరు అందించేందుకు ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ పనుల్లో వేగం పెంచాలి. ఇప్పటికే అనుకున్న సమయం దాటిపోయింది. అయినా పనులు పూర్తి కాలేదు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరగా పూర్తి చేయాలని కోరాం. శ్రీనివాస్, గుర్తింపు సంఘం నాయకుడు

**సెప్టెంబరు నాటికి పూర్తి చేస్తాం**

సెప్టెంబరు నాటికి ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ పంపుహౌస్ పనులు పూర్తి చేస్తాం. తాగునీటికి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం. గోదావరిలో నీటి ప్రవాహం లేకపోవడంతో ఇబ్బంది ఏర్పడుతుంది. ఆర్వో ప్లాంట్లను అందుబాటులోకి తీసుకురావాలని గుత్తేదార్లకు సూచించాం.లలిత్‌కుమార్, ఆర్జీ-1 జీఎం

చురకలు

ఆదివారం 18 మే 2025

# నకిలీలలు.. నమ్మకద్రోహులు

హైదరాబాద్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని.. బంధువుల అబ్బాయితో పెళ్లి నిశ్చయమైంది. కొద్దిరోజులకు అతడి ప్రవర్తన సరిగాలేదని వివాహం రద్దు చేసుకున్నారు. కక్షగట్టిన అతడు నిశ్చితార్థం ఫొటోలను మార్ఫింగ్ చేసి వేధించాడు. ఫిర్యాదుతో పోలీసులు అరెస్ట్ చేశారు. ఆరు నెలలైనా బాధితురాలు కోలుకోలేకపోయింది. ప్రస్తుతం మానసిక నిపుణుడి వద్ద కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నారు. అమ్మాయిల బలహీనత.. నిస్సహాయతను ఆసరా చేసుకొని ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. నగరంలో ప్రతి నెలా పోలీసులకు మహిళల నుంచి 10కిపైగా ఇలాంటి ఫిర్యాదులు వస్తుంటాయి. అధికశాతం సోషల్ మీడియా వేదికగా జరుగుతున్నాయి. **మొదట స్నేహం.. ఆపై మోసం**

పేరు తెచ్చుకోవాలనే తపనతో అమ్మాయిలు రీల్స్, వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తున్నారు. అక్కడే నకిలీ ఫొటోలు, సమాచారంతో ప్రబుద్ధులు వల విసురుతున్నారు. ఓ ఇంజినీరింగ్ విద్యార్థినికి వల వేసిన వ్యక్తి ఆమె నగ్నవీడియోలు సేకరించి బెదిరించి రూ.లక్ష వసూలు చేశాడు. తనతో గడిపేందుకు హోటల్‌కు రమ్మనడంతో పోలీసులను ఆశ్రయించింది. ప్రైవేట్ ఉద్యోగినికి ఫేస్‌బుక్‌లో పరిచయమైన వ్యక్తి ప్రేమ పేరిట దగ్గరయ్యాడు. హోటల్‌కు రప్పించుకొని రహస్యంగా వీడియోలు తీసి బెదిరించి రూ.లక్ష నగదు, మరో యువతిని సమకూర్చాలని షరతు విధించాడు.



షీటీమ్స్‌ను ఆశ్రయించటంతో నిందితుడిని అరెస్ట్ చేశారు.

**మ్యాట్రిమోనీ.. డేటింగ్ యాప్‌లు**

ఒంటరిగా ఉండే కొందరు డేటింగ్‌యాప్‌లలో స్నేహాలతో ఉపశమనం పొందవచ్చని భావిస్తున్నారు. ఇక్కడ మాయగాళ్లు నకిలీ ప్రొఫైల్స్‌తో మహిళలను ఆకట్టుకొని.. ప్రేమ, పెళ్లి అంటూ నమ్మించి ఏవో సాకులు చెబుతూ సొమ్ము కాజేస్తున్నారు. కాబోయే భార్యకు కానుకలు పార్సిల్ చేస్తున్నామంటూ మురిపిస్తారు. విమానాశ్రయం, నౌకాశ్రయం నుంచి కస్టమ్స్ అధికారులమంటూ ఫోన్ చేసి.. పన్నులంటూ రూ.లక్షలు వసూలు చేస్తారు. ఏటా ఇలా 20-30 ఫిర్యాదులు వస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**ధైర్యంగా ఫిర్యాదు చేయండి**

- డాక్టర్ లావణ్యానాయక్ జాదవ్, డీసీపీ, నగర మహిళ భద్రతా విభాగం మోసగాళ్లు నకిలీ ప్రొఫైళ్లతో నమ్మకం కలిగించి ఇబ్బందులకు గురిచేస్తారు. సామాజిక మాధ్యమాల్లో పరిచయమైన వారితో పరిమితిగా ఉండాలి. వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దు. బలమైన పాస్‌వర్డులు ఉపయోగించాలి. వేధింపులు ఎదురైనప్పుడు ధైర్యంగా షీటీమ్స్ హెల్ప్‌లైన్ డయల్ 100, వాట్సాప్ నంబర్ 94906 16555కు ఫిర్యాదు చేయండి.

# రూ.1,839 కోట్ల పనులకు టెండర్లు

హైదరాబాద్: గ్రేటర్ పరిధిలో పైవంతెనలు, అండర్‌పాస్‌లు, రహదారుల విస్తరణ కోసం చేపట్టిన హెచ్- సిటీ ప్రాజెక్టులో మొదటిసారి కొన్ని పనులు టెండరు దశ పూర్తి చేసుకున్నాయి. గతేడాది డిసెంబరు 3న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.7వేల కోట్ల పనులకు శంకుస్థాపన చేయగా.. తాజాగా రూ.1,839 కోట్ల విలువైన పనులకు టెండరు ప్రక్రియ పూర్తయింది.

**మేఘా, కేఎన్ఆర్..**



కేబీఆర్ పార్కు చుట్టూ ఆరు కూడళ్లలో స్టీలు బ్రిడ్జీలు, అండర్‌పాస్‌ల నిర్మాణ పనులను మేఘా సంస్థ దాదాపు దక్కించుకున్నట్టేనని అధికారులు చెబుతున్నారు. సాంకేతికంగా ఆ సంస్థ అర్హత సాధించిందని, మరో రెండ్రోజుల్లో అధికారికంగా ఎంపిక చేస్తామన్నారు. ఖాజాగూడ, ట్రిపుల్‌ఐటీ చౌరస్తాల్లో నిర్మించ తలపెట్టిన పైవంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణ పనులు, అంజయ్యనగర్, గచ్చిబౌలి రహదారుల విస్తరణకు ఒకే ప్యాకేజీ కింద టెండర్లు పిలవగా, కేఎన్ఆర్ సంస్థ కాంట్రాక్టు దక్కించుకుంది. ఈ సంస్థ అంచనా వ్యయం మీద 4.68 శాతం అదనపు మొత్తంతో కాంట్రాక్టు పొందినట్లు, మేఘా సైతం అదనపు మొత్తానికి టెండరు వేసినట్టు యంత్రాంగం చెబుతోంది. కేబీఆర్ పార్కు చుట్టూ పైవంతెనల నిర్మాణంపై న్యాయస్థానం యథాతథస్థితి ఉత్తర్వులున్నాయి. టెండరు ప్రక్రియ వరకే అనుమతి ఉందని అధికారులు పేర్కొన్నారు.

# ప్రజారోగ్యానికి.. పొగ

హైదరాబాద్ 'ఘాటు వాసలు రావడానికి ప్రత్యేక సమయం అంటూ ఏదీ ఉండదు. సాయంత్రం, రాత్రుళ్లు, తెల్లవారుజామున, వర్షాలు కురిసినప్పుడు, దట్టంగా మేఘాలు కమ్ముకున్నప్పుడు వస్తుంటాయి. ఆ సమయంలో గంట నుంచి రెండు గంటల పాటు ఊపిరి పీల్చుకోవడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాం. శ్వాసకోశ సమస్యలున్న వారి పరిస్థితి మరీ దారుణం. కళ్లు ఎర్రబడటం, అలర్జీలు వంటి సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. 'జనవాణి - కాలుష్య నివారిణి'కి మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం' - బాచుపల్లి, మల్లంపేట వాసులు

వందకు పైగా పరిశ్రమలు..బాచుపల్లి, మల్లంపేట పరిసర ప్రాంతాల్లో 100కి పైగా బల్క్‌డ్రగ్, ఫార్మా, రసాయన పరిశ్రమలున్నాయి. వాటిల్లో ఉత్పత్తులు తయారు చేస్తున్నప్పుడు విడుదలయ్యే పొగను శుద్ధి చేయకుండా వదులుతుండటమే ఘాటువాసనలకు ప్రధాన కారణం.

నిబంధనలు తూచ్‌నిబంధనల ప్రకారం పరిశ్రమల నుంచి పొగను నేరుగా గాలిలో విడుదల చేయకూడదు. ముందుగా ప్రత్యేక ఛాంబర్లలోకి పంపించి శుద్ధి చేసిన తర్వాత ప్రత్యేక గొట్టాల ద్వారా విడుదల చేయాలి. ఈ గొట్టాలు లోపల జిగ్‌జాగ్ తరహాలో ఉండాలి. అప్పుడే కాలుష్య కారకాలను గ్రహించే వీలుంటుంది. చాలా పరిశ్రమల్లో ఇవి నిబంధనలు మేరకు లేవనేది బహిరంగ రహస్యం.

# పేదల ముంగిట ఆధునిక వైద్యం




వికారాబాద్ : వికారాబాద్ పట్టణంలో దాదాపు 40 సంవత్సరాల క్రితం నిర్మించిన భవనంలోనే ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి కొనసాగుతోంది. ఇరుకైన గదులు, వైద్యులు, సిబ్బంది కూర్చోడానికి కూడా సరియైన స్థలం లేక ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను అధిగమించడంతోపాటు, రోగులకు ఆధునిక వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సోమవారం కొత్త భవనం ప్రారంభించింది. పాత భవనాన్ని కొత్తదాన్లోకి మారుస్తారు. తద్వారా పేదల ముంగిట విలువైన వైద్యం అందుబాటులోకి వచ్చే అవకాశం ఏర్పడింది. ఈ నేపథ్యంలో

**వైద్య కళాశాల మంజూరుతో తిరిగిన దశ**

మూడు సంవత్సరాల క్రితం వికారాబాద్‌కు ప్రభుత్వ మెడికల్ కళాశాల మంజూరు కావటంతో జిల్లా వైద్య సేవల దశ తిరిగింది. ఇందులో భాగంగా జనరల్ ఆసుపత్రికి కొత్త భవనాన్ని నిర్మించారు. వైద్య కళాశాలకు నిబంధనల ప్రకారం 350 పడకలు తప్పని సరి. కొత్త భవనంలో 300 పడకలుంటాయి. పాత ఆసుపత్రిలో 50 పడకలున్నాయి. దీంతో 350 పడకలు సమకూరుతాయి.

ఇక్కడ జనరల్ సర్జరీలు, మేజర్ సర్జరీలు నిర్వహిస్తారు.

ఐసీయూ యూనిట్, వెంటిలేటర్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తారు.

ఇప్పటి వరకు రోగులు ఏ చిన్న సమస్యతో ఆసుపత్రికి వచ్చినా ఇక్కడ సరైన సౌకర్యాలు లేక హైదరాబాద్‌కు సిఫారసు చేసేవారు. ఇక నుంచి అలాంటి అవసరం ఉండదు. సూపర్ స్పెషాలిటీస్ సేవలు అవసరం ఉన్న వారిని మాత్రం హైదరాబాద్ సిఫారసు చేస్తారు.

ఆసుపత్రికి అవసరం ఉన్న పరికరాల కొనుగోలు ప్రక్రియను 45 రోజుల్లో పూర్తి చేయాలని భవనం ప్రారంభించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ వైద్యాధికారులకు సూచించారు.

ముందుగా ఓపీ సేవలు ప్రారంభిస్తాం

- డాక్టర్ రాంచంద్రయ్య, సూపరింటెండెంట్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, వికారాబాద్

కొత్తగా ప్రారంభించిన ఆసుపత్రి భవనంలో ముందుగా ఓపీ (బయటి రోగులు) సేవలను త్వరలో ప్రారంభిస్తాం. అనుకూలతను బట్టి ఒక్కొక్కటి తరలిస్తాం. రోగులకు నిరంతరం వైద్యులు, మందులు, సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటాం.

ఇదీ సమాచారం

కొత్త ఆసుపత్రిలో పడకలు.. 300

భవన నిర్మాణానికి వ్యయం.. రూ. 23.75 కోట్లు

క్రిటికల్ కేర్ యూనిట్‌కు.. రూ.16 కోట్లు

# చల్లని మాటలు.. చెల్లని తీరు




హైదరాబాద్: ఎండ మండిపోతుంటే గచ్చిబౌలి నుంచి నిజాంపేట్ వెళ్లేందుకు ఏసీ బస్సు (మియాపూర్-2 డిపో) ఎక్కా. బస్సులో అపరిశుభ్రం, పని చేయని ఏసీతో తీవ్ర అసౌకర్యానికి గురయ్యా. గాలి రాక, చల్లదనం లేక ఉక్కిరిబిక్కిరయ్యా'

నగరానికి చెందిన జ్ఞానేశ్వర్ ఆర్టీసీ ఉన్నతాధికారులకు చేసిన ఫిర్యాదు. నగరంలో ఏసీ బస్‌షెల్టర్లు అలంకారప్రాయంగా ఉన్నాయి. ఏసీలు, ఫ్యాన్లు లేవు. బస్‌స్టాప్‌లో వేచి ఉండలేక ఎండలోనే బస్సుల కోసం వేచి చూడాల్సి వస్తోంది.

**బేగంపేట్‌కు చెందిన ఓ ప్రయాణికురాలి ఆవేదన**

ఈనాడు, బస్‌షెల్టర్లకు అనుమతులిచ్చేది జీహెచ్ఎంసీ. ఏర్పాటు చేసి లాభాలు పొందేవి ప్రైవేటు ఏజెన్సీలు. ప్రయాణికుల కోసం బస్సులు ఆపేది ఆర్టీసీ.. ఈ మూడు సంస్థల సమన్వయ లోపం ప్రయాణికులకు శాపంగా మారుతోంది. ఏసీ షెల్టర్లు, బస్సుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. బస్‌షెల్టర్ల ఏర్పాటుకు జీహెచ్ఎంసీ కొన్ని ప్రైవేటు ఏజెన్సీలకు ఎనిమిదేళ్ల క్రితం అనుమతులిచ్చింది. నిబంధన ప్రకారం పదేళ్ల గడువు కాగా, మరో ఐదేళ్లు పొడిగించే వెసులుబాటు ఉంది. కొన్ని షెల్టర్లు జిరాక్స్ కేంద్రాలు, జ్యూస్ సెంటర్లుగా మారిపోయాయి. అనేక ప్రాంతాల్లో వాటి ముందే దుకాణాలు ఏర్పాటు చేశారు. విరిగిన బెంచీలు, పనిచేయని ఏసీలు దర్శనమిస్తున్నాయి. కేపీహెచ్‌బీ లాంటి చోట్ల ఏసీ షెల్టర్లు మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి.

**ఆదరణ ఉన్నా..**

నగరంలో ఆర్టీసీ ఏసీ బస్సులకు ఆదరణ ఉంది. శంషాబాద్ విమానాశ్రయానికే 53 ఏసీ బస్సులను నడుపుతున్నారు. వేర్వేరు ప్రాంతాల నుంచి ఐటీకారిడార్‌కు 70 ఏసీ బస్సులు ఉన్నాయి. వీటన్నింటిలో 65 శాతం ఆక్యుపెన్సీ ఉంటోంది. నిర్వహణ లోపంతో ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెతున్నాయి. ముఖ్యంగా ఏసీ మొరాయింపు, శుభ్రత పాటించడం లేదని వాపోతున్నారు. ప్రధానంగా మియాపూర్-2 డిపో బస్సుల నిర్వహణపై ఎక్కువగా ఫిర్యాదులు అందుతున్నాయి. **ఏసీ బస్సు షెల్టర్లు ఇవే..**

ఖైరతాబాద్, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, బోరబండ, కేపీహెచ్‌బీ, ఆరాంఘర్, దిల్‌సుఖ్‌నగర్, కొండాపూర్, మలేషియన్ టౌన్‌షిప్, కోఠి, తార్నాక, మదీనాగూడ శిల్పారామం, విద్యానగర్, బేగంపేట.

**గ్రేటర్ పరిధిలో..**

బస్సులు: 2,800

ప్రయాణికులు 20 లక్షలు

బస్సు షెల్టర్లు 1370

అదనంగా కావాల్సిన బస్సులు 400


వెంటనే కావాల్సినవి 180

# సరిహద్దు దాటొచ్చి.. చీకటి దందా

హైదరాబాద్ : భారత్‌లోకి అక్రమంగా చొరబడ్డ బంగ్లాదేశీయులకు ఆధార్, జనన ధ్రువపత్రాలతో పాటు పాస్‌పోర్టులూ వచ్చేస్తున్నాయి. దొడ్డిదారిన దేశంలోకి ప్రవేశించిన వారికి ఇలా జారీ అవడం కలకలం రేపుతోంది. నగరంలో నివసించే విదేశీయులు, అసాంఘిక శక్తులపై నిఘా పెడుతున్నట్లు అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంటోంది. స్థానికులుగా చెలామణి అవుతూ వ్యభిచార ముఠాలు, రౌడీషీటర్లుగా నేర కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. బంగ్లాదేశీయులు నగరంలో తిష్ట వేయడానికి ప్రధాన కారణం వారి ఆహార్యం, అలవాట్లు కొంత మనలా ఉండడం ఒకటైతే.. పోలీసులు చూసీచూడనట్లు వదిలేయడం మరొకటనే విమర్శలున్నాయి. కొందరు బంగ్లాదేశీయులు అక్రమంగా నివాసం ఉంటున్నట్లు తెలిసినా పట్టించుకోవడం లేదు. దీంతో వారు స్థానికుల సాయంతో అక్రమంగా జనన ధ్రువపత్రాలు, ఆధార్ సంపాదిస్తున్నారు. వీటి సాయంతో పాస్‌పోర్టు తీసుకుంటున్నారు. ఇక్కడ గుర్తింపు పత్రాలు వచ్చాక క్రమంగా కొందరు నేరాలకు పాల్పడుతున్నారు. ఇటీవల ఖైరతాబాద్, చాదర్‌ఘాట్ ప్రాంతాల్లో నగర పోలీసులు అదుపులోకి తీసుకున్న వ్యభిచార ముఠాలోని సభ్యులు బంగ్లాదేశీయులే కావడం గమనార్హం. ఏటా వందల సంఖ్యలో గంజాయి, డ్రగ్స్ రవాణా, వ్యభిచారం తదితర కేసుల్లో పోలీసులకు దొరికిపోతున్నారు.

**డంకీ రూట్లలో దేశంలోకి ప్రవేశం**

నగరానికి వచ్చే బంగ్లాదేశీయులు ఎక్కువగా డంకీ రూట్ల ద్వారా దేశంలోకి ప్రవేశిస్తున్నట్లు గుర్తించారు. దట్టమైన అడవులు, కొండలు, నదుల మీదుగా.. పశ్చిమబెంగాల్, అస్సాం రాష్ట్రాల్లోకి ప్రవేశిస్తారు.



అక్కడి నుంచి రైలు, బస్సు మార్గాల్లో హైదరాబాద్ చేరుకుంటున్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలోనే దాదాపు 5 వేల వరకు రోహింగ్యాలు అంతకు రెట్టింపు బంగ్లాదేశీయులు ఉన్నట్లు సమాచారం.

**ఇటీవలి సంఘటనలు**

పోచారంలో అక్రమంగా ఉంటున్న బంగ్లా దేశస్థుడిని ఇటీవల పోలీసులు అరెస్టు చేశారు. పశ్చిమబెంగాల్‌లో ఆధార్, పాన్‌కార్డు, ఓటరు గుర్తింపు సంపాదించి నగరానికి వచ్చాడు.

ఫిబ్రవరిలో రంజాన్ షేక్ పేరున్న వ్యక్తి ఢాకా వెళ్లేందుకు శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చాడు. తనిఖీల్లో అక్రమంగా వచ్చిన బంగ్లాదేశీయుడిగా గుర్తించారు. ఇద్దరు బంగ్లా దేశీయులు అక్రమంగా హైదరాబాద్ వచ్చి ఇక్కడి స్నేహితుల సాయంతో గుర్తింపు పత్రాలు సంపాదించారు. స్థానిక యువతుల్ని వివాహమాడి దుబాయ్ తీసుకెళ్లే యత్నంలో అధికారులకు చిక్కారు.

# తూకాల్లో జాప్యం.. అన్నదాతల దైన్యం

ఎల్లారెడ్డిపేట : కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేర రవాణా వాహనాలు, హమాలీ సమస్యలు రాకుండా చూసుకోవాలి. ఐకేపీ ఏపీఎంలు నిత్యం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షిస్తూ రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి. ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే జిల్లాస్థాయి అధికారుల దృష్టికి తీసుకురావాలి. జిల్లాలో ప్రతి మండలంలో అధికారులు చొరవ తీసుకొని, కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలింపు జరిగేలా చూడాలి.

తరచుగా నిర్వహిస్తున్న సమీక్ష సమావేశాల్లో జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశాలివి. జిల్లాలో యాసంగి సీజన్‌లో పండించిన వరిధాన్యం విక్రయానికి అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాలను అత్యధికంగా ఐకేపీ మహిళా సంఘాలకు కేటాయించారు. నేటికీ తూకాల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. అకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవుతుండగా అన్నదాతలు దైన్య స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. అనేక కొనుగోలు కేంద్రాల్లో కనీస మౌలిక వసతులు మృగ్యమయ్యాయి. వివిధ మండలాల్లో హమాలీ కూలీల కొరత రైతులను వేధిస్తోంది. చాలాచోట్ల కొనుగోలు కేంద్రాల పర్యవేక్షణను క్షేత్రస్థాయిలో అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చాలాచోట్ల ఐకేపీ ఏపీఎంలు, సీసీలు, ఇతర సిబ్బంది కార్యాలయం గడప దాటడం లేదనే ఆరోపణలు మిన్నంటుతున్నాయి. కొనుగోళ్ల క్రతువును మహిళా సంఘాలకే వదిలేస్తుండగా బుక్ కీపర్‌లే పెద్ద దిక్కుగా మారుతున్నారు. ఆకాశం మేఘావృతమైనప్పుడల్లా ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని వివిధ కేంద్రాల్లో వర్షానికి ధాన్యం తడిసి మొలకెత్తుతోంది. తడిసిన ధాన్యాన్ని తిరిగి ఆరబెట్టేందుకు కర్షకులు చెమటోడ్చుతున్నారు.

**1.69 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ**

జిల్లాలో ఈ నెల 13 వరకు 24,294 మంది రైతుల నుంచి రూ. 393 కోట్ల విలువ చేసే 1,69,618 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. 1,62,710 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు చేర్చగా 6908 మెట్రిక్ టన్నుల ధాన్యం బస్తాలను తరలించాల్సి ఉంది. 242 కేంద్రాల నుంచి ధాన్యం కొనుగోళ్లు సాగగా వీటిలో 12 కేంద్రాలను మూసివేశారు. ఇందులో 1,0894 మంది రైతులకు చెందిన 72,610 మెట్రిక్ టన్నుల ధాన్యం డబ్బులు రూ. 168.46 కోట్లను బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు.

**కుప్పగా పోసి 16 రోజులు**

నా సొంత భూమితోపాటు మరికొంత వ్యవసాయ పొలాన్ని కౌలుకు తీసుకొని సన్నరకం వరి సాగుచేశాను. మొత్తం ఏడెకరాల వరిని కోసి, జక్కుల చెరువు పక్కన ఐకేపీ కేంద్రంలో ఆరబెట్టాను. కుప్పగా పోసి 16 రోజులవుతోంది. రాచర్ల బొప్పాపూర్ ఐకేపీ కేంద్రాలకు చుట్టుపక్కల మరో నాలుగు గ్రామాల రైతులు ధాన్యాన్ని తీసుకొచ్చారు. తూకాలను వేగవంతం చేయాలి.

**ల్యాగల వినోద్‌రెడ్డి, రైతు, రాచర్ల బొప్పాపూర్**

అకాల వర్షాలకు తడుస్తోంది

నాకున్న మూడెకరాల్లో దొడ్డురకం వరి సాగుచేశాను. నెలరోజుల క్రితం కోతలు చేపట్టి జక్కుల చెరువులో ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాను. నిర్ణీత తేమశాతం వచ్చేంత వరకు ఎండబెట్టాను. 25 రోజులవుతున్నా తూకానికి నోచుకోవడం లేదు. అప్పుడప్పుడూ కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడిసిపోతోంది. రేయింబవళ్లూ కేంద్రంలోనే ఉండాల్సి వస్తోంది.

బొమ్మనవేణి చంద్రం, రైతు రాచర్ల బొప్పాపూర్

# ఆ జాబితా ఏమైనట్లు?

కరీంనగర్ : జిల్లాలోని మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థ పరిధిలో కొత్త రేషన్‌కార్డుల జారీ విషయంలో గందరగోళం తొలగడం లేదు. ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసిన వారికి ఇప్పటివరకు రాకపోగా, మీసేవ, రెవెన్యూ కార్యాలయాల్లో అందించిన వారికి మాత్రం కొత్తగా రేషన్‌కార్డులు రావడం, ఈ నెలలో బియ్యం కూడా తీసుకోవడంతో.. మిగతా అర్హులైన వారిలో ఆందోళన నెలకొంది. ఈ ఏడాది జనవరి 21, 22 తేదీల్లో వార్డు సభలలో ప్రదర్శించిన రేషన్ కార్డుల జాబితాలోని లబ్ధిదారులకు ఏ ఒక్కరికి రేషన్‌కార్డు జారీ కాలేదు. ఇంతకీ ఆ జాబితా ఏమైందో, అది ఎక్కడి నుంచి వచ్చిందో తెలియకుండా మారింది. మంజూరు కాని జాబితాను తీసుకొచ్చి వార్డు సభల్లో అతికించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**సర్వేల పేరుతో కాలయాపన**

రేషన్ కార్డులు లేని వారికి, కొత్త రేషన్‌కార్డుల జారీ చేసేందుకు ఈ ఏడాది జనవరి రెండో వారంలో నగరపాలిక పరిధిలోని వార్డు అధికారులు సర్వే చేశారు. నగరంలోని 60 డివిజన్లతోపాటు విలీన కాలనీల్లో ఇంటింటా తిరుగుతూ వివరాలను నమోదు చేసుకున్నారు. ఆ సమయంలో ఎవరికైతే రేషన్‌కార్డు లేదని పేర్కొన్నారో వారి వివరాల జాబితా ఆధారంగా వివరాలను పౌరసరఫరాల శాఖ సేకరించింది. ఆ వివరాల ఆధారంగానే సర్వే నిర్వహించారు. నగరవ్యాప్తంగా 18,964 పేర్లతో కూడిన జాబితాను వార్డు అధికారులు, మెప్మా, శానిటేషన్ ఉద్యోగుల ద్వారా విచారణ చేపట్టారు. వీటన్నింటిని అధికారులు ఆన్‌లైన్ చేసి పౌరసరఫరాల శాఖకు పంపించారు. తీరా రేషన్‌కార్డులు ఏవీ కూడా ఆమోదం కాకపోవడంతో అధికారులు కంగుతిన్నారు. వారం రోజులుగా ఇంటింటా తిరుగుతూ మళ్లీ విచారణ



ప్రారంభించారు. ఆ యాప్ కూడా సక్రమంగా పని చేయడం లేదని వార్డు అధికారులు చెబుతున్నారు.

అర్హులు అర్జీలు ఇచ్చినా.. ప్రజాపాలనలో పేర్లు ప్రకటించినా ఇప్పటి వరకు కార్డు రాలేదని తెలుసుకొని దరఖాస్తుదారులు మండిపడు తున్నారు. వీరంతా స్థానిక మాజీ కార్పొరేటర్ల ఇళ్లచుట్టూ, నగరపాలిక కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే వారే లేరు. మీసేవలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారికి మాత్రం వారం కిందటి వరకు వచ్చాయి. ప్రస్తుతం నమోదు మాత్రమే చేస్తుండగా రేషన్‌కార్డులను మాత్రం రెవెన్యూ అధికారులు పరిశీలించడం లేదు. సర్వేల పేరుతో కాలయాపన చేయడం తప్ప మరోటి లేదని, ముందుగానే మీసేవలో దరఖాస్తు చేసుకోమని అధికారులు సూచనలు చేస్తే ఈ ఇబ్బందులే ఉండేవి కావనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను సర్వే చేస్తున్నామని.. వార్డు అధికారుల ద్వారా 40 శాతం పూర్తయిందని జిల్లా పౌరసరఫరాల అధికారి నర్సింగరావు తెలిపారు. అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ అవుతాయని పేర్కొన్నారు.

# ఏళ్లుగా బీళ్లుగానే..

మల్లాపూర్: గోదావరిలో వృథాగా పోతున్న జలాలను బీడు భూములకు తరలించాలన్న ఉద్దేశంతో నిర్మించ తలపెట్టిన గంగనాల ప్రాజెక్టు కాలువ పనులు పూర్తికాకపోవడంతో మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాల్లోని పలు గ్రామాల్లో వ్యవసాయ భూములు నిరుపయోగంగా మారుతున్నాయి. గత ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో మరమ్మతులకు అవసరమైన నిధులు మంజూరు చేయకపోవడంతో వేల ఎకరాలు బీళ్లుగా మారాయి. గత ప్రభుత్వంలో మామడ మండలం పొన్కల్ వద్ద బ్యారేజీ నిర్మాణం పేరిట రూ.531 కోట్లు మంజూరు చేసినప్పటికీ కాలువ పనులు ఆధునీకీరించకపోవడం.. మొగిలిపేట పెద్దచెరువును రిజర్వాయర్‌గా మార్చేందుకు అవసరమైన పనులకు నిధులు కేటాయించకపోవడంతో వేల ఎకరాల పంట భూములకు సాగునీరు రాని పరిస్థితి నెలకొంది. ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి శివారులోని గోదావరిలో ఆనకట్ట నిర్మించి గంగనాల ప్రాజెక్టు ద్వారా నీటిని మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాల్లోని 8 గ్రామాలకు సాగునీటిని అందించాలన్న ఉద్దేశంతో ఎనిమిది సంవత్సరాల కిందట రూ.12.5 కోట్లు అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. గుత్తేదారు సకాలంలో పూర్తిచేయకపోవడంతో పనులు ఆలస్యంగా పూర్తయ్యాయి. దీనికి తోడు మొగిలిపేట పెద్దచెరువుకు సాగునీటిని అందించే



కాలువలో సిమెంట్ లైనింగ్ చేపట్టకపోవడం, పెద్దచెరువును రిజర్వాయర్‌గా మార్చకపోవడం వంటి పనులతో బీడు భూములకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. ఇబ్రహీంపట్నం మండలంలోని ఫకీర్ కొండాపూర్, తిమ్మాపూర్ గ్రామాలతో పాటు మల్లాపూర్ మండలంలోని నడికుడ, మొగిలిపేట, సంగెం, శ్రీరాంపూర్, కొత్తదాంరాజుపల్లి, ఒబులాపూర్ గ్రామాల్లోని 4 వేల ఎకరాల భూములకు సాగునీరు రాని పరిస్థితులున్నాయి.

**పొన్కల్ బ్యారేజీ నుంచి పైపులైను ద్వారా..**

తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు రూ.531 కోట్లతో గంగనాల ఎగువన ప్రస్తుతం నిర్మిస్తున్న పొన్కల్ బ్యారేజీ నుంచి 18 కి.మీ దూరంలో ఉన్న మొగిలిపేట పెద్దచెరువుకు నేరుగా పైపులైను వేసి ఎత్తిపోతల ద్వారా నీటిని మళ్లించడంతో పాటు పెద్దచెరువును రిజర్వాయర్‌గా మార్చితే ప్రయోజనం ఉంటుంది. దీంతో మరో ఆరు గ్రామాల్లోని 3200వేల ఎకరాలను సస్యశ్యామలం చేయవచ్చు. పెద్దచెరువును రిజర్వాయర్‌గా మార్చి నీటి నిల్వ సామర్థ్యం పెంచితే మరింత ప్రయోజనకరంగా ఉంటుందని ఈ ప్రాంత రైతులు భావిస్తున్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి మొగిలిపేట చెరువును రిజర్వాయర్‌గా మార్చడంతో పాటు పొన్కల్ బ్యారేజీ నుంచి పైపులైను ద్వారా నీటిని మళ్లించడంపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

# ఎన్నాళ్లీ వెత..!

రాజపేట : జిల్లాలో వ్యవసాయం తర్వాత పాడి పరిశ్రమనే ఉపాధిమార్గం. వ్యవసాయానికి అనుబంధంగా వేలాది మంది రైతులు పశుపోషణ చేపట్టడమే కాకుండా పాల దిగుబడిలోనూ ఉమ్మడి జిల్లాతో పోల్చుకుంటే యాదాద్రి భువనగిరి జిల్లానే ప్రథమంగా ఉండటం గమనార్హం. ఈ తరుణంలో పశువులకు ఆరోగ్యపరమైన సమస్యలు వచ్చిన పరిస్థితుల్లో పశువైద్య సిబ్బంది విధులు చేపట్టాల్సి ఉండగా,



జిల్లాలో ఎక్కువ శాతం ఖాళీలే ఉండటం విచారకరం. ఇందుకు ప్రత్యామ్నాయంగా గోపాలమిత్రల ప్రాథమిక సేవలను వినియోగించుకుంటూ ముందుకెళ్తున్నారు. అయితే పశు వైద్యాధికారులు, రైతుల మధ్య అనుసంధాన కర్తలుగా ఉంటూ పాడి సంపద వృద్ధికి పాటుపడుతున్న గోపాలమిత్రలకు వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఏడు నెలలుగా ఇదే పరిస్థితి. జీవాలకు గాలికుంటు నివారణ టీకాలు, నట్టల నివారణ మందులు వేయడంతో పాటు కృత్రిమ గర్భధారణ కార్యక్రమం అమలులో వీరు కీలకపాత్ర పోషిస్తున్నారు.

**విధులు ఇవీ..**

వీరు ప్రధానంగా పశు సంపద పెంచేందుకు కృత్రిమ గర్భధారణ (ఐఆర్) ప్రక్రియ చేపడుతుంటారు. ఎదకు వచ్చిన పశువులకు ఇంజక్షన్ ద్వారా వీర్యం ఎక్కిస్తారు. మేలు జాతికి చెందిన వీర్యం పశువులకు ఇవ్వడం, అధిక పాల దిగుబడి సాధనకు చర్యలు తీసుకోవడం వంటి విధులు చేపడతారు. డీఎల్డీఏ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగుతుంది.

**వేతనాల పెంపు ఇలా..**

2000 సంవత్సరంలో ప్రభుత్వం గోపాలమిత్రల వ్యవస్థను అందుబాటులోకి తేగా, వీరి పనులను బట్టి దశలవారీగా వేతనాలు పెంచారు. తొలుత ప్రారంభంలో రూ.1200 ఉండగా, ఆ తర్వాత రూ.3,500లకు పెరిగింది. స్వరాష్ట్రం ఏర్పడ్డాక 2018 సెప్టెంబరులో రూ.8,500 పెరిగింది. ఇక రెండేళ్లుగా రూ.11,050లు చెల్లిస్తున్న విషయం తెలిసిందే. జిల్లా వ్యాప్తంగా విధులు చేపడుతున్న వీరికి సకాలంలో వేతనాలు అందక పోవడంతో కుటుంబపోషణ భారంగా మారిందంటున్నారు. ప్రతినెలా టీఎస్ఎల్డీఏ సీఈవో కార్యాలయం నుంచి వీటిని విడుదల చేస్తుంటారు. మరో వైపు పశువుల్లో కృత్రిమ గర్భధారణ నిర్ధారణ పరీక్ష చేసినందుకు రూ.100 చొప్పున ప్రోత్సాహకం చెల్లించాల్సి ఉండగా, ఇప్పుడు అది కూడా లేకపోవడం విచారించదగ్గ విషయం. ఈ విషయమై ఉన్నతాధికారులను విన్నవిస్తే బడ్జెట్‌లేమి కారణంగా ఆలస్యమని, త్వరలో చెల్లింపులుంటాయని అంటున్నట్లుగా తెలిసింది.

జిల్లా సమాచారం..

గోపాలమిత్రల సంఖ్య : 65

మొత్తం పశువుల సంఖ్య : 1,91,793

రోజూ పాలదిగుబడి : 52వేల లీటర్లు

తెల్లజాతి పశువులు : 69,173

నల్లజాతి పశువులు : 1,22,620

# నిధుల గండం.. నీళ్లు గగనం



కరీంనగర్: వానాకాలం వస్తుందంటే రైతులు ఆందోళన చెందే పరిస్థితి ఉమ్మడి జిల్లాలో కనిపిస్తోంది. సమృద్ధిగా వానలతో పంటలు పండుతాయన్న ఆనందం కన్నా మరమ్మతుకు నోచని కాలువలతో ఆయకట్టుకు సాగునీరందలేని పరిస్థితి కలవరపరుస్తోంది. ఏడెనిమిదేళ్లుగా ప్రధాన కాలువలతో పాటు చిన్న నీటి కాలువలకు మరమ్మతులు కరవయ్యాయి. ఏడేళ్లుగా నిధుల కోసం ప్రతిపాదనలు పంపడమే తప్ప మంజూరైన దాఖలాలు లేవు. నాలుగు జిల్లాల పరిధిలో 16 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణంలో 60 శాతానికి పైగా నీరందించడానికి ఈ కాలువలే ఆధారమవుతున్నాయి.

**నాడు కొన్ని చోట్లకే పరిమితం**

కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో 137 కి.మీ.ల మేర వరదకాలువ విస్తరించి ఉంది. దీన్ని ఇరువైపులా నాలుగు దశల్లో పటిష్ఠం చేయాలని గతంలో నిర్ణయం తీసుకున్నారు. ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకంలో భాగంగా గాయంత్రి పంప్‌హౌస్ నుంచి మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేట వరకు పంప్‌హౌస్‌ల నిర్మాణం చేపట్టిన సమయంలో పలు చోట్ల కాలువల ఆధునికీకరణ పనులు చేపట్టారు. మల్యాల మండలం నుంచి ఎస్సారెస్పీ వైపునకు నీరు పారేందుకు వీలుగా కాలువను చదును చేశారు. ఇందుకోసం రూ.28 కోట్ల వరకు వెచ్చించారు. దిగువ మానేరు కింద వరంగల్ వైపు కీలకమైన కాకతీయ కాలువను బాగు చేస్తామన్న ప్రతిపాదన అటకెక్కింది. 2016-17లో అయిదారు చోట్ల రూ.80 కోట్లతో లైనింగ్ పనులు చేపట్టడంతో కాలువల్లో కాస్తో కూస్తో నీళ్లు నిలువగలుగుతున్నాయి. ఈ మార్గంలో ఇంకా ప్యాచ్ వర్క్‌లు పెండింగ్‌లో ఉన్నాయి.

**ఈ రెండు నెలలే కీలకం**

జూన్‌లో వర్షాలు పడే సమయానికే మరమ్మతులు పూర్తయితే వానాకాలం పంటలకు ఇబ్బందులుండవు. 2022లో మరమ్మతులకు దాదాపు రూ.1200 కోట్లు అవసరమని లెక్కలేశారు. ఇటీవల క్షేత్రస్థాయిలో అంచనాలు రూపొందించి అత్యవసరంగా దాదాపు రూ.212 కోట్లు అవసరమని ఇంజినీరింగ్ అధికారులు తేల్చి చెప్పినా ఇప్పటికీ నిధుల ఊసే లేదు. మరమ్మతుల విషయమై ఎస్సారెస్పీ కరీంనగర్ జిల్లా ఈఈ నాగభూషణంతో మాట్లాడగా కాలువల్లో మొక్కలు, పొదలు తొలగించేందుకు, 10 వేల ఎకరాలకు ప్రయోజనం కలిగించే కాలువల మరమ్మతుకు ఉన్నతాధికారుల సూచన మేరకు ప్రతిపాదనలు పంపుతామన్నారు.

**తక్షణావసరాలు ఇవీ..**

ఏటా వర్షాకాలంలో సమీపంలోని గుట్టలోని మట్టి కరిగి వరద కాలువలో పూడిక పెరుగుతోంది. కొన్ని చోట్ల నాలుగు మీటర్ల ఎత్తు వరకు పెరిగిన మట్టిని తొలగించాలి.

కొత్తగా ఫీడర్ ఛానళ్ల నిర్మాణం లేకపోవడంతో పంటలకు నీరందడం కష్టంగా మారింది. వరద కాలువలపై 100కు పైగా కొత్త ఫీడర్ ఛానళ్లు నిర్మించాల్సిన అవసరముంది.

డిస్ట్రిబ్యూటరీ కాలువల లైనింగ్ చాలా చోట్ల దెబ్బతింది. ఉమ్మడి జిల్లాలో మరమ్మతులకు రూ.25 కోట్లు అవసరమని రెండేళ్ల కిందట అంచనా వేశారు.

వరద ఉద్ధృతికి కాలువలకు గండ్లు పడటంతో తాత్కాలికంగా రాళ్లు, మట్టి, సిమెంటు బస్తాలు వేశారు. ఆయా ప్రాంతాల్లో ఈ వేసవిలో మరమ్మతులు చేస్తే బాగుంటుంది.

చాలా చోట్ల తూములు పాడయ్యాయి. పలు చోట్ల రూపును కోల్పోయి అధ్వానంగా మారడంతో వచ్చే వానాకాలంలో నీరు నిలిచే పరిస్థితి కనిపించడం లేదు. ఉపాధిహామీ పథకంలో కొన్ని గ్రామాల్లో తాత్కాలికంగా ముళ్ల పొదలను, చెత్తను తొలగించి మట్టి పనులు మాత్రం చేపట్టారు. సిమెంటు పనులు చేయాల్సి ఉంది.

# అవయవ మార్పిడులు అరకొర వసతులతోనేనా?



హైదరాబాద్ : పేద రోగులకు ఉచితంగా అవయవ మార్పిడి చేసే ఉద్దేశంతో గాంధీ ఆసుపత్రిలో ఏర్పాటు చేస్తున్న ఆధునిక అవయవ మార్పిడి కేంద్రం పనులు నత్తను తలపిస్తున్నాయి. ఫలితంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన వసతులు లేమితో అవయవ మార్పిడిలో ప్రైవేటు ఆసుపత్రులే ముందుంటున్నాయి. బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి నుంచి అవయవాలు సేకరించాలంటే.. అత్యాధునిక మౌలిక వసతులు ఉండాలి. వైరస్, బ్యాక్టీరియా లోపలకు వెళ్లలేని ఆధునిక మాడ్యులర్ థియేటర్లు అవసరం. ప్రస్తుతం గాంధీ, ఉస్మానియాలో ఈ పరిస్థితి లేదు. అడపాదడపా మార్పిడి చికిత్సలకు ప్రస్తుతం ఉన్న థియేటర్లనే వాడుతున్నారు. వసతులు లేక బ్రెయిన్‌డెడ్ వ్యక్తుల నుంచి అవయవాల సేకరణ కష్టమవుతోంది. నిధులు మంజూరైనా..

గాంధీ ఆసుపత్రిలో ఆధునిక అవయవ మార్పిడి కేంద్రం అందుబాటులోకి తెచ్చేందుకు గతంలో ప్రభుత్వం నిర్ణయించింది. అన్ని అవయవాల మార్పిడి ఒకేచోట చేపట్టేలా.. ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దాలని నిర్ణయించారు. ప్రస్తుతం ప్రధాన భవనంలోని ఎనిమిదో అంతస్తులో రూ.35 కోట్లతో 6 ఆధునిక ఆపరేషన్ థియేటర్లను ఏర్పాటు చేస్తున్నారు. గుండె, మూత్రపిండాలు, లివర్, ఊపిరితిత్తులను మార్పిడి చేయడంతో పాటు ఆర్థోపెడిక్ సంబంధిత కీళ్లమార్పిడి, ఈఎన్‌టీకి చెందిన కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీల కోసం మొత్తం ఆరు ఆపరేషన్ థియేటర్ల పనులు సాగుతున్నాయి. 2021లో నిధులు మంజూరు కాగా.. రెండేళ్ల కిందటే పూర్తి కావాల్సిన పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

**నోడల్ కేంద్రంగా...**

ప్రభుత్వ ఆధ్వర్యంలో అవయవ మార్పిడికి సంబంధించి నోడల్ కేంద్రంగా గాంధీని ప్రకటించారు. సర్కారుపరంగా అవయవ మార్పిడి చికిత్సలన్నీ ఇక్కడే చేసేలా సదుపాయాలు కల్పించాలనేది ప్రణాళిక. థియేటర్లతోపాటు వైద్య నిపుణులు, శిక్షణ పొందిన నర్సులు అవసరం. నిమ్స్ తర్వాత అవయవ దానం మార్పిడిలో గాంధీని అదే స్థాయిలో తీసుకొచ్చేందుకు యోచిస్తున్నారు.

**పేదలకు భరోసా....**

కిడ్నీ, కాలేయ, గుండె మార్పిడులకు రూ.లక్షల ఖర్చు అవుతోంది. దీనిని పేదలు భరించలేని పరిస్థితి. కిడ్నీ, కాలేయం దానానికి కుటుంబ సభ్యులు ముందుకొస్తున్నా.. డబ్బులు లేక చేతులెత్తేస్తున్నారు. ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ కింద ప్రభుత్వమే ఖర్చు భరించి పేదలకు అవయవ మార్పిడి చేయిస్తుంది. కాలేయం, గుండె మార్పిడికి రూ.10 లక్షల నిధులు అందిస్తోంది. అన్ని రకాల సదుపాయాలతో కూడిన ప్రత్యేక అవయవ మార్పిడి కేంద్రం అందుబాటులో ఉంటే.. పేదలకు ఎంతో మేలు జరగనుంది. గాంధీ అధికారులు మాట్లాడుతూ.. పనులు కొలిక్కి వస్తున్నాయని, త్వరలో కేంద్రం అందుబాటులోకి వస్తుందని చెప్పారు.

# జాప్యం నివారణకు సాఫ్ట్‌వేర్

మల్యాల: ధాన్యం కొనుగోలు సమయంలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా నిబంధనలు పాటించాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. గతంలో నెల రోజులు దాటినా ధాన్యం తూకం వేయకుండా ఇబ్బందులు పెట్టేవారు. తరుగు పేరుతో ఇబ్బంది పెట్టడంలాంటి సంఘటనలతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేసేవారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చే ధాన్యాన్ని వ్యవసాయ విస్తరణ అధికారి పరిశీలించి నిర్ణీత తేమ శాతం ఉంటే వెంటనే టోకెన్ అందజేసి ధాన్యం కుప్పను ఫొటో తీసుకొని గన్నీ సంచులు ఇవ్వాలి. ప్రస్తుతం రైతు వివరాలను కొత్తగా రూపొందించిన సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. గతంలో ఈ నిబంధన ఉన్నప్పటికీ ధాన్యం తూకం వేసి రవాణా చేసిన తర్వాతే వివరాలను నమోదు చేసేవారు.

రవాణా సమయంలోనూ ధాన్యం లారీ ఫొటో, వివరాలను సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఏ కొనుగోలు కేంద్రం నుంచి ఏ రైసుమిల్లుకు లారీ వెళుతుందో వివరాలతోపాటు, లారీ ఫొటో, సమయాన్ని ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీని వల్ల లారీ రైసుమిల్లు వద్ద ఎన్ని గంటలు నిలిచి ఉంది, ధాన్యం అన్‌లోడ్‌కు ఎంత సమయం పట్టింది, జాప్యానికిగల కారణాలను జిల్లా పౌరసరఫరాలశాఖ ఉన్నతాధికారులు తెలుసుకునే వీలుంటుంది. జాప్యాన్ని నివారించేందుకు చర్యలు చేపట్టే అవకాశం ఉంటుందని మండల ఐకేపీ ఏపీఎం రాజయ్య తెలిపారు. మల్యాల మండలంలోని పలు గ్రామాల్లో వరద కాలువ వెంట ఖాళీ స్థలాల్లో రైతులు ధాన్యం పోసుకొని దాదాపు 15 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాల ప్రారంభం ఊసేలేదు. వడ్లు బాగా ఎండితే



నూకలుగా మారే అవకాశం ఉంటుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే ఓ సారి అకాల వర్షంతో కొందరు రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టుకున్న ధాన్యం తడిసిపోయింది. మరికొన్ని గ్రామాల్లో ధాన్యం ఆరబెట్టుకునేందుకు స్థలం కూడా లభించడంలేదని రైతులు పేర్కొంటున్నారు. కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభిస్తే ఖాళీ అయిన ప్రదేశాల్లో కొత్తగా వచ్చే రైతులు ధాన్యం నిలువ చేసుకునే అవకాశం ఉంటుంది. మల్యాల మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో 4, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ఆధ్వర్యంలో 14 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

# నీటికి.. రూ.కోటి..!

భానుపురి : వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రతి పల్లెలోనూ ఇబ్బందులు రానివ్వకుండా అధికారులకు ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు జిల్లా ఉన్నతాధికారులు వేసవిలో నీటిపై దృష్టిసారించారు. రోజురోజుకూ భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. బోర్లు కూడా వట్టిపోయాయి. దీంతో జిల్లాకు ప్రత్యేకంగా నీటి అవసరాలకు రూ.కోటి నిధులు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నిధులతో నీటిఎద్దడి నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టడానికి మిషన్ భగీరథ అధికారులు సిద్ధమవుతున్నారు. గతేడాది వేసవిలో నీటి సమస్యలు ఎదురైన గ్రామాలతోపాటు అన్ని ప్రాంతాల్లోనూ నీటి పంపులు, పైపులు తనిఖీలు చేపట్టి సమస్య ఉంటే పరిష్కరించనున్నారు.

**తీసుకోనున్న చర్యలు..**

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం, లేదా ట్యాంకర్ల ద్వారా నీటిని అందించనున్నారు. శుద్ధినీరు సరఫరా చేసే పైపుల లీకేజీలు గుర్తించి తక్షణమే పనులు చేయించడం.



గ్రామాలు, పట్టణాల్లో పనిచేయని చేతి పంపులు, బోరు మోటార్లకు మరమ్మతు చేయించి వినియోగంలోకి తీసుకురావడం. లీకేజీ పైపులు తొలగించి కొత్తవి వేయడం, పగిలినచోట మరమ్మతులు చేయించడం. మురుగు కాల్వల్లో పైపులైన్లు లేకుండా చూడటం.

నీటి సమస్య రాకుండా ప్రణాళిక.. - అరుణాకర్‌రెడ్డి, గ్రిడ్ ఈఈ మిషన్ భగీరథ, సూర్యాపేటకలెక్టర్ ఆదేశాల మేరకు నీటి సమస్య రాకుండా ప్రణాళిక రచిస్తున్నాం. ఎక్కడ సమస్య వచ్చినా వెంటనే సిబ్బందితో వచ్చి పరిష్కారం చూపుతాం. వేసవిలో ఏ ఒక్క గ్రామంలో కూడా నీటి ఇబ్బందులు రానివ్వం. సమస్య తీవ్రంగా ఉన్న చోట ప్రత్యామ్నాయంగా బోరుబావులను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అద్దెకు తీసుకుంటాం.

# వారం.. రోజుకో కార్యక్రమం..!

మునగాల : వెనకబడిన, ప్రతికూల నేపథ్యాల నుంచి వచ్చిన బాలికలకు మెరుగైన విద్య అందించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. దీనికోసం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఈ విద్యాలయాల్లో ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థినులకు వార్షిక పరీక్షలు గురువారం ముగిశాయి. ఈ నెల 24 నుంచి విద్యాలయాలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. ఈ నేపథ్యంలో గురువారం నుంచి 23వ తేదీ వరకు విద్యార్థినులకు రోజుకో కార్యక్రమం నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు. కార్యక్రమాల అమలుకు సంబంధిత ఉపాధ్యాయులు ప్రత్యేక సమయం కేటాయిస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే రాష్ట్ర విద్యాశాఖ దిశానిర్దేశం చేసింది. మొదటిరోజు (17వ తేదీన) వారం రోజుల ప్రణాళిక, విధుల కేటాయింపు

18న విద్యార్థులకు నచ్చిన, ఇష్టమైన కథలను తెలుగు, ఆంగ్ల, హిందీ భాషల్లో రాయడం, చదవడం

19న స్పోకెన్ ఇంగ్లిష్, ప్రసంగాలు చేయడం

20న జీవనోపాధి మార్గాలు, కథా రచన కొనసాగింపు

21న కస్తూరీ విజయం: కస్తూర్బా పాఠశాల విద్యార్థుల విజయాలు

22న జీవన నైపుణ్యాలు

23న పేరెంట్, టీచర్ మీటింగ్

ఈ కార్యక్రమంలో సురక్షిత, బాధ్యతాయుతమైన ప్రవర్తన, బాల్య వివాహాలపై స్కిట్ రూపంలో అవగాహన కల్పిస్తారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయిస్తారు. చివరిరోజు తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి విద్యార్థినుల స్థితిగతులను వివరిస్తారు.

కలల సాకారానికి ప్రత్యేక కార్యక్రమాలు- పూలమ్, జీసీడీవో

విద్యార్థినులు అడ్డంకులను అధిగమించి తమ కలలను సాకారం చేసుకునేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. రానున్న విద్యా సంవత్సరంలో ప్రవేశాలు భారీగా పెరగడానికి ఇవి దోహదపడతాయి. బాలికలకు భరోసా కల్పించేలా విశ్వాసాన్ని పెంపొందిస్తాం.

# ఎండాకాలంలో.. మూత్రపిండాలకు గండం

నల్గొండ : జిల్లాలో మూత్రపిండాల బాధితులు వయస్సుతో నిమిత్తం లేకుండా ఏటికేడు పెరుగుతూనే ఉన్నారు. ఈ వేసవి కాలంలో మూత్రపిండాల వ్యాధి బారిన పడేవారు ఎక్కువ సంఖ్యలో ఉంటున్నారు. ఫ్లోరిన్ నీరు, రక్తపోటు, మధుమేహం అదుపులో లేకపోవడం, పొగ మద్యం అధికంగా తాగడం, ఆహార నియమాలు పాటించక పోవడం, సరైన శారీరక వ్యాయామం లేక పోవడం వంటి కారణాల మూలంగా మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడటం, ఇన్‌ఫెక్షన్లు రావడం జరుగుతుంది. దీనిని నిర్లక్ష్యం చేయడంతో రక్త శుద్ధి చేయాల్సి రావడం, చివరికి ప్రాణాలు కోల్పోవడం జరుగుతుందని వైద్యులు చెపుతున్నారు.

జిల్లాలో ప్రస్తుతం అయిదు ప్రాంతాల్లో మాత్రమే రక్తశుద్ధి కేంద్రాలు ఉన్నాయి.



వాటిలో ప్రస్తుతం 35 యంత్రాలు ఉండగా 290 మందికి పైగా రక్త శుద్ధి చేయించుకుంటున్నారు. ప్రైవేటు ఆసుపత్రులతో పాటు హైదరాబాద్‌లో రక్తశుద్ధి చేయించుకుంటున్న వారి సంఖ్య మరికొంత ఉంటుంది. అత్యధికంగా నల్గొండ పరిసర ప్రాంతంలో ఉన్నారు. ఇక్కడ మరో 10 రక్తశుద్ధి యంత్రాలు అవసరం ఉంటుందని బాధితులు పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ప్రయోజనం లేదు. జిల్లాలో కేతేపల్లి, నకిరేకల్, మునుగోడు ప్రాంతాల్లో కూడా కేంద్రాలు ఏర్పాటు చేస్తే బాధితులకు ఉపశమనం దక్కే అవకాశాలున్నాయి. ఏర్పాట్లు చేస్తున్నాం డా.మాతృనాయక్ జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి, నల్గొండజిల్లాలో మూత్రపిండాల వ్యాధిగ్రస్తులు పెరుగుతున్న మాట వాస్తవమే. ప్రాథమిక దశలో ఆసుపత్రులకు వచ్చిన వారికి సూచనలతో పాటు మాత్రల ద్వారా వ్యాధి తగ్గేలా చర్యలు తీసుకుంటున్నాం. గతంలో కుటుంబ సభ్యుల్లో బాధితులు ఉంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నాం.

# లోపాలపుట్ట

అనకాపల్లి : జిల్లాలో నకిలీ పేర్లతో రుణాలు స్వాహా చేసి బురిడీ కొట్టించిన ఘటనలపై ఉన్నతాధికారులు కొరడా ఝుళిపించడం లేదు. అనకాపల్లిలో నకిలీ పొదుపు సంఘాలతో బ్యాంకుల నుంచి రూ. కోట్ల సొమ్ములు పక్కదారి పట్టించారు. ఈ కుంభకోణంపై పూర్తిస్థాయి విచారణ జరపలేదు.. రికవరీలు చేయలేదు. దిగువ స్థాయిలో ముగ్గురు సిబ్బందిపై శాఖాపరమైన చర్యలతో చేతులు దులిపేసుకున్నారు. తాజాగా కశింకోట మండలంలో పాలప్రగతి కేంద్రాల పేరిట సిబ్బందే రూ. లక్షలు స్వాహా చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. దశాబ్దం క్రితమే ఈ రుణాలు పక్కదారి పట్టినా అధికారులు ఇప్పటివరకు గుర్తించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. బయట వ్యక్తి ఫిర్యాదు చేసిన తర్వాత హడావుడిగా విచారణ జరిపించారు. వెలుగులో పనిచేసి మానేసిన ఓ ఉద్యోగిని బాధ్యునిగా చూపించి మిగతా అధికారుల పర్యవేక్షణ లోపాలను కప్పిపుచ్చాలని చూస్తున్నారు. పొదుపు మహిళలు పాల ప్రగతి కేంద్రాల పేరుతో డెయిరీ యూనిట్ ఏర్పాటుకు ముందుకొస్తే బ్యాంకులు రుణాలు ఇచ్చేవి. వీటికి ప్రభుత్వం రాయితీలు ఇచ్చేది. అప్పట్లో కొంతమంది వెలుగు సిబ్బంది డ్వాక్రా సభ్యులకు తెలియకుండానే వారి పేరుతో రుణాలు తీసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చే రాయితీలను వాడుకున్నారు. కశింకోట మండలంలో ఎనిమిది సంఘాల పేర్లతో రుణాలు రాయితీలు కలిపి రూ. 45 లక్షల వరకు పక్కదారి పట్టించారు. వాటిలో నాలుగు సంఘాల రుణాలు తిరిగి చెల్లించగా మరో నాలుగు సంఘాలు బ్యాంకుకు టోకరా వేశాయి. జిల్లాలో చాలాచోట్ల ఈ తరహా అక్రమాలు జరిగినా విచారణ ఈ ఒక్క మండలానికే పరిమితం చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**బోగస్ సంఘాలతో బురిడీ.....**

సెర్ప్ ఐబీ (ఇనిస్టిట్యూషనల్ బిల్డింగ్) పోర్టల్‌లో నమోదైన మహిళలనే డ్వాక్రా సభ్యులుగా గుర్తిస్తారు. వారికి మాత్రమే బ్యాంకులు రుణాలు ఇస్తాయి. కాని కొంతమంది వెలుగు సిబ్బంది డ్వాక్రా మహిళలకు తెలియకుండానే ఇతర అవసరాల కోసమంటూ సంతకాలు తీసుకుని



వారి పేరుతోనే రుణాలు పొందుతున్నారు. ఐబీ పోర్టల్‌లో నమోదుకాని వారి పేర్లను చేర్చి బోగస్ సంఘాలను తయారు చేస్తూ వాటితో బురిడీ కొట్టిస్తున్నారు. కశింకోట మండలంలో పాల ప్రగతి కేంద్రాలకు బ్యాంకులు ఒక్కో సంఘానికి రూ. 5 లక్షలు రుణంగా ఇచ్చాయి. ప్రభుత్వం రూ. 1.25 లక్షల నుంచి రూ. 1.75 లక్షల వరకు రాయితీ ఇచ్చింది. వీటిలో సుమారు రూ. 20 లక్షల మేర బ్యాంకులకు చెల్లించకుండా ఎగవేశారు. మరో రూ. 20 లక్షలకు సంబంధించి వడ్డీ, రాయితీ లబ్ధిని పొందారు. ఇటీవల ఒకరు ఫిర్యాదు చేసిన తర్వాత విచారణ చేపట్టగా ఆయా సంఘాల్లో సభ్యులు ఈ రుణాల గురించి మాకేమీ తెలీదని ఆవేదన వ్యక్తం చేశారు.

అప్పట్లో వెలుగు సీసీ పిలిచి ఫోటోలు, సంతకాలు తీసుకున్నారు తప్ప ఈ రుణాల్లో పైసా సొమ్ము కూడా తమకు ఇవ్వలేదని అధికారుల ఎదుట చెప్పారు. వారు చెప్పిన సీసీ గతంలోనే వెలుగు ఉద్యోగం మానేసి వెళ్లిపోయారు. ఈ బోగస్ రుణాలకు అతనే బాధ్యుడిగా తేల్చారు. అయితే ఆ సమయంలో పనిచేసిన ఏపీఎం, ఏరియా సమన్వయకర్తల బాధ్యత గురించి విచారణ నివేదికలో ప్రస్తావించనేలేదు. సంస్థ నుంచి బయటకు వెళ్లిపోయిన వ్యక్తి నుంచి రికవరీ ఎలా చేయాలన్నది సూచించకపోవడం విశేషం.

## స్కేటింగ్ అభిమానులకు పండగే

విశాఖపట్నం : ఏపీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ).. 2026లో స్కేట్ బోర్డింగ్ జాతీయ పోటీలు విశాఖలో నిర్వహించాలను కుంటోంది. అలాగే 2027లో ఆసియా ఛాంపియన్‌షిప్‌నకు నగరం వేదిక కానుంది. ఇందుకోసం స్కేట్ బోర్డింగ్ పార్క్ నిర్మించే యోచన చేస్తున్నారు. విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ఆధ్వర్యంలో దీన్ని చేపట్టాలని ఏపీఆర్ఎస్ఏ కోరిన నేపథ్యంలో ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు. పోటీల నిర్వహణ సమయానికి అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళిక చేస్తున్నారు.

నగరంలో: బీచ్ రోడ్డులోని వీఎంఆర్‌డీఏ పార్క్, శివాజీ పార్క్, స్టీల్‌ప్లాంట్, మురళీనగర్, మధురవాడల్లో రోలర్ స్కేటింగ్ రింక్‌లున్నాయి. వీటిల్లో 2 వేల మందికిపైగా సాధన చేస్తున్నారు. అలాగే 50 మందికిపైగా కోచ్‌లున్నారు.

గతంలో నిర్వహించిన ఆసియా ఛాంపియన్‌షిప్, జాతీయ పోటీల్లో విశాఖ క్రీడాకారులు విజేతలుగా నిలిచి స్ఫూర్తిచాటారు. స్కేటింగ్‌లో 11 రకాల పోటీలు



ఉంటాయి. వీటన్నింటి నిర్వహణకు పూర్తిస్థాయి పార్క్ అవసరం.

ప్రస్తుతం వీఎంఆర్‌డీఏ పార్క్‌లో 200 మీటర్ల స్పీడ్ స్కేటింగ్ ట్రాక్ ఉంది. రోలర్ హాకీ అందుబాటులో ఉంది. శివాజీపార్క్‌లో ఆర్టిస్టిక్ స్కేటింగ్ రింకుంది. అయిదెకరాలు అవసరం రోలర్ హాకీ, ఆర్టిస్టిక్ స్కేటింగ్, రోలర్ ఫ్రీ స్టైల్, ఇన్ లైన్ ఫ్రీస్టైల్ రింకు, స్కేట్ బోర్డుకు నిర్ణీత కొలతల్లో పార్క్ అవసరం. వీటన్నింటికి అయిదెకరాల స్థలం కావాలి. ప్రస్తుతం వీఎంఆర్‌డీఏ పార్క్‌లో ఉన్న రింకును అలానే ఉంచి దానికి అదనంగా మరికొన్నింటిని నిర్మించాలనుకుంటున్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు తాత్కాలిక పార్కులే తప్ప పూర్తిస్థాయి నిర్మాణాలు ప్రత్యేకంగా ఎక్కడా లేవు. ఇది అందుబాటులోకి వస్తే రాష్ట్రంలోనే మొదటి పార్క్‌గా నిలుస్తుంది. ఆకృతులు, నిర్మాణ వ్యయం, ఇతర పనులపై కసరత్తు సాగుతోంది. సుమారు రూ. 1.50 కోట్ల వరకు అవుతుందని ప్రాథమికంగా భావిస్తున్నారు.

# అరకొర వైద్యం.. నిర్వహణ అధ్వానం



అనంతపురం : అల్లోపతికి బదులుగా ఆయుర్వేద, హోమియో, యునాని వైద్యసేవలు పొందడానికి రోగులు మొగ్గు చూపుతున్నారు. ఇందులో భాగంగా ఆయుష్ పేరిట ప్రభుత్వం వైద్యశాలలు ఏర్పాటు చేసింది. ఇంతవరకు బాగానే క్షేత్రస్థాయిలో రోగులకు సేవలు అందడం లేదు. వాటి నిర్వహణ అంతంతమాత్రంగానే ఉంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఆయుర్వేద, హోమియో, యునాని ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది లేకపోవటంతో కొన్నింటిని మూసివేయడం గమనార్హం. వైకాపా పాలనలో పోస్టులను భర్తీ చేయకపోవటంతో ఆయుష్ సేవలు అందని ద్రాక్షలా మారాయి.

**సిబ్బంది లేకపోవడంతో..**

హవగళి, పామిడి, తరిమెల, కిరెకెర, చారుపల్లి, చిలమత్తూరు, గోరంట్ల, కరుకుంట, నూతిమడుగు, రాయదుర్గం, పుట్టపర్తి, తవలం, డి.హీరేహాళ్, ధర్మవరం, గాండ్లపెంట ఆసుపత్రుల్లో వైద్యులు మాత్రమే పని చేస్తున్నారు. కాంపౌండర్, స్వీపర్ లేకపోవటంతో వైద్యశాల నిర్వహణను వైద్యులే చూసుకుంటున్నారు.

**ఇక్కడ స్వీపర్లే దిక్కు..**

పుట్లూరు, కంబదూరు, బెళుగుప్పలో వైద్యులు, కాంపౌండర్లు లేకపోవటంతో స్వీపర్లే ఆసుపత్రులు తెరుస్తుండటం గమనార్హం.

**రెండేళ్లుగా మూత ఉరకొండ**

ఉరవకొండలో ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఆయుర్వేద వైద్యశాల ఉంది. ఇది మూతపడి రెండేళ్లు అయింది. గతంలో సీనియర్ ఆయుర్వేద వైద్యాధికారి రోడ్డు ప్రమాదంలో రెండేళ్ల క్రితం మృతి చెందారు. అప్పటి నుంచి సేవలు బంద్ అయ్యాయి. గతంలో రోజుకు 50 నుంచి 80 మంది సేవలు పొందేవారు. వజ్రకరూరు మండలం గడే హోతూరు పీహెచ్‌సీలో ఉన్న ఆయుర్వేద ఆసుపత్రిలో ఏడాదిన్నరగా వైద్యుడు లేరు.

**ఖాళీలు భర్తీ చేయక..**

: కొన్నేళ్ల కిందట జూటూరులో యునాని వైద్యశాలను ఏర్పాటు చేశారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో పెద్దపప్పూరు పీహెచ్‌సీ ఆవరణలో నూతనంగా నిర్మించిన వైద్యశాలలోకి మార్చారు. సిబ్బంది ఉద్యోగ విరమణ చేయగా... కొత్తవారిని నియమించకపోవడంతో మూడేళ్లుగా మూతపడింది.

**ఖాళీ పోస్టులు భర్తీ చేస్తాం- డాక్టర్ శేఖర్‌రాజు, ఆయుష్, ఆర్‌డీడీ, కడప**

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయుర్వేద, హోమియో, యునాని వైద్యశాలల్లో ఖాళీ పోస్టుల వివరాలను కమిషనర్‌కు పంపాం. త్వరలోనే భర్తీకి చర్యలు తీసుకుంటాం. యూనాని వైద్యశాలలో మినహా ఎక్కడా మందుల కొరత లేదు. పోస్టుల భర్తీ తరువాత మూసివేసిన వాటిని తెరిచేందుకు చర్యలు తీసుకుంటాం.

పంపుహౌస్‌లో ఆసుపత్రి

తాడిపత్రిలో వైద్యవిధాన పరిషత్తు ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న తాగునీటి పంప్‌హౌస్ గది హోమియో వైద్యశాల నిర్వహిస్తుండటం గమనార్హం.

ఇక్కడ గత మూడేళ్లుగా కాంపౌండర్ మాత్రమే ఉన్నారు. నిత్యం 15 మంది వరకు వస్తుంటారు.

నాలుగు నెలల నుంచి మందుల కొరత ఉంది.

# రోజంతా నీరు.. ఎప్పటికి చేరు!



విశాఖపట్నం : మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) పరిధిలో 24 గంటల నీటి సరఫరా ప్రాజెక్టుకు గతంలో శ్రీకారం చుట్టారు. ఏడీబీ (ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్) నిధులతో చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా దీన్ని చేపట్టారు. రెండేళ్ల క్రితమే పూర్తికావాల్సి ఉన్నా ఆలస్యమైంది.

రైవాడ నుంచి ప్రధాన పైపులైను 50 కిలోమీటర్లు వేయాలి. కోర్టు వివాదంతో ఒక కిలోమీటరులో పని నిలిచిపోయింది. తాజాగా వివాదం కొలిక్కిరావడంతో పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టిసారించాల్సి ఉంది.

**15,000 పూర్తి:** నగరంలో ఉత్తరం, పశ్చిమ నియోజకవర్గాల పరిధిలో దాదాపు మూడు లక్షల మందికి ప్రయోజనం కలిగేలా 65 వేల కనెక్షన్లు ఇవ్వడానికి ప్రాజెక్టులో ప్రతిపాదించారు. ఇప్పటి వరకు 15 వేల కనెక్షన్లు ఇచ్చి 24 గంటలు నీరు అందిస్తున్నారు. మరో 25 వేల కనెక్షన్లకు ప్రస్తుతం 4 నుంచి 5 గంటల పాటు నీరు అందేలా పనులు పూర్తి చేశారు. మొత్తం 320 కిలోమీటర్ల అంతర్గత పైపులైన్ల నిర్మాణానికి ఇప్పటి వరకు 296.56 కిలోమీటర్లు పూర్తి చేశారు.

**తుది దశకు రిజర్వాయర్ల నిర్మాణం:** రైవాడ నుంచి 15 ఎంజీడీ (మిలియన్ గ్యాలన్ ఫర్ డే) నీటిని సేకరించి, అందులో 4 ఎంజీడీల నీరు పరిశ్రమలకు ఇస్తారు. మిగిలిన 11 ఎంజీడీల నీరు నిల్వకు అనువుగా ఆరు ప్రాంతాల్లో భారీ ట్యాంకుల నిర్మాణానికి ప్రణాళికలు చేశారు. మాధవధార, అబిద్‌నగర్, రామ్మూర్తిపంతులుపేట, నరసింహ నగర్, పద్మనాభపురం, మురళీనగర్‌లలో వీటిని ప్రతిపాదించారు. వీటిలోపద్మనాభపురం, రామ్మూర్తిపంతులుపేట వద్ద నిర్మాణాలు తుది దశలో ఉన్నాయి.

గోపాలపట్నం నుంచి కంచరపాలెం, ఎన్ఎస్‌టీఎల్ మురళీనగర్, మాధవధార నుంచి హెచ్‌బీ కాలనీ, కేఆర్ఎంకాలనీ వరకు ఉన్న గృహాలకు ఈ ఏడాది డిసెంబరు నుంచి 24 గంటలు నీటిని అందించేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు ప్రాజెక్టు పర్యవేక్షక ఇంజనీరు కేవీఎన్ రవి పేర్కొన్నారు. కేఎల్ (కిలో లీటరు)కు రూ.7లు వసూలు చేయనున్నారు. ఒక్కో ఇంటికి నెలకు రూ.120-150 వరకు ఛార్జీలు వసూలు చేసే అవకాశం ఉంది.

**రూ.30కోట్ల చెల్లింపునకు పచ్చజెండా..**

ఈ ప్రాజెక్టును రూ.447 కోట్లతో చేపట్టారు. నిధుల్లో 78.50 శాతం ఏడీబీ నుంచి, మిగిలినది రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది. ప్రాజెక్టు పూర్తయితే పది సంవత్సరాల నిర్వహణ బాధ్యత గుత్తేదారుదే. గుత్తేదారుకు ఇప్పటికి రూ.250 కోట్లు చెల్లించినట్లు సమాచారం. తాజాగా మరో రూ.30 కోట్లు ఇవ్వడానికి అనుమతులు లభించాయి. పాత పైపుల స్థానంలో కొత్తవి వేయడం వల్ల 2.80 మిలియన్ లీటర్ల నీరు ఆదా అవుతుందని అంచనా. వినియోగించే నీటికి కచ్చితమైన లెక్క ఉండేలా ప్రత్యేక సాంకేతిక విధానాన్ని ఈ ప్రాజెక్టులో అమలు చేస్తున్నారు. ఇళ్లకు ఇచ్చే ప్రతి కనెక్షన్‌కు మీటరు అమర్చుతారు. నీటి సరఫరాతో పాటు..పొదుపుపైనా దృష్టి సారిస్తారు.

# అడంగల్ అందితేనే నవీకరణ!



అనంతపురం : జిల్లాలో ఖరీఫ్ పంట రుణాల నవీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. కొత్తపంట రుణాలకు, బంగారంపై రుణం తీసుకోవాలన్నా.. పాత రుణాలు నవీకరణ చేసుకోవాలన్నా వన్‌బీ, అడంగల్ పత్రాలు తప్పనిసరి. మీసేవా కేంద్రాల్లో రుసుం చెల్లిస్తే తహసీల్దారు డిజిటల్ సంతకంతో కూడిన పత్రాలు పొందవచ్చు. కేంద్రం నిర్వాహకుల వద్దకు వెళ్తే వన్‌బీ వస్తోంది. కానీ అడంగల్ రావడం లేదు. దీంతో నవీకరణకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

**రూ.10,200 కోట్ల పంట రుణాలు**

రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశంలో జిల్లాకు వ్యవసాయ పంట రుణాల కోసం రూ.10,200 కోట్లు ప్రకటించారు. జిల్లాలో 3.50 లక్షల మంది రైతులు ఉన్నారు. ఖరీఫ్ జూన్ ఒకటో తేదీ నుంచి మొదలవుతుంది. విత్తనాలు, ఎరువులు, భూములు దుక్కులు చేసుకునేందుకు బ్యాంకు రుణాలపై రైతులు ఆధారపడి ఉన్నారు. ఏప్రిల్, మే నెలల్లో రుణాలు నవీకరణ జరిగితే సేద్యంతోపాటు విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకుంటారు. గత ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి కొత్తగా పంట రుణాలు, పాత రుణాల నవీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. 38 రోజులు గడిచిపోయింది. ఇప్పటికీ 10 శాతం రుణాలు కూడా నవీకరణ జరగలేదు.

**తగిన చర్యలు తీసుకుంటాం..- వసంతబాబు, ఆర్డీవో (కళ్యాణదుర్గం డివిజన్)**

మీసేవ కేంద్రాల్లో అడంగల్ రాలేదన్నది మా దృష్టికి రాలేదు. అడంగల్ ఏపీ సేవ పోర్టల్‌లో వస్తుంది. నిర్వాహకులు యూజర్ ఐడీ పాస్‌వర్డ్ ఏపీ సేవ పోర్టల్‌కు అనుసంధానం చేసుకుంటేనే పత్రాలు ఆన్‌లైన్‌లో వస్తాయి. తప్పకుండా రైతులకు అందేలా చర్యలు తీసుకుంటాం.

**అవస్థలు పడుతున్నాం - రామన్న, రైతు ఇట్లంపల్లి, కళ్యాణదుర్గం మండలం**కళ్యాణదుర్గంలోని మీసేవ కేంద్రానికి వెళ్లా. అడంగల్ అడిగితే నిర్వాహకులు రాలేదంటున్నారు. బ్యాంకుకు వెళ్తే అది తీసుకోస్తేనే రెన్యువల్ చేస్తామంటున్నారు. దిక్కుతోచక 10 రోజులు నుంచి మీసేవ కేంద్రం చుట్టూ తిరుగుతూనే ఉన్నా.

# బైపాస్ కూడళ్లలో రక్షణేదీ..?

పుత్తూరు : తిరుపతి-చెన్నై జాతీయ రహదారి నగరి నియోజకవర్గంలోని వడమాలపేట, పుత్తూరు, నగరి మండలాల పరిధిలో బైపాస్ రోడ్డు నిర్మించారు. ప్రధానంగా కూడళ్లలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికి ప్రధాన కారణంగా రహదారి వెంబడి గ్రామాలు ఉండటంతో ప్రజలు పట్టణాల్లోకి రావాలన్నా, గ్రామాలకు వెళ్లాలన్నా కచ్చితంగా బైపాస్ రోడ్డు దాటాల్సిందే. ఇటీవల బైపాస్ రోడ్డులకు ఆనుకుని విపరీతంగా టీ దుకాణాలు, హోటళ్లు వెలిశాయి. వీటి వద్ద కనీసం సూచికలు లేవు. ఇక్కడ వాహనాలు అడ్డదిడ్డంగా రహదారులపైనే నిలుపుతున్నారు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

విద్యుత్తు దీపాలు లేవు. సూచిక బోర్డులు కనిపించవు. మితిమీరిన వేగం వెరసి 205 బైపాస్ అంటేనే ప్రమాదాలకు నిలయంగా మారుతోంది.. పలువురు మృత్యువాత పడుతున్నా, మరెందరో క్షతగాత్రులవుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు తప్ప చర్యలు తీసుకోవడంలేదు.

**రోడ్డు దాటాలంటే..**రాత్రి సమయాల్లో బైపాస్‌లో చీకటి రాజ్యమేలుతోంది. ముఖ్యంగా గ్రామాలకు వెళ్లే కూడళ్లు వద్ద ఎలాంటి విద్యుత్తు దీపాలు అందుబాటులో లేవు. దీంతో రాత్రి సమయాల్లో ఇక్కడ రోడ్డు దాటాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి విస్తరణ సమయంలో ప్రధానంగా కూడళ్లలో విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలనే నిబంధన ఉంది.



అయితే గత పుష్కరకాలంగా ఎవరూ పట్టించుకోలేదు. ఇటీవల ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్.. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులతో మాట్లాడారు. అనంతరం పాదిరేడు క్రాస్, కదిరిమంగళం, పున్నమి బైపాస్ రోడ్డు వద్ద విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశారు. మిగిలినచోట్ల ఎక్కడా ఏర్పాటు చేయలేదు. దీంతో అక్కడ సైతం తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం సోలార్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో గ్రామాల వద్ద రోడ్డు క్రాస్ చేసి చోట్ల విధిగా సోలార్ లైట్లు ఏర్పాటు చేస్తే అటు ప్రజలకు సౌలభ్యంతో పాటు ప్రమాదాలు నియంత్రించవచ్చని ప్రజలు పేర్కొంటున్నారు.

**వడమాలపేట వద్ద..** తిరుపతి-చెన్నై జాతీయ రహదారి నుంచి మండల కేంద్రమైన వడమాలపేటకు వెళ్లేందుకు తిరుపతి నుంచి పుత్తూరుకు వచ్చే సమయంలో కొద్దిదూరం వచ్చి మలుపు తిరిగి వెళ్లాలి. అక్కడ విద్యుత్తు దీపాలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గోవిందపాళెం, తడుకు వద్ద, గొల్లపల్లి తదితర ప్రాంతాల్లో లైట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇవి ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో ప్రమాదాలు తగ్గాయి. బైపాస్ రోడ్డు వెంబడి విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయని ప్రాంతాల్లో ఏర్పాటు చేసి ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

# విత్తనశుద్ధికి శ్రీకారం..

శ్రీకాళహస్తి : రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ (ఏపీసీడ్స్) వాటాదారులైన రైతుల నుంచి సేకరించిన విత్తనాలు శుద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టింది. నాణ్యమైన వరి వంగడాలను అందుబాటులో ఉంచాలన్న సంకల్పంతో పనులు ప్రారంభించింది. విత్తన సేకరణ తగ్గడం, దీనికితోడు శుద్ధి చేసి విక్రయించే ఉత్పత్తులు తగ్గడం యాజమాన్యాన్ని, ఏపీసీడ్స్‌ను నమ్ముకున్న రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.రబీ సీజన్‌లో 20 వేల క్వింటాళ్ల మేరకు విత్తనాలు సేకరించాలని ఏపీసీడ్స్ లక్ష్యం పెట్టుకుంది. నెలరోజులుగా విత్తన సేకరణ చేపడుతున్నా ఇప్పటి వరకు 8 వేల క్వింటాళ్ల మేరకు మాత్రమే సేకరించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యంలో ఈ దఫా ఎక్కువ మోతాదులో కేళీలు (ఇతర ధాన్యం రకాలు) ఉండటంతో చాలా వరకు తిరస్కరణకు గురయ్యాయి. దీంతో 50 శాతం మేర లక్ష్యం పూర్తవుతుందన్నది ప్రశ్నార్థకమే.

ధరల ప్రభావం.. ఆశలు గల్లంతు

మార్కెట్ పరంగా ధరలు ఆశించిన మేర లేకపోవడం, ఏపీసీడ్స్ యాజమాన్యం ధాన్యం తిరస్కరిస్తుండటంతో పలువురు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రైవేటు మార్కెట్‌లో అమ్ముకోలేకపోవడం, అమ్ముకున్నా ఆశించిన రీతిలో ఆదాయం ఉండటం లేదని వారు వాపోతున్నారు. ఎలాగైనా తమ ధాన్యం ఆమోదించాలని పలువురు ఏపీసీడ్స్ చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.

**మరిన్ని వంగడాలు తేవాలి**

ఏటా ఏపీసీడ్స్ ద్వారా శుద్ధి చేసిన విత్తనాలకు అంతర్ రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంటోంది. అదే దిశగా ప్రస్తుతం తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్ర రైతుల కోసం ఏపీసీడ్స్ ప్రస్తుతం ఉమ, జ్యోతి రకాలను శుద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాసెసింగ్ ప్రక్రియలో అధికారులు నిమగ్నమయ్యారు. ఆశించిన మేరకు ధాన్యం సేకరించకపోవడంతో విక్రయాలు అంతంతమాత్రంగా ఉంటాయని భావిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వరికి ప్రత్యామ్నాయంగా రైతులకు మరిన్ని వంగడాలను అందుబాటులోకి తెచ్చి ఏపీసీడ్స్ పురోభివృద్ధికి పాలకులు, అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

# కొండమట్టి.. కొల్లగొట్టి

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన కైలాసగిరుల్లో మళ్లీ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. వైకాపా హయాంలో రాత్రీపగలూ తేడా లేకుండా కొండమట్టిని కొల్లగొట్టారు. దాదాపుగా ఎకరాల విస్తీర్ణంలో నెలల తరబడి ఈ అక్రమ తరలింపు సాగుతూ వచ్చింది. దీనిపై అప్పట్లో విమర్శలు గుప్పుమన్నాయి. ప్రస్తుతం రాత్రివేళల్లో గిరిప్రదక్షిణ మార్గంలో మళ్లీ మట్టి తవ్వకాలు ప్రారంభమయ్యాయి.అర్ధరాత్రిన.. గుట్టుగాగిరి ప్రదక్షిణ మార్గంలో రాత్రివేళలో ఈ అక్రమ తరలింపు ఎక్కువగా సాగుతోంది. జేసీబీతో పాటు పదుల సంఖ్యలో ట్రాక్టర్లను తీసుకెళ్లడం, ఉదయం వరకు ఎంత వీలైతే అంతగా కొండలను తవ్వేసి మట్టిని ఊడ్చేస్తున్నారు. ప్రస్తుతం గిరి ప్రదక్షిణ మార్గం అనువుగా ఉండటంతో వీలైనంత మేర మట్టిని తవ్వి అక్రమంగా తరలించేస్తున్నారు. రాళ్లను పక్కకు జరిపి మట్టిని తవ్వేయడం ద్వారా వర్షాకాలంలో తవ్వేసిన మట్టి కరిగిపోయి భారీ రాళ్లు మళ్లీ రోడ్ల మీదకు వచ్చే అవకాశముంది. అంతేకాకుండా భారీ వేగంతో మట్టి తరలింపు వాహనాల రాకపోకలతో రూ.కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సిమెంటు రోడ్డు గుల్లగా మారిపోతోంది.

## వేసేయ్.. దొంగ మస్టర్లు

సూళ్లూరుపేట : దొరవారిసత్రం మండలంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, అపాచీ కార్మికులు పనులు చేసినట్లు మస్టర్లలో నమోదు చేసి నిధులు పక్కదారి పట్టించారు. సూళ్లూరుపేట మండలంలో గ్రామంలో లేనివారు హైదరాబాద్, చెన్నైలో ఉద్యోగాలు చేసేవారి పేరుతో మస్టర్లలో నమోదు చేసి పంచుకుతిన్నారు. డివిజన్‌లో కొందరు ఎంపీడీవోలు క్షేత్ర సహాయకుల నుంచి నెలవారీ మామూళ్ల రూపంలో తీసుకుంటున్నారనే ఫిర్యాదులు ఉన్నతాధికారులకు అందడం గమనార్హం. నారాయణవనంలో ఓ క్షేత్ర సహాయకుడు గత ప్రభుత్వంలో రోజువారీ దొంగ మస్టరు వేసి రూ.20 వేలు కాజేశారు. నెలకు రూ.6 లక్షలు సంపాదించి అధికారులకు, ప్రజాప్రతినిధులకు కప్పం కట్టాడు. ఇటీవల అక్రమాలు వెలుగు చూడటంతో సస్పెండ్ చేశారు. పుత్తూరు మండలంలో 2023–24లో రూ.8.67 కోట్లకు సంబంధించి ఉపాధి హామీ, పంచాయతీరాజ్ శాఖలో పనులు చేపట్టారు. ఫిబ్రవరి 11న సామాజిక తనిఖీ నిర్వహించారు. కేవలం రూ.1,705 మాత్రమే రికవరీకి ఆదేశించడం గమనార్హం.

పలమనేరు మండలంలో ఇటీవల జరిగిన సామాజిక తనిఖీలో గత ప్రభుత్వ హయాంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన నలుగురు క్షేత్ర సహాయకులపై వేటు చేశారు. రూ.70 వేలు కాజేసినట్లు గుర్తించారు. జాతీయ ఉపాధిహామీ పథకం నిధులు కొందరికి సిరులు కురిపిస్తున్నాయి. పనులకు రాకపోయినా వచ్చినట్లు హాజరు వేసి స్వాహా చేస్తున్నారు. ఈ వ్యవహారం మొత్తం క్షేత్ర సహాయకులు, ఏపీవోలు, సాంకేతిక నిపుణుల కనుసన్నల్లో జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఫిర్యాదు చేస్తే తూతూమంత్రంగా విచారణ జరిపి సరిపెడుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇప్పటికీ గత ప్రభుత్వ హయాంలో ఉన్న క్షేత్ర సహాయకులు కొనసాగుతున్నారు. వీరిని కొనసాగించేందుకు రూ.లక్షలు వసూలు చేసిన నాయకులు ఉన్నారు. దీంతో క్షేత్ర సహాయకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కొన్నిచోట్ల యంత్రాలతో పనిచేసి నిధులు మెక్కేస్తున్నారు. ఎవరికివారు ఉపాధి నిధులను పక్కదారి పట్టిస్తున్నట్లు ఉపాధి శ్రామికులు ఆరోపిస్తున్నారు. యర్రావారిపాలెం మండలంలో ఓ క్షేత్ర సహాయకుడు పదేళ్లు పైగా



పనిచేసి పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు. చేసిన పనులకే మళ్లీ బిల్లులు చేసుకోవడం, దొంగ మస్టర్లు వేయడం వంటివాటితో రూ.కోట్లలో సంపాదించినట్లు ఆరోపణలున్నాయి. డీకేటీ భూముల్లో పాగా వేయడంతోపాటు తిరుపతి పరిధిలో పెద్దఎత్తున ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలున్నాయి. ఈ మండలంలో అవినీతి తారస్థాయికి చేరడంతో క్షేత్ర సహాయకులు మొదలు ఏపీవో వరకు అందరినీ తొలగించారు.

**సామాజిక తనిఖీలు తెలియకుండా..**

ఏటా ఉపాధి పనులకు సంబంధించి సామాజిక తనిఖీల బృందం ప్రతి మండలంలోని పంచాయతీల వారీగా చేపట్టిన పనులు, చెల్లించిన కూలీల నగదు దస్త్రాలు పరిశీలించడంతో పాటు అక్కడ జరిగిన పనులు పర్యవేక్షిస్తుంటారు. వీటికి సంబంధించి ప్రజలకు ముందస్తుగా తెలియజేయాలి. అయితే ఎవరికీ చెప్పకుండా ముగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులు తరచూ తనిఖీ చేయడం, మస్టర్లు, వచ్చిన కూలీలు లెక్కల తీస్తే అక్రమాలు అరికట్టే అవకాశం ఉంది. ఆ దిశగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

## అక్కడ రాలి.. ఇక్కడ పండుతోంది

పుత్తూరు : ఆరుగాలం కష్టంచి పండించిన మామిడి పంటకు గిట్టుబాటు ధర దక్కడం లేదు.. సీజన్‌లో వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతుల శ్రమ దోచేస్తుండగా ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికారులు ఏటా కళ్లప్పగించి చూడటం తప్ప పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1.05 లక్షల హెక్టార్లలో మామిడి సాగవుతోంది. అందులో తోతాపురి 55 వేల హెక్టార్లలో సాగవుతుండగా.. బేనీషా, చందూర, ఖాదర్, నీలం, రుమాని రకాలు సాగవుతున్నాయి. ప్రస్తుతం తిరుచానూరు, పుత్తూరు మార్కెట్ యార్డులో సీజన్ ప్రారంభమైంది. నిత్యం 20 లారీల మామిడి కాయలను రాజస్థాన్, ఢిల్లీ, జైపూర్, మహారాష్ట్ర, గుజరాత్ తదితర ప్రాంతాలకు పంపుతున్నారు. సిందూర్ ఉద్రిక్తత నేపథ్యంలో ఉత్తర భారత వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. తోతాపురి రకం జిల్లాలోని పల్ప్ ఫ్యాక్టరీలకు తరలిస్తారు. ధరలు ఆశించినట్లు లేకపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. పుత్తూరు మార్కెట్ యార్డులో మూడ్రోజుల



క్రితం తోతాపురి టన్ను రూ.10 వేల నుంచి రూ.14 వేలు పలికింది. బేనీషా రూ.30 వేల నుంచి రూ.35 వేలు ఉంది. చందూర టన్ను రూ.9వేలు, ఖాదర్ టన్ను రూ.26 వేలు ఉంది. ఇటీవల గాలి, వానకు రాలిన కాయలు టన్ను రూ.4వేల నుంచి రూ.6 వేలకు కొనుగోలు చేస్తున్నారు. తమిళనాడులోని కృష్ణగిరి, కర్ణాటక రాష్ట్రంలోని శ్రీనివాసపురం నుంచి రాలిన కాయలు జిల్లాకు తెచ్చి విక్రయిస్తున్నారు. అక్కడా పూర్తి స్థాయిలో మరో వారం, పది రోజుల్లో సీజన్ ప్రారంభమవుతుంది. ఆ కాయలు వస్తే మన జిల్లాలోని రైతులు పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉంది. సీజన్ ప్రారంభం కాగానే గుజ్జు పరిశ్రమ వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గిస్తున్నారు. ఈ నేపథ్యంలో తోతాపురి రకం ఎక్కడ తక్కువకు వస్తే అక్కడ కొనుగోలు చేస్తారు. దీంతో జిల్లా రైతులకు ఏటా నష్టం తప్పడం లేదు.

**కలెక్టర్లు చొరవ అవసరం** ఉమ్మడి జిల్లాలోని మామిడి రైతుల ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని ఇరువురు కలెక్టర్లు సమావేశాలు నిర్వహించి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి. రైతులకు అన్యాయం జరగకుండా వ్యాపారులకు, పల్ప్ ఫ్యాక్టరీ యజమానులకు ఆదేశాలు ఇవ్వాలి. ఇతర రాష్ట్రాల నుంచి కాయలు రాకుండా చూడాలి.

# నిగనిగ.. నిజంగా దగా!



ఎలమంచిలి : వేసవి అంటే ఆహార ప్రియులకు ముందుగా గుర్తుకు వచ్చేవి నోరూరించే మామిడి పండ్లు. ఎక్కడ చూసిన ఇవి ఇప్పుడు కంటికి ఇంపుగా కనిపిస్తున్నాయి. ఏడాదికి ఒకసారి వచ్చే మధుర ఫలమని ధర ఎక్కువైనా కొనేందుకు తొందర పడుతుంటారు. తీరా ఇంటికి తెచ్చి రుచి చూస్తే చప్పగా, పుల్లగా ఉండడంతో కంగు తింటున్నారు. సహజంగా కాకుండా రసాయనాలతో మగ్గించడమే దీనికి కారణం. నిగనిగలాడే రంగు చూసి మోసపోవద్దని వైద్యులు సూచిస్తున్నారు. జిల్లాలో ఏటా మామిడి పండ్ల వ్యాపారం రూ. 2 కోట్ల నుంచి నుంచి రూ. 3 కోట్ల వరకూ ఉంటుంది. ఈ ఏడాది స్థానికంగా పంట బాగా దెబ్బతినడంతో రాజమహేంద్రవరం, నూజివీడు, రావులపాలెం నుంచి పండ్లు దిగుమతి అవుతున్నాయి. పూర్వం పండ్లను పక్వానికి వచ్చాక కోసి సహజసిద్ధంగా ఎండుగడ్డిలో వేసి ముగ్గబెట్టేవారు. ఇవి చూడటానికి అందంగా లేకపోయినా రుచికరంగా ఉండేవి, ఆరోగ్యానికి మేలు చేసేవి. మారుతున్న కాలంలో కాయలు పక్వానికి రాకుండానే కోస్తున్నారు. గాలులకు రాలిపోయిన కాయలనూ రసాయనాలు వేసి మగ్గిస్తున్నారు. ప్రమాదకర రసాయనాలను గుర్తించి 2011లో ప్రభుత్వం నిషేధించింది. అయినా వ్యాపారులు వీటినే ఉపయోగిస్తున్నారు. ఇవి ఆకర్షణీయంగా ఉండటం వల్ల కొనుగోలుదారులు వీటినే ఎక్కువగా కొనుగోలు చేసి ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారు. స్థానికంగా రైతులు సహజ పద్ధతిలో పండించి మార్కెట్‌కి తెచ్చినా వీటిని కొనుగోలు చేయడానికి ప్రజలు ముందుకు రావడం లేదు.

అనకాపల్లి, ఎలమంచిలి, నర్సీపట్నం, పరవాడ, చోడవరం, పాయకరావుపేట ప్రాంతాల్లో మామిడి పండ్ల హోల్‌సేల్ మార్కెట్లు ఉన్నాయి. ఇక్కడికి రోజూ లారీల్లో మామిడి పండ్లు నుంచి వస్తుంటాయి. వీటిపై అధికారులు నిఘా వేసి నమూనాలు సేకరిస్తే రసాయనాలతో మగ్గబెట్టడానికి అడ్డుకట్ట వేయడం సాధ్యపడుతుంది.

**గుర్తించడం ఇలా...** ప్రమాదకర రసాయనాలు వాడి మగ్గించిన పండ్లపై నల్లమచ్చలు ఏర్పడతాయి. రంగు మాత్రం బాగుంటుంది. ఇవి తింటే రసాయనాల ప్రభావం వల్ల విరోచనాలు, వాంతులు అవుతాయి. తలతిరిగినట్టు ఉంటుంది. ఇటువంటి కాయలు విక్రయిస్తే కేసులు పెడతాం. వీటి నమూనాలు సేకరించి పరీక్షలకు పంపుతాం. నేరం రుజువైతే ఏడేళ్ల జైలుశిక్ష పడుతుంది.

శ్రీజ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్

ఉప్పునీటితో కడిగి వాడాలి.. మార్కెట్‌లో కొన్న మామిడి పండ్లను ఉప్పునీటిలో నానబెట్టి కడగాలి. ఇలా చేసిన తరవాత తినడం మంచిది. స్థానికంగా పండిన పండ్లనే రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసుకోవడం మంచిది. రసాయనాలు వాడినవి తినడం వల్ల ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయి. పిల్లలకు చాలా హానికరం. దీనిని తల్లిదండ్రులు గుర్తించాలి.

నిహారిక, వైద్యులు, ప్రభుత్వ ఆసుపత్రి, ఎలమంచిలి

22 నమూనాలు తీశాం.. జిల్లాలో గత నెలలో 22 వరకు మామిడి పండ్లు నమూనాలు తీసి ల్యాబ్‌కు పంపాం. వీటి నివేదిక రావాల్సి ఉంది. జిల్లా సంయుక్త కలెక్టర్ జాహ్నవి ఇటీవల సమావేశంలోనూ ఈ విషయమై గట్టిగా ఆదేశాలు జారీ చేశారు. ఎలమంచిలి, పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం తదితర ప్రాంతాల్లో నమూనాలు సేకరించాం. నర్సీపట్నం తదితర చోట్ల సేకరిస్తాం. పండ్లపై అనుమానాలు ఉన్నవారు 95732 95662 ఫోను నంబరుకు తెలియజేయవచ్చు. కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

బి.రవికుమార్, ఆహార భద్రత తనిఖీ అధికారి

# 'కట్టు'కథలతో.. కాలయాపన!!



విశాఖపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు మెరుగుపరిచేందుకు మన బడి–మన భవిష్యత్తు (నాడు–నేడు) పేరిట చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో 'నాడు–నేడు' పనుల పేరిట హడావుడి చేశారు. 2021లో ప్రారంభించిన రెండో విడత పనులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలోనే సిమెంటు, ఇసుక, మెటీరియల్, ఇతర సామగ్రికి సంబంధించిన నిధులు విడుదల కాకపోవడంతో గుత్తేదారులు పనులు నిలిపివేశారు. మరో నెల రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈలోగా పనులు పూర్తి చేసి, విద్యార్థులకు ఇబ్బందులేకుండా చూడాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

20 గదులకు నాలుగే పూర్తి: చంద్రంపాలెం పాఠశాలలో 20 అదనపు తరగతి గదులు మంజూరు చేశారు. అందులో నాలుగు పూర్తికాగా.. మరో ఎనిమిది అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఏటా అక్కడ ఆరో తరగతిలో దాదాపు 1200 మంది ప్రవేశాలు పొందుతారు. తరగతి గదులు సరిపోక వారంతా ఇరుకు గదుల్లో ఇబ్బందులు పడుతున్నారు. తోటగరువు ఉన్నత పాఠశాల, చినగదిలి సంతపాలెంలోని ప్రాథమిక పాఠశాలల్లోనూ అదే పరిస్థితి నెలకొంది.

**స్పష్టత కరవై..:** మొదట్లో ఆయా పనులకు ప్రభుత్వమే సిమెంటు, ఇసుక, పెయింట్..తదితర సామగ్రి సరఫరా చేసేది. 2023 ఫిబ్రవరి నుంచి సిమెంటు, ఇసుక సరఫరా నిలిచిపోయింది. బయట కొనుగోలు చేసి పనులు చేయమని లేదా త్వరలో సరఫరా చేస్తామని.. ఇలా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రావట్లేదు.

విశాఖలో 300కు పైగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పనులు మంజూరు కాగా.. గతేడాది ఫిబ్రవరి (గడువు)లోగా పూర్తయినవి 20 లోపే. ఆ తర్వాత ఎలాంటి పురోగతి లేదు. బకాయిలు విడుదల చేస్తేనే పెయింటింగ్ పనులు చేస్తామని గుత్తేదారులు తేల్చి చెప్పేస్తున్నారు. అధికారిక వెబ్‌సైట్‌లోని సమాచారం ప్రకారం రెండో విడతలో భాగంగా 315 పాఠశాలల్లో 2,191 పనులు మంజూరయ్యాయి. దాదాపు రూ.122.84 కోట్లతో పనులు చేపట్టారు. ఇప్పటికీ 1,555 పనులు కొనసాగుతున్నాయి.

**త్వరలో పూర్తి చేస్తాం**

కొన్ని పాఠశాలల్లో పనులు పెండింగ్‌లో ఉన్నాయి. గతంలో నిలిచిన పనులను సమగ్ర శిక్ష విభాగానికి అప్పగించారు. చిన్న చిన్న పనులను పెండింగ్ జాబితాలో చేర్చి, చేయిస్తున్నాం. వాటిని పాఠశాలలు పునఃప్రారంభించేలోగా పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నాం.

డా.జె.చంద్రశేఖర్‌రావు, ఏపీసీ, సమగ్ర శిక్ష

# అనధికార లేఅవుట్లు.. ఖజానాకు తూట్లు



పెద్దవడుగూరు : పెద్దవడుగూరుతోపాటు జాతీయ రహదారి, ఇతర ప్రాంతాల్లో కొందరు అనధికారికంగా లేఅవుట్లు వేసి పంచాయతీ ఆదాయానికి గండికొడుతున్నారు. వ్యవసాయ భూమిని ప్లాట్లుగా మార్చి ఇతరులకు దర్జాగా విక్రయిస్తున్నారు. వాస్తవానికి పంచాయతీ, రెవెన్యూశాఖలకు పదిశాతం పన్నుల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. ఇవేవీ జరగడం లేదు.

**అన్నీ వ్యవసాయ భూములే..**

పెద్దవడుగూరులోని మిడుతూరు, చిన్నవడుగూరు, లక్షుంపల్లి, తెలికి రోడ్లతోపాటు ఆశ్రమం వెనుక భాగంలో కొందరు అక్రమంగా లేఅవుట్లు వేసి వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇక్కడున్నవన్నీ వ్యవసాయ భూములే కావడం గమనార్హం.

**జాతీయ రహదారి పక్కనే..**

టోల్‌ప్లాజా, క్రిష్టిపాడులోని 67వ జాతీయ రహదారుల సమీపాన అడ్డగోలుగా లేఅవుట్లు వేసి విక్రయించేస్తున్నారు. పెద్దవడుగూరులోని 1.84ఎకరాల పొలంలో ప్లాట్లు వేసి విక్రయించారు.

లక్షుంపల్లి రోడ్డులో రెండేళ్ల కిందట వ్యవసాయ పొలాన్ని కొందరు కొనుగోలు చేసి ప్లాట్లు వేసి అధిక ధరలకు అమ్మేశారు.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం**

–ఉషారాణి, తహసీల్దారు, పెద్దవడుగూరు

క్రిష్టిపాడు జాతీయ రహదారి సమీపాన ప్లాట్లు వేస్తున్నట్లు మాదృష్టికి రావడంతో నోటీసులు జారీ చేశాం. మిగిలిన ప్రాంతాల్లో వేసిన ప్లాట్ల సమాచారం లేదు. క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.

## రైతులపై అప్పుల టమోత

టమాటా రెండేళ్ల కిందట రైతులకు లాభాలు తెచ్చిపెట్టింది. అప్పట్లో సాధారణ సాగు లక్ష్యం నమోదవగా దిగుబడులు సైతం ఆశాజనకంగా రాలేదు. అయినా పంటకు అధిక డిమాండ్ ఉండటంతో కొంతమంది లక్షాధికారులుగా మారారు. ఈ ఏడాది వేసవి సీజన్‌లో వాతావరణం అనుకూలించింది. సాగు విస్తీర్ణం రెట్టింపైంది. దిగుబడులు సైతం గణనీయంగా పెరిగాయి. దీంతో ధరలు పతనమై.. రైతులపై అప్పుల మోత పడింది.

**కర్ణాటకకు వెళ్లినా.. ప్చ్**

ఇక్కడ ధర లేదని కర్ణాటకలోని మార్కెట్లకు తీసుకెళ్లా. అక్కడా బాక్సు గరిష్ఠంగా రూ.70 పలికింది. రవాణా ఖర్చులు సైతం చేతి నుంచి పెట్టుకున్నా. నాలుగు ఎకరాల్లో రూ.6 లక్షలు ఖర్చుచేశా. ఈ ధరల ప్రకారం పంట మొత్తానికి రూ. 2.5 లక్షలు వస్తుంది. మిగిలింది నష్టమే. రవీంద్రారెడ్డి, కూర్మాయి

**అప్పు తెచ్చి సాగు చేశా**

ఐదెకరాల్లో సాగుచేశా. ఎకరాకు రూ.2 లక్షల చొప్పున రూ.10 లక్షలు పెట్టా. ఇందులో రూ.9 లక్షలు అప్పు తెచ్చిందే. ప్రస్తుతం తోటలో



మొత్తం కాయలే. కూలీలు, రవాణా ఛార్జీలు పెట్టుకోలేక వదిలేశా. కనీసం ఇతర కూరగాయల పంటలకు ప్రోత్సాహం అందించాలి. మునిరెడ్డి, మద్దలకుంట

**కిలో రూ.20కి ప్రభుత్వమే కొనాలి**

రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం స్పందించాలి. ఇప్పటి పరిస్థితుల ప్రకారం రూ. 20కి కొనుగోలు చేస్తేనే పెట్టుబడి వస్తుంది. ఆ మేరకు పాలకులు చొరవ చూపాలి. ఎకరాన్నరలో రూ.4.5 లక్షలు పెట్టుబడి అయింది. ఇందులో రూ.3 లక్షలు అప్పే. 1200 బాక్సుల కాయలు వదిలేశా. మల్లికార్జున, కమ్మపల్లె

**బంగారానికి వడ్డీ కట్టలేం**

మూడు ఎకరాల్లో సాగుచేశా. మల్చింగ్, 7 అడుగుల కర్రలు నాటా. మొత్తం 6 లక్షలు ఖర్చయింది. బంగారం తాకట్టు పెట్టి నగదు తెచ్చా. రోజుకు 300–400 బాక్సులు మార్కెట్‌కు తరలిస్తున్నా. నెల రోజులుగా రూ.55–70 మధ్య ఉంటోంది. ఖర్చులు పోగా రూ. 10–20 మిగులుతోంది. వడ్డీ కూడా కట్టలేని దుస్థితి. ప్రభుత్వం ఆదుకోవాలి. గోవిందప్ప, బైరెడ్డిపల్లె

**ధరల స్థిరీకరణ అవసరం**

టమాటా రైతుల పరిస్థితి దారుణం. గతంలో మామిడి రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం కొంత మొత్తం ఇచ్చింది. టమాటా రైతులను ఆదుకోవాలి. పది శాతం కమిషన్ రద్దు చేయాలి. ధరల స్థిరీకరణ చేయాలి.

టి.జనార్దన్, జిల్లా అధ్యక్షుడు ఏపీ రైతు సంఘం

నష్టం అంచనా

ఎకరాకు దిగుబడి: 2800

బాక్సులు (15 కిలోల చొప్పున)

బాక్సు ధర: రూ.50

రైతుకు వచ్చే మొత్తం: రూ. 1.40 లక్షలు

కోత, రవాణా, కమిషన్: రూ. 60 వేలు

రైతుకు మిగిలేది: రూ.80 వేలు

ఎకరాకు నష్టం: రూ.1.70 లక్షలు

మొత్తం: రూ. 116.87 కోట్లు

జిల్లా గణాంకాలు

సాధారణ సాగు : 3400 ఎకరాలు

ఈ ఏడు సాగైంది: 6875 ఎకరాలు

రైతుల సంఖ్య: 2500

ఎకరాకు పెట్టుబడి: 2.5 లక్షలు (సగటు)

మొత్తం వ్యయం: రూ. 171.87 కోట్లు

## గిర్రున.. గరిష్ఠాలకు

చిత్తూరు : వారం రోజులుగా ఎండలు మండిపోతున్నాయి.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు 42–43 డిగ్రీలకు చేరుతున్నాయి.. వడగాలుల సెగలు, తీవ్రమైన ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు.. అధిక శాతం మంది ఇళ్లకే పరిమితమవుతున్నారు.. ఈ ప్రభావంతో విద్యుత్తు వినియోగం భారీగా పెరిగి మీటరు గిర్రున తిరిగి బిల్లుల మోత మోగుతోంది.

**మరింతగా పెరుగుదల..**

వేసవి రాక ముందు ఉమ్మడి జిల్లాలో సగటు వినియోగం రోజుకు 19–20 మిలియన్ యూనిట్లలోపే ఉంటుంది. ప్రస్తుతం ఏసీ, కూలర్లు, ఫ్యాన్లు, రిఫ్రిజిరేటర్లు ఎక్కువగా వాడుతున్నారు. దీంతో ఈ వారం రోజుల్లో వినియోగం బాగా పెరిగింది. వారం కిందట 22.25 ఉన్న



వినియోగం బుధవారానికి 25.01 ఎంయూకి చేరింది. గతేడాది మేలో విద్యుత్తు వినియోగం 22–23 ఎంయూ ఉండగా.. ఈ ఏడాది రెండు మిలియన్ యూనిట్లు అధికంగా ఉంది. రాత్రి ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల మధ్య గరిష్ఠంగా వినియోగిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఏసీల వాడకంతో బిల్లు మోత మోగుతోంది.

**28 యూనిట్ల వరకు అవసరం** ఈ ఏడాది గరిష్ఠ వినియోగం 28 ఎంయూ వరకు వెళ్లే అవకాశం ఉన్నట్లు విద్యుత్తు శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఎన్నడూలేనంతగా వినియోగం పెరిగినా ఆ మేరకు కొరత లేకపోయినా ఫ్యూజులు, జంపర్‌లు కాలిపోతున్నాయి. నియంత్రికలు వేడెక్కి మొరాయిస్తున్నాయి. దీంతో స్థానికంగా సమస్యలు ఎదురవుతున్నాయి. సిబ్బందిని అప్రమత్తం చేస్తూ అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్తు సరఫరాకు చర్యలు చేపట్టామని విద్యుత్తు శాఖ తిరుపతి, చిత్తూరు జిల్లాల ఎస్ఈలు సురేంద్ర నాయుడు, ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు.

చురకలు



# అప్పులిచ్చి 'తిప్పలు'

అనకాపల్లి: గత పాలకుల ఒత్తిడితో వివిధ పథకాల కింద లబ్ధిదారులకు ఇచ్చిన అప్పులను తిరిగి వసూలు చేయడానికి బ్యాంకర్లు తిప్పలు పడాల్సి వస్తోంది. జాతీయ బ్యాంకులతో పోటీపడాల్సిన సహకార బ్యాంకులు వైకాపా నిర్వాకంతో నష్టాల్లో చిక్కుకుంటున్నాయి. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పరిధిలో మొండి బకాయిలు రూ. 5.79 కోట్ల మేర పేరుకుపోయాయి. వాటి రికవరీలకు వెళ్లే సిబ్బందికి చుక్కలు చూపిస్తుండటంతో బ్యాంకు వర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 30 డీసీసీబీ శాఖల ద్వారా సుమారు రూ. 34.47 కోట్ల మేర వివిధ పథకాలకు రుణాలు అందజేశారు. వాటిని ఎప్పటికప్పుడు కంతుల రూపంలో చెల్లించాల్సి ఉన్నా నేతలతో సిఫార్సు చేసి వాయిదాలు వేసుకుంటూ వస్తున్నారు. ఈ ఏడాది మార్చి నాటికి మొత్తం రుణాలు వసూలు కావాల్సి ఉన్నా లబ్ధిదారులు మొహం చాటేయడంతో రికవరీకి వెళ్లే సిబ్బంది ఉత్తచేతులతో తిరిగి వస్తున్నారు. రుణం తీసుకుని ఏర్పాటు చేసిన యూనిట్లు సైతం క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. చాలావరకు యూనిట్లను అమ్మేసుకుని సొమ్ముచేసుకున్నారు తప్ప బ్యాంకులకు రుణాలు మాత్రం చెల్లించలేదు.

**తోడు.. వసూళ్లు గోడు..** జగనన్న తోడు పథకం పేరుతో చిరు వ్యాపారులకు డీసీసీబీ నుంచే రూ. 10 వేల చొప్పున రుణాలు ఇప్పించారు. ఏడాదిలోగా వాటిని తిరిగి బ్యాంకుకు చెల్లించాల్సి ఉన్నా మూడేళ్లయినా ఇంకా 693 మంది లబ్ధిదారుల జాడ కనిపించలేదు. ఫిష్ ఆంధ్రా అవుట్‌లెట్లకు ఇచ్చిన రుణాల పరిస్థితి ఇలానే ఉంది. ఈ రెండు పథకాలకు సంబంధించి సుమారు రూ.కోటి




మగ్గిపోయినట్లు బ్యాంకు వర్గాలు చెబుతున్నాయి.

కనిపించని కస్టమ్ హైరింగ్ సెంటర్లు ... ట్రాక్టర్లతో సహా వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను కస్టమ్ హైరింగ్ సెంటర్ల పేరుతో రూ. 30 లక్షల నుంచి రూ. 40 లక్షల విలువైన యూనిట్లను అందజేశారు. వాటిలో చాలావరకు ట్రాక్టర్లను అమ్మేసుకున్నారు. యంత్ర పరికరాలు కనిపించడం లేదు. రైతుల పేరుతో వైకాపా నేతలే వాటిని సొంతం చేసుకోవడంతో రికవరీకి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ పథకంలో రూ. 4.7 కోట్లు మొండి బకాయిలు ఉండిపోవడం గమనార్హం.

**రికవరీలు చేస్తాం..** డీసీసీబీ రుణ వాయిదాలు రికవరీ తప్పక చేస్తాం. ఎవరి దగ్గరా రుణాలను విడిచిపెట్టే ప్రసక్తి లేదు. ఇటీవల నాతవరం మండలంలో ఓ ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని నోటీసులు ఇచ్చాం. మిగతా వారి వివరాలు సేకరిస్తున్నాం.డీవీఎస్ వర్మ, డీసీసీబీ ముఖ్య కార్యనిర్వహణాధికారి

# క్లస్టర్ సచివాలయాలు

కర్నూలు : ప్రజలకు మెరుగైన సేవలందించాలన్న ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థలో మార్పులు తీసుకురావాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా గ్రామ, పట్టణాల్లో నివాస గృహాలు, కుటుంబాల మ్యాపింగ్ చేపట్టారు. రెండు సచివాలయాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేయనున్నారు. జనాభా సమాచారం సేకరించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు, ఉత్తర్వులను అనుసరించి క్లస్టర్ల ఏర్పాటుపై కర్నూలు, నంద్యాల జిల్లాలో స్పష్టత వచ్చింది. ఆ వివరాలను జిల్లా పాలనాధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం నుంచి అధికారికంగా ఉత్తర్వులు రాగానే అమలు చేయనున్నారు. తమ గ్రామంలోనే క్లస్టర్ సచివాలయాన్ని ఏర్పాటు చేయాలంటూ కొన్నిచోట్ల ఆయా ప్రాంతాల ప్రజలు కీలక ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు సమాచారం.

**జనాభా ఆధారంగా విభజన**

ఉమ్మడి జిల్లాలో 1,188 గ్రామ, వార్డు సచివాలయాలుండగా వీటి పరిధిలో 13,52,530 కుటుంబాలు, 43,56,052 మంది నివసిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో నివాసం ఉంటున్న కుటుంబాలు, జనాభాను పరిగణనలోకి తీసుకుని మూడు కేటగిరీలుగా విభజించారు. ఉమ్మడి జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాలను 619 క్లస్టర్లుగా చేయాలని జిల్లా అధికారులు ఇటీవల ప్రతిపాదించారు.

2,500 మంది లోపు జనాభా ఉంటే 'ఎ' విభాగం కింద చేర్చి ఆరుగురు ఉద్యోగులను కొనసాగిస్తారు. 2,501-3,500 మంది ఉంటే 'బి' కేటగిరీ కింద ఏడుగురు, 3,501 మందికిపైగా ఎంతమంది జనాభా ఉన్నా 'సి' విభాగంలో చేరుస్తారు. ఇక్కడ 8-10 మంది సిబ్బంది పనిచేసేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

**ఉద్యోగుల హేతుబద్ధీకరణ..**

ఉమ్మడి జిల్లాలోని సచివాలయాల్లో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల వివరాలు ఓ కొలిక్కి వచ్చాయి. మ్యాపింగ్ పూర్తవడంతో మిగులు సిబ్బందిని గుర్తించి జిల్లా స్థాయిలో పూలింగ్‌లోకి తేనున్నారు. ఎక్కువగా మహిళా పోలీసులు, డిజిటల్ అసిస్టెంట్లు, సంక్షేమ సహాయకులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. వీరిని అవసరమైన సచివాలయాలకు సర్దుబాటు చేయడం లేదా కొందరికి సంబంధిత, ఇతర ప్రభుత్వ శాఖలకు కేటాయించే ప్రతిపాదనలు ఉన్నట్లు సమాచారం.

**జనరల్ పర్పస్ ఫంక్షనరీస్ :** పరిపాలన, బహుళ సేవలపరంగా చూస్తే పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, సంక్షేమ, డిజిటల్ సహాయకులు ప్రతిచోట ఉంటారు. పట్టణాల్లో వార్డు అడ్మిన్, వార్డు ఎడ్యుకేషన్, వార్డు సంక్షేమ, మహిళా ఉద్యోగులు మిగులు ఉంటే ఆయా శాఖల్లోకి సర్దుబాటు చేయాలన్న చర్చ జరుగుతోంది.

**స్పెసిఫిక్ ఫంక్షనరీస్ :** సాంకేతిక సేవలపరంగా చూస్తే వీఆర్వో, ఆరోగ్య కార్యకర్త, సర్వేయర్, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, గ్రామ మత్స్య, పట్టు పరిశ్రమ, పశుసంవర్ధక సహాయకులు, ఎనర్జీ, ఇంజినీరింగ్ విభాగాల్లో రెండు సచివాలయాలకు కలిపి ఒక్కో విభాగంలో ఒక్కరే ఉంటారు. వార్డు రెవెన్యూ సెక్రటరీ, హెల్త్ అసిస్టెంట్, ప్లానింగ్, రెగ్యులరేషన్ సెక్రటరీ, అమినిటీస్ సెక్రటరీ, శానిటేషన్, వార్డు ఎనర్జీ సెక్రటరీలు ఉంటారు.

ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగుల్లో ఉన్నత చదువులు చదివి సాంకేతిక పరిజ్ఞానం, ఐవోటీఎస్, ఏఐ సాంకేతికతపై అవగాహన ఉన్నవారిని ఆస్పిరేషనల్ సెక్రటరీలుగా నియమించే అవకాశాలున్నాయి.

# అన్నదాతకు 'పొగ'బెట్టారు!



పామిడి: ఆ రైతులంతా ఏ పంటలు వేసినా దిగుబడులు సరిగా రాక ఇబ్బందులు పడ్డారు. ఇలాంటి సమయంలో రెండు కంపెనీల ప్రతినిధులు వచ్చి చుక్కబర్లీ రకం పొగాకు సాగుపై అవగాహన కల్పించారు. పొగాకు క్వింటా రూ.15,500లకు కొనుగోలు చేస్తామని రైతులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఎకరాకు 13 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని నమ్మించారు. ఈక్రమంలో పామిడి, పెద్దవడుగూరు మండలాల్లో రైతులు పెద్ద ఎత్తున పొగాకు సాగు చేశారు.

పామిడి మండలంలోని గజరాంపల్లి గ్రామంలో దాదాపు 130 ఎకరాల్లో, పెద్దవడుగూరు మండలంలో 2వేల ఎకరాల్లో రైతులు పొగాకు సాగు చేపట్టారు. ప్రస్తుతం గజరాంపల్లి గ్రామంలో దాదాపు 30 ఎకరాల్లో పంట సాగులో ఉంది. కంపెనీ తరఫున ఇచ్చిన చుక్కబర్లీ రకం పొగాకు విత్తనాలు నారు పోసి నెల తరువాత ఆ నారును పొలాల్లో నాటారు. 5 నెలల పంటకాలం ఉన్న ఈ పంట దశల వారీగా గోధుమ రంగులోకి మారిన ఆకు పత్రాలను తాళ్లతో కట్టి ఆరబెట్టి, వాటిని గోనెసంచుల నడుమ భద్రపరిచి మార్కెట్ తరలిస్తున్నారు.

**ఆశచూపి.. మొహం చాటేసి..**

పంట చేతికొచ్చాక కంపెనీ ప్రతినిధులు మొహం చాటేశారు. పండిన పంటను ఏమీ చేయాలో తెలియని రైతులు పలుమార్లు కంపెనీ వారితో చరవాణిలో మాట్లాడుతూ నేరుగా ప్రకాశం జిల్లాలోని మేదరమెట్లకు 8 లారీల్లో పొగాకును తరలించారు. అక్కడ కొనేవారే లేక రైతులు అయోమయానికి గురయ్యారు కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి పొగాకు కొనుగోలు చేపట్టారు. కంపెనీ ధర ప్రకారం రూ.15,500 కొనుగోలు చేయాల్సి ఉండగా ప్రస్తుతం నాణ్యమైన పంట రూ.10 వేలుకు కొనుగోలు చేశారు. నాణ్యత తక్కువగా ఉన్న పంటను కొనుగోలు చేయమని చెప్పడంతో దాదాపు 3 లారీల పొగాకు పంట కొనుగోలు ప్రశ్నార్థకంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వమే ఆదుకోవాలి**

మారుతీవరప్రసాద్ రెడ్డి, గజరాంపల్లి, పామిడి మండలం

ఇది వరకు పత్తి, మిరప పంటలను సాగు చేసేవాళ్లం. ప్రస్తుతం రెండు ఎకరాల పొలంలో పొగాకు పంట వేశా. ఎకరాకు రూ.60 వేల చొప్పున పెట్టుబడి పెట్టా. దిగుబడులు ఆశించిన స్థాయిలో రాలేదు. దీనికి తోడు గిట్టుబాటు ధర లేకపోవడం, కొనుగోలుదారులు ముందుకు రాకపోవడంతో దిక్కు తోచడం లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

**గిట్టుబాటు కావడం లేదు**

వాసుదేవరెడ్డి, లక్షుంపల్లి, పెద్దవడుగూరు మండలం

రెండు ఎకరాల్లో పొగాకు పంట వేశా. మొదట్లో నంద్యాల ప్రాంతానికి చెందిన వ్యక్తులు వచ్చి పొగాకు సాగు చేస్తే క్వింటా రూ.15 వేలతో కొనుగోలు చేస్తామని నమ్మబలికారు. ప్రస్తుతం పంట చేతికొచ్చాక తక్కువ ధరకు కొనుగోలు చేస్తామంటున్నారు. దిగుబడి బాగానే ఉన్నా గిట్టుబడి ధర లేదు. ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలి.

# తీరనున్న అల్ప విద్యుత్తు సమస్య



మడకశిర: అల్ప విద్యుత్తు కష్టాల నుంచి రైతులను కూటమి ప్రభుత్వం గట్టెక్కించనుంది. రైతులకు, వినియోగదారులకు విద్యుత్తు కష్టాలు తీరనున్నాయి. మూడు నియోజకవర్గాల్లో ప్రస్తుతం 38,200 వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. వాటికి సరిపడా విద్యుత్తు సరఫరా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వేసవిలో అల్ప విద్యుత్తు సమస్య కారణంగా సాగు చేసిన పంటలు ఎండిపోయి నానా అవస్థలు పడ్డారు. ఇలాంటి తరుణంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా ఉపకేంద్రాలు మంజూరు చేయడంతో మండలాలకు అంతరాయం లేకుండా విద్యుత్తు సేవలు అందనున్నాయి.

**59 గ్రామాల్లో మెరుగుపడనున్న సరఫరా**

పెనుకొండ డివిజన్ పరిధిలో కొత్తగా విద్యుత్తు ఉపకేంద్రాలు మంజూరు కావడం, ఇప్పటికే పూర్తయినవి ప్రారంభిస్తుండటంతో 59 గ్రామాల రైతులకు అల్ప విద్యుత్తు సమస్య తీరనుంది. ప్రధానంగా మడకశిర నియోజకవర్గంలో 39 గ్రామాల్లో ఈ సమస్య అత్యధికంగా ఉంది. దీంతో కూటమి ప్రభుత్వం స్పందించి రూ.36.50 కోట్లతో కొత్తగా 9 విద్యుత్తు ఉపకేంద్రాలు మంజూరు చేసింది. ప్రస్తుతం వాటికి భూమి పూజ చేసి నిర్మాణాలు ప్రారంభించారు. త్వరితగతిన పూర్తి చేసేందుకు పనులు వేగంగా జరుగుతున్నాయి. పెనుకొండ నియోజకవర్గంలో పైడేటీ, దొడగట్టలో ఉపకేంద్రాలు మరో రెండు నెలల్లో పూర్తి కానున్నాయి. **పరిశ్రమలకు ఎంతో ఉపయోగం..**

హిందూపురం నియోజకవర్గంలో రూ.15 కోట్లతో 33/11కేవీ 4 విద్యుత్తు ఉపకేంద్రాలు మంజూరయ్యాయి. ఇందులో గోల్లాపురం, కిరికెర, మోత్కుపల్లి, సింగిరెడ్డిపల్లిలో నిర్మాణాలు జరుగుతున్నాయి. గోళ్లాపురంలో విద్యుత్తు ఉపకేంద్రం నిర్మాణం పూర్తయితే ఇండస్ట్రియల్ ఏరియాకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.

**హామీ నెరవేర్చిన ముఖ్యమంత్రి**


ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మడకశిర పర్యటనకు వచ్చినప్పుడు స్థానిక ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అల్ప విద్యుత్తు సమస్య ఉందని ఉపకేంద్రాలు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన ముఖ్యమంత్రి వెంటనే నిర్మాణంలో ఉన్న 4 పూర్తి చేయాలని, మరో 3 మంజూరు చేశారు. మడకశిర నియోజకవర్గంలో మొత్తం 27 ఉపకేంద్రాలు అవుతాయి.

# అధికారులు ఊసులు.. అక్రమార్కులకు కాసులు

విశాఖపట్నం : మహా విశాఖ నగరపాలక సంస్థకు 'గిఫ్ట్ డీడ్'గా ఇచ్చిన స్థలమిది. జాతీయ రహదారికి సమీపంలో ఉండటంతో దాని విలువ రూ.కోట్లల్లోనే. అలాంటి స్థలంలో కొందరు అనధికారికంగా వాణిజ్య సముదాయాలు నిర్మించారు. విచిత్రమేమంటే ఆక్రమిత స్థలంలో కట్టిన నిర్మాణాలకు జీవీఎంసీనే పన్ను వేసింది. ఒక్కమాటలో చెప్పాలంటే అక్రమాన్ని సక్రమం చేసేలా అధికారులు కబ్జాదారులకు రాచబాటలు వేశారన్నమాట. ఈ ఘనకార్యం మధురవాడ పరిధిలో చోటు చేసుకుంది.

**దస్త్రాలు లేకున్నా:** జీవీఎంసీకి చెందాల్సిన స్థలంలో దుకాణాలు నిర్మించగా... 2016-17లో సూరీడు అనే వ్యక్తి పేరున అధికారులు పన్ను విధించడం గమనార్హం. సరైన దస్త్రాలు లేకపోయినా జీవీఎంసీ అధికారులు కాసులకు కక్కుర్తిపడి పన్ను విధించినట్లు చర్చ సాగుతోంది. జీఎంసీ స్థలం ఆక్రమించడమే కాకుండా, ఇలా సక్రమం అని చూపించుకునేలా కొందరు అధికారులు చేతులుకలిపినట్లు విమర్శలున్నాయి. ఆక్రమిత 672 గజాల స్థలం ప్రభుత్వ ధర ప్రకారం రూ.4 కోట్లు కాగా, బహిరంగ మార్కెట్‌లో రూ.8కోట్లపైనే ఉంది.

**అధికారులకు ఫిర్యాదు:** ఈ దుకాణాల వ్యవహారంలో కుటుంబ సభ్యుల్లో విభేదాలు రావడంతో గిఫ్ట్‌డీడ్ చేసిన వారసులకు చెందిన కొందరు జీవీఎంసీలో ఫిర్యాదు చేశారు. ఆక్రమిత స్థలంలో నిర్మించిన దుకాణాలు జీవీఎంసీ స్వాధీనం చేసుకోవాలంటూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలోనూ గత కొన్ని నెలలుగా ఫిర్యాదులందాయి. ఒకసారి గిఫ్ట్‌డీడ్ చేసిన తర్వాత ప్రైవేటు వ్యక్తులకు అదే స్థలంలోని దుకాణాలకు పన్నులు ఎలా వేస్తారంటూ? స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై మధురవాడ జెడ్సీ కనకమహాలక్ష్మిని వివరణ కోరగా...తాను కొత్తగా వచ్చానని, ఈ అంశంపై పరిశీలించి చర్యలు తీసుకుంటానన్నారు.



**రాజకీయ పలుకుబడితో:** మధురవాడ పరిధిలో కారుషెడ్డు జంక్షన్ నుంచి మిథిలాపురి వుడాకాలనీకి వెళ్లే మార్గం ఆరంభంలో 1080 గజాల ప్రైవేటు స్థలం ఉంది. ఇందులో అపార్ట్‌మెంట్ నిర్మాణానికి ప్లాన్ అనుమతులకు 2008లో ముకుందయ్య, అప్పలస్వామికి సంబంధించిన వారసులు వెళ్లారు. జాతీయ రహదారి పక్కన ఉండటం, వుడా, జీవీఎంసీ మాస్టర్ ప్లాన్ పరిశీలించి 420 గజాల్లో భవన నిర్మాణానికి అనుమతులిచ్చారు. ఈ నేపథ్యంలో నూకరాజు అనే వ్యక్తి నుంచి సర్వే నెంబరు 248-10లో 672 గజాలు గిఫ్ట్‌డీడ్ చేయించుకున్నారు. అదే కుటుంబానికి చెందిన ఓ వ్యక్తి స్థానికంగా రాజకీయ పలుకుబడి ఉపయోగించి జీవీఎంసీ గిఫ్ట్ డీడ్ చేసిన స్థలంలో దర్జాగా వ్యాపార దుకాణాలు నిర్మించారు. హోటల్, ఫర్నిచర్, ఇతర షాపులకు అద్దెలకిచ్చి రూ.వేలల్లో వసూలు చేసుకుంటున్నారు.

# సూర్యగ్రహణం

నంద్యాల : వినియోగదారుల విద్యుత్తు బిల్లులను తగ్గించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ పథకానికి శ్రీకారం చుట్టింది. ఇంటి కప్పుపై సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకునే వారికి భారీ రాయితీలిస్తోంది. బ్యాంకుల ద్వారా రుణ వసతి కల్పిస్తోంది. చేతి నుంచి పెట్టుబడి పెట్టాల్సిన అవసరం లేకపోవడంతో ఉమ్మడి జిల్లాలో వేలాదిమంది దరఖాస్తు చేసుకున్నారు. కానీ డిమాండ్‌కు తగ్గట్లు సోలార్ ప్యానళ్లను సరఫరా చేయడం లేదు. విద్యుత్తు శాఖ ఉన్నతాధికారులు దీనిపై దృష్టిపెట్టడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫలితంగా దరఖాస్తుదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు.

**నియోజకవర్గానికి 10 వేల యూనిట్లు**

సూర్యఘర్ పథకం కింద ప్రతి నియోజకవర్గంలో 10 వేల సౌరశక్తి యూనిట్లు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. దీనిపై అధికారులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలంటూ అవగాహన కల్పిస్తున్నారు. దీంతో ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. విద్యుత్తు కనెక్షన్లు కలిగిన ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల్లో 90 శాతం మంది సౌర ఫలకాల ఏర్పాటుకు అంగీకరించారు.

**లక్ష ఫలకాలు అవసరం**

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రస్తుతం లక్షకు పైగా సౌర ఫలకాలు అవసరం. వినియోగదారుడు దరఖాస్తు చేసుకున్న ఏడు రోజుల్లోపు రుణం మంజూరు చేస్తారు. మొత్తం మీద 25 రోజుల్లోపు వారి ఇంటిపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేయాలి. ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం గుజరాత్, హైదరాబాద్, బెంగళూరు నుంచి సౌర ఫలకాలను దిగుమతి చేసుకోవాలి. కాని ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలు సరిగా సరఫరా చేయడం లేదు. అరకొరగా సరఫరా చేస్తుండటంతో లక్ష్యం నెరవేరడం లేదు.

**వెండర్ల వెతలు**

సౌర ఫలకాలు అమర్చేందుకు పలువురు నిరుద్యోగులు వెండర్లుగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. నంద్యాల 120, కర్నూలు జిల్లాలో 97 మంది రిజిస్టర్ అయ్యారు. అధికారులు వారికి మండలాలను కేటాయించారు. ఆయా ప్రాంతాల్లో ప్యానెళ్లు బిగించాల్సిన బాధ్యతలు అప్పగించారు. ఇక్కడే అసలు సమస్యలు ప్రారంభమయ్యాయి.

నంద్యాల పట్టణం రామనాథరెడ్డినగర్‌కు చెందిన ఒక వెండర్ వారం రోజుల్లోనే 32 మంది వినియోగదారులను రిజిస్టర్ చేయించారు. వీరందరికీ ఎస్‌బీఐ రుణం మంజూరు చేసింది. ఇప్పటి వరకు ముగ్గురికి మాత్రమే ప్యానెళ్లను ఏర్పాటు చేశారు. మార్చి ప్రథమార్థంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కాగా ఉగాది నాటికి ఫలకాలు బిగిస్తామని చెప్పారు. చెప్పిన గడువు దాటి 20 రోజులవుతున్నా ప్యానెళ్లు మాత్రం రాలేదు. కర్నూలు జిల్లాలో 4,789 మంది పేర్లు నమోదు చేసుకోగా ఇప్పటి వరకు 485 మందికి మాత్రమే ప్యానెళ్లను బిగించారు.

# ఏటికాడ ఇసుక నక్కలు

కర్నూలు : నిర్మాణ రంగానికి మేలు చేయాలని భావించిన 'కూటమి' ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానం అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. జిల్లాలో 172 ప్రాంతాల్లో వాగులు, వంకలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో గృహ అవసరాల కోసం ఇసుక తవ్వడానికి జిల్లా యంత్రాంగం అనుమతులు జారీ చేసింది. ఇదే అవకాశంగా కొందరు అక్రమార్కులు 'స్థానిక' అవసరాల పేరిట తవ్వి పట్టణాలకు తరలించి విక్రయిస్తున్నారు. తుంగభద్ర, హంద్రీ నది పరివాహక ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది.

**అక్రమంగా తోడి.. కాసులు నింపి**

గృహ అవసరాల నిమిత్తం వాగులు, వంకలు, నదుల నుంచి ఇసుకను ఉచితంగా తీసుకెళ్లొచ్చని ప్రభుత్వం ప్రకటించింది. అందుకు గనులు, భూగర్భ శాఖ రూపొందించిన ఏపీ శాండ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇవేవి పట్టించుకోకుండా నిర్మాణాల పేరుతో ఇసుక తవ్వి ఊరు దాటిస్తున్నారు. ట్రాక్టరు ఇసుక రూ.1,500-2,500, రూ.3 వేల వరకు విక్రయిస్తున్నారు.

గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, ఊరు దాటి వెళ్లే వాహనాలను తహసీల్దారు, ఎంపీడీవో, ఎస్సై పర్యవేక్షించాలి. ముందస్తు రిజిస్ట్రేషన్ లేకుండా ఇసుకను తీసుకెళ్తే జరిమానా విధించొచ్చు.అధికారులెవరూ పట్టించుకోవడం లేదు.

అక్రమంగా ఇసుకను తరలించే క్రమంలో ట్రాక్టరు డ్రైవర్లు అతివేగంగా వెళ్తున్నారు. ఇటీవల మునగాలపాడు-నిడ్జూరు మధ్యలో ఓ ఇసుక ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి చెందారు.

**పక్క రాష్ట్రానికి తరలింపు**

తుంగభద్ర నదీ తీరం వెంట ఉన్న 137 గ్రామాల్లో ఇసుక దందా జోరందుకొంది. నదీ పరివాహక ప్రాంతాల నుంచి నిత్యం వందల ట్రాక్టర్లలో ఇసుకను తీసుకెళ్తున్నారు. కర్నూలు నగరంతోపాటు తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు తీసుకెళ్తున్నారు. జి.సింగవరం, నిడ్జూరు, మునగాలపాడు, పంచలింగాల, పడిదెంపాడు, పూడూరు ప్రాంతాల్లో రాత్రివేళ తవ్వి ఓ చోట నిల్వ చేస్తున్నారు. ఉదయం తరలిస్తున్నారు. పంచలింగాల సమీపంలో వంతెన కింద ఇసుక తోడేస్తున్నా పట్టించుకోవడం లేదు. నిత్యం రెండు వందల ట్రాక్టరలో తరలుతోంది.. దీని విలువ రూ.8 లక్షల వరకు ఉంటుంది.

# వరదొచ్చేలోపు వంతెనలు

బనగానపల్లి : మైనింగ్ ఖిల్లా.. కొండల పక్క పల్లెలు.. మార్గమధ్యంలో వాగులు.. సరైన దారులు లేవు.. వంతెనల్లేక వర్షాకాలంలో ఆగుతున్న రాకపోకలు.. ఇలాంటి సమస్యల పరిష్కారానికి 'కూటమి' ప్రభుత్వం ముందుకొచ్చింది. ప్రజా సమస్యలను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో బనగానపల్లి నియోజకవర్గానికి రూ.67.50 కోట్లు ప్రత్యేకంగా విడుదల చేశారు. వీటితో వంతెనలు, రోడ్లు నిర్మిస్తున్నారు.. ఆయా పనులు మే చివరి నాటికి పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందించినట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ హుసేని తెలిపారు.

**వలయ దారి**బనగానపల్లి నియోజకవర్గంలో సిమెంటు కంపెనీలు ఎక్కువ. సరకు రవాణాకు సంబంధించి భారీ వాహనాలు పట్టణం మీదుగా వెళ్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.. సమస్క పరిష్కారానికి వలయ(రింగ్)దారి నిర్మించాలని గతంలో తెదేపా హయాంలో నిర్ణయించారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా పట్టించుకోలేదు. 'కూటమి' ప్రభుత్వం రాకతో పనులు ప్రారంభించారు.. 15 కి.మీ. మేర నిర్మించే రింగ్ రోడ్డుకు రూ.50 కోట్లు వెచ్చించనున్నారు.**విస్తరణకు అడుగులు**

బనగానపల్లి నుంచి పసుపుల వరకు 7 కి.మీ. రహదారి ఇరుకుగా ఉంది.. ఈ మార్గంలో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దారి ఇరుకుగా ఉండటలో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని రూ.12.50 కోట్లతో విస్తరణ పనులు చేపడుతున్నారు.

**ముప్పు తప్పించేలా** వర్షాకాలంలో కుందూనది ఉప్పొంగడంతో ఏటా వెయ్యి ఎకరాల్లో పంట నష్టం తలెత్తుతోంది.. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ నేపథ్యంలో కోవెలకుంట్ల మండలం వల్లంపాడు వద్ద సుమారు రూ.1.50 కోట్లతో వంతెన నిర్మిస్తున్నారు. బనగానపల్లి మండలం తిమ్మాపురం వద్ద రూ.1.50 కోట్లతో వంతెన నిర్మిస్తున్నారు.చిన్నపాటి వర్షానికే రోడ్డుపైకి నీరొస్తుండటంతో నంద్యాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వందెకరాల్లో పంట నీట మునుగుతోంది.. సమస్య పరిష్కారానికి బనగానపల్లి మండలం పండ్లాపురం సమీపంలో రూ.2 కోట్లతో వంతెన పనులు మొదలుపెట్టారు.

# వేలంలో జోక్యం.. ఖజానాకు సున్నం!

పుట్టపర్తి : హిందూపురంలో ఓ ప్రజాప్రతినిధి వ్యక్తిగత సహాయకుడు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజాధనం దుర్వినియోగం చేయడమే కాకుండా ప్రభుత్వ ఖజానాకు వచ్చే ఆదాయానికి గండి కొడుతున్నారు. స్థానిక సంస్థలకు ఆదాయం తెచ్చిపెట్టే వేలం పాటల్లోనూ తల దూరుస్తున్నారు. ఉద్దేశపూర్వకంగా అడ్డుకుని తమకు అనుకూలంగా ఉండే వారికి కట్టబెట్టడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ప్రముఖ పర్యాటక క్షేత్రం లేపాక్షిలో వాహనాల పార్కింగ్, హిందూపురం పురపాలిక దినసరి మార్కెట్ సుంకం వసూలు వేలంలో జోక్యం చేసుకున్నారు.

**రూ.38 లక్షలు నష్టం**

లేపాక్షి ఆలయాన్ని ఏటా 8 లక్షల నుంచి 10 లక్షల మంది పర్యాటకులు సందర్శిస్తుంటారు. 75 వేల నుంచి 80 వేల మంది వ్యక్తిగత వాహనాల్లో ఇక్కడికి వస్తున్నారు. పార్కింగ్ రసుం కారుకు రూ.50, ద్విచక్రవాహనాలకు రూ.20 చొప్పున వసూలు చేస్తున్నారు. వసూలు కాంట్రాక్టు కోసం ఇటీవల వేలం నిర్వహించగా.. శంకర్‌రెడ్డి రూ.72.10 లక్షలకు పాడుకున్నారు. ఈక్రమంలో ఓ ప్రజాప్రతినిధి వ్యక్తిగత సహాయకుడు తమవారికి కాంట్రాక్టు కట్టబెట్టేలా అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారు. పంచాయతీ అధికారులు శంకర్‌రెడ్డి నుంచి డబ్బులు కట్టించుకోకుండా ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేసి వేలం రద్దయ్యేలా చేశారు. తర్వాత గోవిందప్ప అనే వ్యక్తికి రూ.34.56 లక్షలకే కట్టబెట్టారు. దీంతో లేపాక్షి పంచాయతీ రూ.38 లక్షల ఆదాయం కోల్పోయింది.



**మున్సిపల్ ఆదాయానికి గండి**

ఇటీవల హిందూపురం మున్సిపల్ దినసరి కూరగాయల మార్కెట్ సుంకం వసూలు వేలం పాటలో తమకు అనుకూలమైన వ్యక్తి దక్కేలా అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారు. గతనెల 19న వేలం పాట నిర్వహించగా రూ.64.25 లక్షల వరకు పాడారు. పాట కొనసాగించి ఉంటే అదే రోజు రూ.80 లక్షల నుంచి రూ.కోటి వరకు వెళ్లే అవకాశం ఉండేది. తమకు కావాల్సిన వ్యక్తి కోసం ఆ రోజు ఉద్దేశపూర్వకంగా వేలంపాట వాయిదా వేశారు. తర్వాత జరిగిన వేలం పాటలో కేవలం రూ.5 వేలు పెంచి రూ.64.30 లక్షలకు తమకు కావాల్సిన వారికి దక్కేలా పావులు కదిపారు. స్థానిక నాయకుల స్వార్థం కారణంగా పురాపలికకు రూ.20 లక్షల వరకు నష్టం చేకూరింది.

# బంగ్లా చెరువు.. కబ్జా నెలవు

కార్వేటినగరం : కబ్జాకు కాదేదీ అనర్హం.. కాలువలు, కుంటలు, గుట్టలు, చెరువులను దర్జాగా ఆక్రమించేస్తున్నారు కొందరు కబ్జాదారులు.. గత ప్రభుత్వ పాలనలో మొదలై నేటికీ యథేచ్ఛగా కొనసాగుతోంది. వైకాపా పాలనలో కొనసాగిన ఆక్రమణలకు ప్రస్తుతం కొందరు ద్వితీయశ్రేణి నాయకుల అండదండలు తోడవడంతో కబ్జాదారులు బరితెగిస్తున్నారు. కార్వేటినగరం బంగ్లా చెరువు కలుజుకు సమీపంలోని కట్టను తవ్వేసి ఆక్రమించుకున్నా రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. బంగ్లా చెరువును కార్వేటినగరం సంస్థానాధీశులు నిర్మాంచారు. ఈ చెరువు కింద వంద ఎకరాల్లో



వివిధ పంటలు సాగవుతున్నాయి. చెరువు కలుజు వద్ద ఓ వైకాపా నాయకుడు ఆక్రమణలకు పాల్పడటంతో కలుజు ప్రమాదకరంగా మారింది. వర్షాలకు తెగిపోయే అవకాశముందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములను కొందరు ఆక్రమించుకుని పంటలు సాగు చేస్తున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడంలేదు. బంగ్లా చెరువును సమగ్రంగా సర్వే చేసి సరిహద్దులు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

**చర్యలు తీసుకుంటాం**

చెరువు కలుజుకు సమీపంలో ఓ వ్యక్తికి డీకేటీ పట్టా ఇచ్చినట్లు చెబుతున్నారు. సదరు స్థలాన్ని సర్వే చేసి ప్రభుత్వ భూమిలో తవ్వకాలు జరిపినట్లు రుజువైతే చర్యలు తీసుకుంటాం. చెరువు కలుజు కబ్జాచేసిన వారిపై చర్యలు కఠినంగా ఉంటాయి.నాగరాజు, తహసీల్దార్, కార్వేటినగరం

# లెక్కలు లేవాయే..!

గూడూరు : ఇసుక లెక్కల్లో ఇసుమంతైనా పారదర్శకత కనిపించడం లేదు. కోట మండలం గూడలి స్వర్ణముఖి నదిలో డీసిల్టింగ్ కేంద్రం గతనెల 5న అధికారికంగా ఏర్పాటు చేయగా ఇప్పటివరకు ఎంత తవ్వకాలు జరిగాయి.. ఎంత ఎక్కడెక్కడి తరలించారు అన్న లెక్కలు జలవనరుల, గనుల శాఖ, రెవెన్యూ అధికారుల వద్ద లేకపోవడం విడ్డూరం. మరోవైపు ఎలాంటి డంపింగ్ యార్డు లేకపోగా ఇసుక అమ్మకాలపై నేటికీ ఆన్‌లైన్‌లో వివరాలు పొందుపర్చలేదు. ప్రస్తుతం ఇక్కడ ప్రభుత్వ నిబంధనల మేరకు పూడికతీత పనులు జరగడం లేదని స్పష్టంగా తెలుస్తోంది. తవ్వకాలను కూలీలతో చేపట్టాల్సి ఉండగా నేరుగా యంత్రాలతోనే తవ్వి అక్కడే దర్జాగా విక్రయిస్తున్నారు. రాత్రీపగలు తేడా లేకుండా తవ్వకాలు.. తరలింపు జరుగుతోంది. ఇక్కడ జరుగుతున్న దందాకు మూడుశాఖల అధికారులతో పాటుగా పోలీసులు అండగా నిలవవడంతో కనీస పరిశీలన కరవైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. **55 వేల టన్నుల తరలింపు లక్ష్యం**

నదిలో డీసిల్టింగ్ ద్వారా 55 వేల టన్నుల ఇసుకను తరలించాలి. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు విక్రయించాలి. అందుకు విరుద్ధంగా ఇప్పటివరకు వేల టన్నుల ఇసుక తమిళనాడు తదితర ప్రాంతాలకు తరలినట్లుగా సమాచారం. డీసిల్టింగ్ పనులపై జలవనరుల శాఖ ఈఈ శ్రీనివాసరావు, గనుల శాఖ ఏడీ శ్రీనివాసరావు ఇద్దరిని వివరణ కోరగా పొంతన లేని సమాధానాలు చెప్పారు. ఎంత తవ్వారు.. తరలించారు వాటి లెక్కలు అడగ్గా తమ వద్ద లేవన్నారు.

# కందిపప్పు కరవాయె!



అనంతపురం : రేషన్ కార్డుదారులకు కందిపప్పు కరవైంది. ప్రభుత్వం కిలో రూ.67 చొప్పున కార్డుదారులకు పంపిణీ చేసేది. మూడు నెలలుగా సరఫరా ఆగిపోయింది. బహిరంగ మార్కెట్‌లో ధరలు మండిపోతున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఆంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలకు మాత్రమే కందిపప్పు సరఫరా అవుతోంది. 2014-19 మధ్య కాలంలో ఏడాదికొకసారి టెండర్లు పిలిచి కందిపప్పును ప్రతినెలా అందించేవారు. గత వైకాపా ప్రభుత్వంలో 2-3 నెలకొకసారి టెండర్లు పిలిచారు. అరకొరగా దుకాణాలకు సరఫరా చేసేవారు. గుత్తేదారులకు సొమ్ము సకాలంలో చెల్లించకపోవడంతో ఎవరూ ముందుకు రాలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జనవరి నెల వరకు పంపిణీ అయింది. టెండరు ముగియడంతో సరఫరాకు అడ్డుకట్ట పడింది. ఇదంతా వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో సమస్య తలెత్తిందని పౌర సరఫరాల సంస్థలో చర్చ సాగుతోంది. మూడు నెలల నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నా స్పందన కొరవడింది. ప్రస్తుతం ఎట్టకేలకు టెండర్లు పూర్తయినట్లు తెలుస్తోంది. వైకాపా పాలనలో ఎండీయూ వాహనాల ద్వారా సరకులు పంచారు. డీలర్లు, వాహనదారులు కుమ్మక్కై కార్డుదారులతో వేలిముద్రలు వేయించుకుని... అప్పట్లో బియ్యం ఒక్కటే పంపిణీ చేసిన సందర్భాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం రాగానే ఆరు రకాల సరకులు ఇవ్వాలని నిర్ణయించారు. ఎండీయూ వాహనాలకు బ్యాంకు కంతులు చెల్లించాల్సి ఉండడంతో ఇప్పటికీ ఆపరేటర్లు, చాలాచోట్ల పాత డీలర్లే కొనసాగుతున్నారు. వీరితో పాటు గ్రామ సచివాలయాలు మ్యాపింగ్ తొలగిస్తే తప్ప నిత్యాసర సరకుల పంపిణీ సాఫీగా సాగదని పౌరసరఫరాల శాఖ అధికారులు పేర్కొనడం గమనార్హం.

**బహిరంగ మార్కెట్‌లో కొనలేక..**

బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు ధర పెరిగింది. మొదటి రకం కిలో రూ.140, రెండో రకం 125, మూడో రకం రూ.114 ధర పలుకుతోంది. అదే చౌక దుకాణాల్లో సుమారు సగానికి సగమే ఉండేది. దాదాపు లబ్ధిదారులు అందరూ తీసుకొనేవారు. ప్రస్తుతం సరఫరా లేకపోవడంతో బయటి మార్కెట్‌లో కొనలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

టెండర్ల ప్రక్రియ సాగుతోంది

రమేశ్‌రెడ్డి, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల సంస్థ

రాష్ట్రస్థాయిలో కందిపప్పునకు టెండర్లు పిలుస్తున్నా స్పందన లేకపోవడంతో మూడు నెలలుగా సరఫరా ఆగిన విషయం నిజమే. ప్రస్తుతం టెండరు ప్రక్రియ పూర్తి అయింది. గుత్తేదారులతో ఒప్పందం, ఇతరత్రా పెండింగ్‌లో ఉన్నాయి. జూన్ నుంచి చౌకదుకాణాలకు సరఫరా చేయడానికి తగిన చర్యలు తీసుకుంటాం.

**అనంతపురం జిల్లాలో ఇలా..**

| | |
|---|---|
| చౌక దుకాణాలు | : 3,012 |
| లబ్ధిదారులు | : 12,08,293 |
| కందిపప్పు అవసరం | : 1,210 టన్నులు |

# సింహగిరిపై తొలి గంధం అరగదీత

సింహాచలం : చైత్ర బహుళ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 24న సింహగిరిపై అప్పన్న స్వామి దేవాలయంలో తొలి గంధం అరగదీతకు శ్రీకారం చుట్టనున్నట్లు ఈవో కొమ్ముల సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 6.30గంటలకు చందనం చెక్కల అరగదీతకు అర్చకులు సుముహూర్తం నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఉదయం 7.30గంటల తర్వాత దర్శనాలు లభిస్తాయని తెలిపారు.

చందనయాత్ర సందర్భంగా 30న వైశాఖ శుద్ధ తదియ నాడు స్వామివారి నిజరూప దర్శనం అనంతరం తొలి విడతగా మూడు మణుగుల (సుమారు 120కిలోలు) చందనం సమర్పణ జరుగుతుంది. ఇందు కోసం ఆలయ సిబ్బంది బేడామండపంలోని సాన(రాళ్లు)లపై చందనం చెక్కలను అరగదీస్తారు. సేకరించిన శ్రీగంధంలో అర్చకులు సుగంధ ద్రవ్యాలు మిళితం చేసి చందనోత్సవం రోజున రాత్రి సహస్ర ఘటాభిషేకం అనంతరం స్వామికి తొలివిడగా సమర్పిస్తారు. వైశాఖ, జ్యేష్ఠ, ఆషాఢ పౌర్ణమి రోజుల్లో మరో మూడు విడతల చందన సమర్పణ చేస్తారు. శ్రావణ పౌర్ణమి నాడు కరాళ చందన అలంకరణతో ఈ ప్రక్రియ పరి సమాప్తమవుతుంది.



**పట్టు వస్త్రాల సమర్పణకు నిధులు విడుదల:** ఈ నెల 30న జరిగే అప్పన్న స్వామి నిజరూప దర్శనం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామికి పట్టు వస్త్రాలు కొనుగోలుకు రూ.20వేలు నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర దేవాదాయశాఖ కార్యదర్శి వి.వినయ్ చంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు జీవో సంఖ్య 328 విడుదల చేశారు. ఆ రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వం తరపున సింహాద్రినాథుడికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆ మేరకు తగిన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్‌ను ఆదేశించారు.

# ఎర్రకొండల్లో మట్టిదొంగలు



పెద్దపప్పూరు : పెద్దపప్పూరు మండలంలోని సోమనపల్లి గ్రామంలో మట్టి దందా యథేచ్ఛగా సాగుతోంది. అడ్డూఅదుపు లేకుండా సాగుతున్న మట్టి తవ్వకాలతో ఎర్రమట్టి కొండలు, గుట్టలు కరిగిపోతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకున్నా ప్రకృతి వనరుల్ని కొల్లగొట్టి అక్రమార్కులు జేబులు నింపుకొంటున్నారు. ప్రభుత్వానికి దక్కాల్సిన ఆదాయానికి గండి కొడుతున్నారు. పర్యావరణానికి సైతం తూట్లు పొడుస్తున్నారు.

**కరుగుతున్న గుట్టలు**

పెద్దపప్పూరు మండలంలోని సోమనపల్లి, తిమ్మనచెరువు గ్రామాల పరిధిలో 1281 సర్వేనంబర్‌లో 328 ఎకరాల్లో ఎర్రమట్టి కొండ విస్తరించింది. గత వైకాపా ప్రభుత్వంలో సాగిన మట్టి దందాతో పెద్దఎత్తున కొండ రూపుకోల్పోయింది. కొండకు రెండు వైపులా కిలోమీటర్ మేర ఇష్టానుసారంగా తవ్వకాలు చేపట్టి మట్టిని తరలించారు. ఇటీవల కొందరు అక్రమార్కులు ఎలాంటి అనుమతులు లేకున్నా పొక్లెయిన్లను వినియోగించి ట్రాక్టర్లతో, టిప్పర్లతో గుట్టు చప్పుడు లేకుండా రాత్రి, పగలు తేడా లేకుండా మట్టిని తరలిస్తున్నారు. తాడిపత్రి పట్టణం, మండలంలోని పలు గ్రామాల్లోని స్థిరాస్తి వెంచర్లకు మట్టిని తరలించి అమ్ముకుంటున్నారు. ట్రాక్టర్ మట్టి రూ. 1500, టిప్పర్ రూ.4 వేలు నుంచి 5 వేలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకునేందుకు మట్టిని తవ్వే క్రమంలో పచ్చని చెట్లను సైతం పెకిలించి వేస్తున్నారు. సోమనపల్లి గ్రామస్థులు మట్టి దందాను అడ్డుకునే ప్రయత్నం చేసినా అక్రమార్కులు ఆగడం లేదు. మరింత రెచ్చిపోయి మట్టిని తరలిస్తున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. అధికారులు స్పందించి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు చేపట్టి ప్రకృతి వనరుల్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

**తనిఖీ బృందాన్ని ఏర్పాటు చేశాం**

బాలాజీరాజు, తహసీల్దారు, పెద్దపప్పూరు

సోమనపల్లి, తిమ్మనచెరువు గ్రామాల పరిధిలో విస్తరించిన కొండపై మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవు. ఇటీవల అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని భూగర్భగనులశాఖ అధికారులకు అప్పగించాం. అనుమతులు లేకుండా తవ్వకాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే రెవెన్యూ, పోలీసు సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందం ఏర్పాటు చేశాం.

# కొండలే ఆహారం.. అధికారమే సహకారం!



విశాఖపట్నం : ఆనందపురం, వేపగుంట నగర శివారులో సహజ వనరులు దోపిడీకి గురవుతున్నాయి. కొండలు, చెరువులే కాకుండా ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలనూ వదలడం లేదు. అధికార యంత్రాంగం కళ్లుమూసుకోవడంతో అక్రమార్కులు నచ్చినట్లు తవ్వుకుపోతున్నారు. స్థానికులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. రాత్రిళ్లు ఫోన్ చేస్తే ఉదయం వస్తామంటూ సమాధానాలు ఇస్తున్నారు. గనులు, రెవెన్యూశాఖ పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమార్కుల ఆగడాలకు అడ్డుకట్ట పడడం లేదు.

**అధికారుల.. అలసత్వం ఇలా..:**

కొద్ది రోజుల కిందట శొంఠ్యాం కొండ వాలు ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలపై మొదట రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు అందింది. వారు స్పందించకపోవడంతో గనులు, విజిలెన్స్‌కు ఫిర్యాదు చేశారు. అయినా స్పందన లేదు. గిడిజాలలోని అక్రమ తవ్వకాలపై గనులశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తే ఆ తర్వాత వస్తామని కాలం వెళ్లదీశారు. చీకటి పడ్డాక లారీలు, యంత్రాలను ఆయా ప్రాంతాలకు తరలించి రాత్రి పది గంటల తర్వాత తవ్వకాలు సాగిస్తున్నారు. తెల్లవారుజాము మూడు గంటల వరకు మట్టి తరలిస్తున్నారు.

ఇందులో అధికార, ప్రతిపక్షాలకు చెందిన స్థానిక నాయకులు కుమ్మక్కై దీనిని ఆదాయ వనరుగా మార్చుకున్నారు.

గనులశాఖకు విశాఖ జిల్లాలో పూర్తిస్థాయి అధికారి లేకపోవడం ఒక సమస్యగా ఉంది. తనిఖీలు చేసి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. క్షేత్రస్థాయిలో కొందరు ఉద్యోగులకు సమాచారం ఉన్నా పట్టించుకోవడం లేదు. తవ్వేసిన ఆనవాళ్లు ఉన్నా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం లేదు.

**తవ్వకాలు ఇలా:**

పెందుర్తి మండలం జెర్రిపోతులపాలెంలోని ఒక సెంటు లేఅవుట్‌లోని కొండ వాలులో దాదాపు 500 మీటర్లలో దారుణంగా తవ్వేశారు. దీంతో ఆ ప్రాంతం ప్రమాదకరంగా తయారైంది. ఎప్పుడు ఏ రాయి జారి పడుతుంతో అన్నంత భయంకరంగా మారిపోయింది. ముఖ్యంగా రాత్రిళ్లు భారీ యంత్రాలతో తవ్వేస్తున్నారు. ఇరవై అడుగుల ఎత్తున తవ్వేయడంతో కొండ కరిగిపోయింది.

ఆనందపురం మండలంలోని రామవరం, గండిగుండం, గిడిజాలలో గ్రావెల్, ముచ్చెర్లలో చెరువు మట్టి తరలించుకుపోతున్నారు.

గండిగుండంలో రోడ్డు నిర్మాణం కోసం కొండను ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే కాలనీ పనుల కోసమని చెప్పుకొస్తున్నారు.

రామవరంలో గ్రావెల్‌తో కొందరు లారీ యజమానులు అక్రమ వ్యాపారం సాగిస్తున్నారు.

గిడిజాలలో ప్రైవేటు లేఅవుట్లకు, ముచ్చెర్లలోని ప్రైవేటు వ్యక్తులకు రాత్రిళ్లు చెరువు మట్టి తరలిస్తున్నారు.

పద్మనాభం మండలంలో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. భీమిలిలోనూ అదే పరిస్థితి.

# పుర జనం.. అమృత్ జలం

నంద్యాల : పురపాలికలకు అమృత్ జలం దరిచేరనుంది. ఉమ్మడి జిల్లాలోని కర్నూలు నగర పాలక సంస్థతోపాటు నంద్యాల, ఆదోని పురపాలికలకు అమృత్ 2.0 కింద తాగునీటి ఇబ్బందులు దూరం చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఆయా పురపాలికల్లో రూ.195.26 కోట్లతో పనులు చేపట్టేందుకు పుర అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వంలో అమృత్ పథకం కింద ఇచ్చిన అదనపు కుళాయి కనెక్షన్లకు నీటి సరఫరాలో సమస్యలు తీర్చేందుకు అనుబంధంగా ఈ పనులు దోహదపడనున్నాయి. వచ్చే 30 ఏళ్లు, అంటే 2055 నాటికి పెరిగే జనాభాకు అనుగుణంగా ముందస్తుగా నీటి వనరుల పెంపుతోపాటు సరఫరాలో లోటుపాట్లు లేకుండా ఉండేలా కసరత్తు చేస్తున్నారు. ప్రధానంగా పెరుగుతున్న శివారు ప్రాంతాల కారణంగా నీటి సరఫరాలో అనేక ఇక్కట్లతోపాటు పంపింగ్, నిల్వ సామర్థ్యం తగ్గి సరఫరాపై ప్రభావం పడుతోంది.

**నంద్యాలకు రూ.43.41 కోట్లు**

నంద్యాలలోని వీకర్ సెక్షన్ కాలనీలో నీటి సమస్యలు దూరం చేసేందుకు రూ.10.47 కోట్లతో పనులు ప్రతిపాదించారు. 700 కేఎల్ ఈఎల్ఎస్ఆర్ ట్యాంకు, 19.39 కి.మీ. నీటి గొట్టాల నిర్మాణం, 3 వేల వరకు అదనంగా నీటి కుళాయి కనెక్షన్లు ఇవ్వడం, 4.51 కి.మీ. నీటి సరఫరా గొట్టాలు నిర్మించాలనుకుంటున్నారు. మరో రూ.32.94 కోట్లతో 12.50 వాటర్ ట్రీట్ ప్లాంట్, 13.32 కి.మీ. పైప్‌లైన్ నిర్మాణం, 500 కేఎల్ సామర్థ్యమున్న క్లియర్ వాటర్ సంప్ నిర్మించనున్నారు. గాంధీనగర్, బొగ్గులైన్, బొమ్మలసత్రం, నూనెపల్లె ప్రాంతం, సాయిబాబానగర్, సాదిక్ నగర్, హరిజనవాడ తదితర కాలనీల్లో నీటి సమస్యలు అధికంగా ఉన్నాయి. 42 వార్డులుంటే.. 21 వార్డుల్లో రోజూ, మిగిలిన వార్డులకు రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేస్తున్నారు.

**కర్నూలులో ట్యాంకుల నిర్మాణం**

కర్నూలు నగరంలో నీటి సమస్యలు అధిగమించేందుకు రూ.130 కోట్లతో పనులు ప్రతిపాదించారు. కర్నూలు నగరంతోపాటు, కల్లూరు ప్రాంతాల్లో నీరు నిల్వ చేసుకునేందుకు 22 ఉపరితల ట్యాంకుల నిర్మాణం చేపట్టనున్నారు. జగన్నాథగట్టు ప్రాంతంలో 50 ఎం.ఎల్.డి. సామర్థ్యంతో నీటి ట్రీట్‌మెంట్ ప్లాంటు నిర్మించాలని భావిస్తున్నారు.



కర్నూలు, పాణ్యం, కోడుమూరు నియోజకవర్గాలకు సంబంధించి విలీన గ్రామాలైన మునగాలపాడు, మామిదాలపాడు, స్టాంటన్‌పురం తదితర గ్రామాలతోపాటు వార్డులకు తాగునీటి సేవలు కల్పించనున్నారు. విలీన గ్రామాలు, వార్డులను కలిపితే పూటకు 130 ఎం.ఎల్.డి. నీటిని సరఫరా చేయాల్సినచోట, 95 ఎం.ఎల్.డి.కి మించడం లేదు. కల్లూరు ప్రాంతంలోని 16 వార్డుల్లో నీటి సమస్యలు అధికంగా ఉన్నాయి.

**ఆదోనికి శుద్ధజలం**

ఆదోని పట్టణ శివారులోని తాగునీటి సమస్యలు పరిష్కరించాలని భావిస్తోంది. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి నగర్ ప్రాంతంలో వేయి కె.ఎల్. సామర్థ్యంతో ఈఎల్ఎస్ఆర్ ట్యాంకు, బసాపురం వేసవి నీటికుంట ప్రాంతంలో 6 ఎం.ఎల్.డి. సామర్థ్యంలో నీటి శుద్ధి ప్లాంట్, 450, 300, 250 ఎం.ఎం. డయా డీఐ నీటి పంపింగ్, సరఫరా గొట్టాల నిర్మాణం చేపట్టనున్నారు. పనులు పూర్తయితే శివారులోని కేవీఆర్ కాలనీతోపాటు భీమిరెడ్డినగర్, వైఎస్సార్ నగర్, కల్లుబావి, బీసీ కాలనీ, శంకర్‌నగర్‌తోపాటు విస్తరించే కాలనీలకు ఎంతో ఉపయుక్తంగా మారనుంది. ఈ ప్రాంతంలో ట్యాంకులు నిర్మించి, పంపింగ్ స్టేషన్ ఏర్పాటు చేసి, చుట్టూ ఉన్న ప్రాంతాలకు సులువుగా నీరు సరఫరా చేసేందుకు వీలుపడేలా పనులు చేయనున్నారు.

## ఆ సినిమా తమన్నాకి లాభమే కానీ..?

సినిమాల్లోకి వచ్చి రెండు దశాబ్దాలు అవుతున్నా ఇప్పటికీ తమన్నా లీడ్ రోల్ ఛాన్స్ లు అందుకుంటుంది అంటే ఆమె టాలెంట్ ఏంటన్నది అర్థం చేసుకోవచ్చు. కెరీర్ లో ఒకప్పుడు స్టార్స్ తో నటించి సత్తా చాటిన తమన్నా కొన్నాళ్లు బాలీవుడ్ లో కూడా సందడి చేసింది. ఐత్ సౌత్ లో ఆమెకు ఉన్న ఫాలోయింగ్ వేరు. అందుకే ఇక్కడే సినిమాలు చేస్తూ వస్తుంది. సీనియర్ హీరోలతో జత కడుతూ అలరిస్తుంది మిల్కీ బ్యూటీ. ఐతే తమన్నా ఈమధ్యనే ఓదెల 2 సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అశోక్ తేజ డైరెక్షన్ లో తెరకెక్కిన ఈ సినిమాకు కథ, కథనం, డైరెక్షన్ సూపర్ విజన్ అన్నీ తానై ఉన్నాడు సంపత్ నంది. ఈ సినిమా నిర్మాణంలో కూడా అతను భాగమని తెలిసిందే. ఉన్నంతలో ఓదెల 2 మీద మంచి బజ్ ఏర్పరచడమే కాకుండా అలాంటి సినిమాలు ఇష్టపడే ఆడియన్స్ ని మెప్పించేలా చేశారు. ఐతే తమన్నా ఈ సినిమాను చేయడం వల్ల ఆమె ప్లస్సే



అయినట్టుగా చెప్పొచ్చు. ఓదెల 2 కమర్షియల్ గా కూడా ఓకే అనిపించేసింది. సో తమన్నాతో ఇలాంటి ప్రయోగాలు చేయొచ్చు అనే విధంగా ఓదెల 2 తో ప్రూవ్ అయ్యింది. ఇప్పటివరకు తమన్నా ఇలా సోలోగా సింగిల్ హ్యాండెడ్ గా సినిమా అటెంప్ట్ చేయలేదు. ఈ తరహా కథలను ఒకప్పుడు అనుష్క చేసింది.. ఈమధ్య సమంత కూడా ఇలాంటి ప్రయత్నాలు చేసి మెప్పించింది. సో ఇప్పుడు తమన్నా కూడా డిఫరెంట్ కథలతో ఫిమేల్ సెంట్రిక్ సినిమాలు చేస్తే ప్రేక్షకులు ఆదరించేలా ఉన్నారు.ఎలాగు కంటెంట్ ఉన్న సినిమాలకు కాస్టింగ్ ఎవరన్నది చూడరు. అక్కడ కొత్త వాళ్లు ఉన్నా ఆడియన్స్ సినిమాను ఎంకరేజ్ చేస్తారు. అదే తమన్నా లాంటి హీరోయిన్ కంటెంట్ బేస్డ్ సినిమాలు చేస్తే తప్పకుండా ఆడియన్స్ యాక్సెప్ట్ చేస్తున్నారు. ఓదెల 2 వల్ల తమన్నాకి చాలా వరకు బెనిఫిటే జరిగింది. నెక్స్ట్ కూడా ఆమె ఇలాంటి కథలను చేసేందుకు డేర్ చేస్తుందని చెప్పొచ్చు. సో కమర్షియల్ సినిమాలు, స్పెషల్ సాంగ్స్ మాత్రమే కాదు ఇక మీదట తమన్నా లేడీ ఓరియెంటెడ్ సినిమాలకు బెటర్ ఆప్షన్ అవుతుందని చెప్పొచ్చు. ఇది తమన్నాకి మంచి లాభమే చేకూరేలా చేస్తుంది. ఓదెల 2 తర్వాత తమన్నా వేసే నెక్స్ట్ స్టెప్ ఏంటన్నది ఆమె ఫ్యాన్స్ చాలా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## ప్రేమలు బ్యూటీ రేటు అదరగొడుతుందిగా!

ఫిల్మ్ ఇండస్ట్రీలో ప్రతీ వారం స్టార్లు మారుతూ ఉంటారు. ఒక వారం ఒకరు విజేతగా నిలిచి స్టార్ అయితే, మరోవారం ఇంకొకరు స్టార్ అవుతాయి. అందుకే ఇండస్ట్రీలో ఎవరెప్పుడు క్లిక్ అవుతారో, ఎవరికెప్పుడు ఎలాంటి స్టార్‌డమ్ వస్తుందో ఎవరూ చెప్పలేరు. కొంతమంది ఎన్నేళ్లు కష్టపడినా క్లిక్ అవకపోతే, మరికొందరికి మాత్రం ఫేమ్ వచ్చి రాత్రికి రాత్రే ఫేమస్ అయిపోతుంటారు. ప్రేమలు సినిమాలో నటించిన మమిత బైజు కు కూడా ఇలాంటి అదృష్టమే పట్టుకుంది. ప్రేమలు సినిమాతో ఓవర్ నైట్ స్టార్ అయిపోయిన మమిత ప్రస్తుతం తెలుగు, తమిళంలో పలు సినిమాల్లో నటిస్తోంది. వరుసపెట్టి సినిమాలు చేస్తున్న అమ్మడు, క్రేజ్ ఉన్నప్పుడే క్యాష్ చేసుకోవాలనే ఆలోచనతో తన రెమ్యూనరేషన్ ను కూడా బాగా పెంచిందని వార్తలు వినిపిస్తున్నాయి. మలయాళ ఇండస్ట్రీలో ముందుగా



ఎన్నో సినిమాల్లో సపోర్టింగ్ రోల్స్ చేసిన మమితకు ప్రేమలు సినిమా మంచి క్రేజ్ ను తెచ్చిపెట్టింది. ఆ సినిమా వల్లే అమ్మడికి పలు భాషల్లో అవకాశాలొస్తున్నాయి. ప్రస్తుతం మమిత టాలీవుడ్ లోని అగ్ర నిర్మాణ సంస్థ అయిన మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న డ్యూడ్ సినిమాతో పాటూ దళపతి విజయ్ హీరోగా నటిస్తున్న జననాయగన్ లో కూడా నటిస్తోంది. ఇంతకుముందు ఒక్కో సినిమాకు రూ. 50 లక్షలు లోపే ఛార్జ్ చేసిన మమిత, ఇప్పుడు డ్యూడ్ కోసం రూ.75 లక్షలు తీసుకుంటుందట. విజయ్ తో చేస్తున్న జననాయగన్ సినిమాకైతే ఏకంగా మమిత రూ. 1 కోటి ఛార్జ్ చేస్తుందని సమాచారం. ఈ రెండూ సినిమాలూ మంచి టాక్ తెచ్చుకుని హిట్ గా నిలిస్తే మమిత క్రేజ్ మరింత పెరగడం ఖాయం. అప్పుడు ఈ రెమ్యూనరేషన్ ను మమిత ఇంకా పెంచే అవకాశాలున్నాయి.




## సంక్రాంతి 2026: అందరూ పెద్ద హీరోలే..



తెలుగు సినిమా ఇండస్ట్రీలో సంక్రాంతి సీజన్ ఎప్పుడూ పెద్ద సినిమాల సందడితో నిండి ఉంటుంది. 2026 సంక్రాంతి కోసం ఇప్పటి నుంచే భారీ చిత్రాలు సిద్ధమవుతున్నాయి. మెగాస్టార్ చిరంజీవి, నందమూరి బాలకృష్ణ, విక్టరీ వెంకటేష్, తమిళ సూపర్‌స్టార్ విజయ్ నటించే సినిమాలు ఈ పండగ సీజన్‌లో బాక్సాఫీస్ వద్ద పోటీ పడనున్నాయి. ఈ సంక్రాంతి రేసు అభిమానులకు ఓ గ్రాండ్ విజువల్ ట్రీట్‌గా నిలవనుంది. తమిళ సూపర్‌స్టార్ విజయ్ తన చివరి సినిమా 'జననాయకన్'తో సంక్రాంతి 2026 రేసులో చేరాడు. హెచ్. వినోద్ డైరెక్షన్‌లో రూపొందుతున్న ఈ సినిమా జనవరి 9న విడుదల కానుంది, తెలుగులో కూడా వైడ్ రిలీజ్ అవుతుంది. %ఖఎచీ% ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం విజయ్ అభిమానులకు పెద్ద ట్రీట్‌గా నిలవనుంది. అందరికంటే ముందుగా పొంగల్ బరిలో విజయ్ నిలిచే అవకాశం ఉంది. ఈ సినిమా రిలీజ్ విషయంలో పెద్దగా డౌట్ అయితే లేదు. మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు అనిల్ రవిపూడితో కలిసి ఓ ఎంటర్‌టైనర్‌తో సంక్రాంతి 2026లో సందడి చేయనున్నారు. ఈ సినిమా షూటింగ్ మే 22 నుంచి హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది. నయనతార హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ నిర్మిస్తోంది. అనిల్ రవిపూడి గతంలో 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో సంక్రాంతి సీజన్‌లో భారీ విజయం సాధించాడు, ఇప్పుడు చిరంజీవితో మరో హిట్ కోసం సిద్ధమవుతున్నాడు. ఇక నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో 'అఖండ 2' సినిమా కూడా సంక్రాంతి రేసులో ఉంది. మొదట ఇదే ఏడాది దసరాకి ప్లాన్ చేసిన ఈ సినిమా, షూటింగ్ ఆలస్యం కారణంగా వాయిదా పడింది. ఇప్పుడు ఈ చిత్రం సంక్రాంతి సీజన్‌లో విడుదల చేయాలని నిర్మాతలు నిర్ణయించారు. ఈ కాంబినేషన్ గతంలో 'అఖండ'తో భారీ విజయం సాధించింది, ఇప్పుడు 'అఖండ 2'తో మరోసారి బాక్సాఫీస్ షేక్ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే విక్టరీ వెంకటేష్, టాప్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఓ ఎంటర్‌టైనర్ సంక్రాంతి విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా షూటింగ్ జులైలో ప్రారంభం కానుంది, హారిక అండ్ హాసిని క్రియేషన్స్ నిర్మాణంలో రూపొందుతోంది. త్రివిక్రమ్ ఈ సినిమాను సంక్రాంతి సీజన్‌లో విడుదల చేయాలని భావిస్తున్నాడు, త్వరలో రిలీజ్ డేట్‌పై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఈ కాంబో అభిమానులకు ఓ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను అందించనుంది. వెంకటేష్, త్రివిక్రమ్ సినిమా ఈ సీజన్‌లో విడుదల కాకపోతే, నవీన్ పోలిశెట్టి 'అనగనగా ఒక రాజు' సినిమా సంక్రాంతి రేసులోకి వచ్చే అవకాశం ఉంది. ఆ కాంబో మిస్సయినా చిరంజీవి, బాలకృష్ణ, విజయ్ సినిమాలు సంక్రాంతి 2026లో బాక్సాఫీస్ వద్ద గట్టి పోటీ ఇవ్వనున్నాయి. ఈ మూడు భారీ చిత్రాలు ఎలాంటి రికార్డులు సృష్టిస్తాయో చూడాలి.


## భగత్ సింగ్ కోసం పవన్ డేట్లు ఇచ్చేసారా?



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ పెండింగ్ పెట్టిన షూటింగ్ లు పూర్తి చేస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే హరిహరి వీరమల్లు – షూటింగ్ ముగించారు. నేటి నుంచి ఓజీ సెట్స్ కు కూడా హాజరవుతున్నారు. ఈ సినిమాకు సంబంధించి పవన్ గత ఏడాదే కొంత షూటింగ్ పూర్తి చేసారు. పెండింగ్ షూటింగ్ నేటి నుంచి మొదలు పెట్టారు. గ్యాప్ తీసుకోకుండా హాజరైతే నెల రోజుల్లో చుట్టేస్తారు. ఈనేపథ్యంలోనే పవన్ ఉస్తాద్ భగత్ సింగ్ షూటింగ్ కూడా షురూ చేస్తున్నట్లు వినిపిస్తుంది. పవన్ డైరెక్టర్ హరీష్ శంకర్ కి ఫోన్ చేసి సిద్దంగా ఉండమని ఆదేశించాడుట. అందుకు హరీష్ కూడా ఎస్ బాస్ అంటూ బదులిచ్చినట్లు సమాచారం. ఈ సినిమా కోసం పవన్ 80 రోజులు కేటాయించాల్సి ఉందిట. దీనిలో భాగంగా జులై నుంచి డేట్లు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతుంది. మరి ఇందులో నిజాలు నిగ్గు తేలాలి. అదే జరిగితే ఏడాది ముగింపు కల్లా చిత్రీకరణ పూర్తవుతుంది. అటుపై సంక్రాంతి రేసులో ఉస్తాద్ ఉంటాడు. అలా హరీష్ లో పీకే జోష్ నింపుతున్నా? మరోవైపు నిరుత్సాహం కూడా ఉంది. %-%ఉస్తాద్ భగత్ సింగ్%-% ఇప్పట్లో రీస్టార్ట్ అవ్వడం కష్టమని భావించిన హరీష్ రామ్...బాలకృష్ణలతో సినిమాలు చేయడానికి రెడీ అవుతు న్నాడు. ఇద్దరికీ కథలు కూడా చెప్పినట్లు ప్రచారంలో ఉంది. ఏ ప్రాజెక్ట్ కన్ఫమ్ అవ్వలేదు గానీ ఒకే అవ్వడానికి ఛాన్సెస్ ఉన్నవే. ఇదంతా పీకే రేసులో కి రాకముందు జరిగిన స్టోరీ. అనూహ్యంగా ఇప్పుడా యన రావడంతో బాలయ్య, రామ్ లను హోల్డ్ లో పెట్టాలి. బాలయ్యతో ఇబ్బందేమి లేదు. ఆయనకు ఇతర డైరెక్టర్లతో కమిట్ మెంట్ ఉంది. కానీ రామ్ చేతుల్లో అన్ని కమిట్ మెంట్లు లేవు. హరీష్ ఒకే అంటే తదుపరి చిత్రాన్ని తనతో చేయాలని లైన్ లో ఉన్నాడు. కానీ ఇప్పుడు సీన్ లో పీకే వచ్చాడు కాబట్టి రామ్ ని కూడా హోల్డ్ లోపెట్టాలి. హరీష్ మరేం చేస్తాడు? అన్నది చూడాలి.

## కాజల్ కెరీర్ కూడా అంతే గ్రాండ్ గా ముగిస్తుందా?


బాలీవుడ్ లో రామాయణం ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. నితీష్ తివారీ దర్శక త్వంలో రూపొందుతున్న చిత్రంలో రాముడి పాత్రలో రణబీర్ కపూర్...సీత పాత్రలో సాయి పల్లవి నటి స్తున్నారు. రావణాసురుడి పాత్రలో పాన్ ఇండియా సంచలనం యశ్ నటిస్తున్నాడు. ఇప్పటికే ప్రధాన పాత్ర ధారులంతా షూటింగ్ లో భాగమయ్యారు. తాజాగా ఈప్రాజెక్ట్ లో కాజల్ అగర్వాల్ కూడా ఎంటర్ అయింది. కాజల్ సినిమాలో రావణుడి సతీమణి మండోదరి పాత్రకు ఎంపికైంది. టీమ్ ఇప్పటికే కాజల్ తో సంప్ర దింపులు జరిపి ఒప్పించినట్లు సమాచారం. గత వారమే కాజల్ పై లుక్ టెస్ట్ కూడా నిర్వహించారుట. మండోదరి పాత్రకు అమ్మడు పర్ఫెక్ట్ గా సూటవ్వడంతో ఎంపిక ఖరారు చేసినట్లు తెలుస్తోంది. కాజల్ సెకెండ్ ఇన్నింగ్స్ ఎంతో గొప్పగా ముందుకెళ్తుంది. వివాహమైన తర్వాత ప్రతిష్టాత్మక చిత్రాలే చేస్తోంది. లేడీ ఓరియేంటెడ్ చిత్రాలతో పాటు శక్తివంతమైన పాత్రలు కాజల్ ని వెతుక్కుంటూ మరీ వె ళు



న్నాయి. విష్ణు హీరోగా నటిస్తోన్న కన్నప్పలో కాజల్ పార్వతిదేవి పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఆ ఫోటోలు కూడా రిలీజ్ అయ్యాయి. వాటికి మంచి రెస్పాన్స్ వచ్చింది. పార్వతిదేవికి నుదిటిన బొట్టు పెట్టని స్టిల్ పై అభ్యంతరాలు వ్యక్తమైనా తర్వాత వాటిని సరిచేసుకున్నారు. ఈ సినిమాలన్నింటికంటే ముందే కెరీర్ ఆరంభంలో మగధీరలు యువరాణి పాత్రతో ఎంతో మందికి కలకల హీరోయిన్ గానూ మారింది. అప్పటి నుంచి ఇండస్ట్రీకి ఎంతో మంది హీరోయిన్లు వచ్చారు. కానీ ఎవరికీ ప్రిన్సెస్ పాత్ర పోషించే అవకాశం రాలేదు. కాజల్ పోషించిన పాత్ర టాలీవుడ్ చరిత్రలోనే నిలి చిపోయింది. పరిశ్రమకు వచ్చిన ప్రతీ హీరోయిన్ కు కాజల్ లాంటి పాత్ర పోషించాలని కోరుకున్న వారే. అలా కెరీర్ ఆరంభంలోనే ట్రెండ్ సెట్టర్ భామగా నిలిచింది. సెకెండ్ ఇన్నింగ్స్ కూడా అంతే అద్భుతంగా కొనసాగిస్తుంది. చూస్తుంటే కాజల్ కెరీర్ కూడా అంతే గ్రాండ్ గాముగించే లా ఉంది. గొప్ప పాత్రలన్ని కాజల్ ని మాత్రమే వెతక్కుంటూ రావడం అన్నది ఆమెకే చెల్లింది.

## ఎన్టీఆర్ మాటలతో చాలా రిలీఫ్ వచ్చింది

మ్యాన్ ఆఫ్ మాసెస్ జూ. ఎన్టీఆర్ క్రేజ్, ఫాలోయింగ్ ఈ మధ్య విపరీతంగా పెరిగాయి. ఆర్ఆర్ఆర్ తర్వాత ఆయన ఖ్యాతి ప్రపంచవ్యాప్తంగా తెలిసింది. దీంతో తన సినిమా రిలీజవుతుందంటే చాలు ఫ్యాన్స్ కు పండగే. థియేటర్లు ఫ్యాన్స్ చేసే హడావిడితో దద్దరిల్లిపోతున్నాయి. ఎన్టీఆర్ యాక్టింగ్ కు, డ్యాన్స్ కు ఫ్యాన్స్ ఉన్నట్టే ఆయన చెప్పే స్పీచులు, ఆయన మాట్లాడే మాటలకు కూడా ఎంతో మంది ఫ్యాన్స్ ఉన్నారు. అవును. ఎన్టీఆర్ పలు సందర్భాల్లో మాట్లాడే మాటలు, చేసే ప్రసంగాలు రియల్ లైఫ్ కు ఎంతో దగ్గరగా, రియాలిటీతో ముడిపడి ఉండటంతో ఆయన స్పీచులకు స్పెషల్ ఫ్యాన్ బేస్ ఉంది. అయితే ఆ ఫ్యాన్స్ లో నార్మల్ ఆడియన్స్ తో పాటూ ఓ హీరోయిన్ కూడా ఉంది. ఈ విషయాన్ని స్వయంగా ఆమే రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో తెలిపింది. ఆమె మరెవరో కాదు, టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ బ్యూటీ కోమలీ ప్రసాద్. 2016 లో నేను



సీతాదేవి అనే సినిమాతో టాలీవుడ్ లో అడుగుపెట్టిన కోమలీ ప్రసాద్ ఆ తర్వాత అనుకున్నది ఒక్కటి అయినది ఒక్కటి, సెబాస్టియన్, రౌడీ బాయ్స్, నెపోలియన్, హిట్2 సినిమాలతో పాటూ రీసెంట్ గా నాని హీరోగా వచ్చిన హిట్3 లో కూడా నటించి బాగా ఫేమస్ అయింది. హిట్3 లో వర్షగా కనిపించి అందరినీ మెప్పించిన కోమలి ప్రసాద్ రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఎన్టీఆర్ గురించి చేసిన కామెంట్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. తన తండ్రి చనిపోయి ఎంతో బాధలో ఉన్న టైమ్ లో తాను ఎన్టీఆర్ మాటల్ని విన్నానని, ఆ మాటలు విన్నాక తనకెంతో కంఫర్ట్ అనిపించిందని, ఆ తర్వాత ఆయన సినిమాలన్నీ చూసి, ఆయనపై అభిమానం, ప్రేమ పెరిగాయని, ఇప్పుడు ఆయనకు నేను చాలా పెద్ద ఫ్యాన్ ను అని కోమలి చెప్పుకొచ్చింది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536